ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


పరిపాలనలో వేగం, పారదర్శకత, ఫలితాల కోసం
**99 రోజుల ప్రత్యేక కార్యాచరణ**
మార్చి 6 నుంచి జూన్ 12 వరకు విస్తృత కార్యక్రమాలు
సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన **03**



సంపుటి 09, సంచిక: 91 | ఆదివారం | 01-03-2026 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# యుద్ధం మొదలైంది..

## ఇరాన్‌పై ఏకపక్షంగా అమెరికా–ఇజ్రాయెల్ క్షిపణి దాడులు

## తిప్పికొట్టిన ఇరాన్ : 8 గల్ఫ్‌దేశాల్లో అమెరికా స్థావరాలపై మిస్సైల్స్ వర్షం

- ఇరాన్ స్కూలుపై క్షిపణిదాడి : 51 మంది బాలికలు మృతి
- డజన్ల సంఖ్యలో ఇరాన్ సైనిక,అణుస్థావరాలపై దాడులు
- మీ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోండి : ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపు
- సుదీర్ఘయుద్ధానికి సిద్ధమైన నెతన్యాహూ
- సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు
- ఇజ్రాయెల్ తీరానికి చేరిన అమెరికా అణువిమాన వాహకనౌక
- ఎర్రసముద్రంలో దాడుల పునరుద్ధరణకు హౌతీల ప్రతిజ్ఞ



**జెరూసలెం:** అలీ ఖమేనీని పదవీచ్యుతుణ్ణి చేసి అమెరికా అనుకూల ప్రభుత్వస్థాపనే లక్ష్యంగా ఇజ్రాయెల్–అమెరికా దళాలు ఇరాన్ వ్యాప్తంగా శనివారం ఉదయం భారీ యుద్ధ దాడులు ప్రారంభించాయి. ఇరాన్ సర్వాధినేత ఖమేనీ (86) నివాసమే లక్ష్యంగా తొలి దాడులు జరిగాయి. ''మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోండి'' అని ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ ప్రజలకు అసాధారణ పిలుపు ఇచ్చారు. తర్వాత కొద్దిసేపటికి గల్ఫ్‌లో అమెరికాకు ఉన్న ఎనిమిది మిత్రదేశాలలో పెంటగాన్ సైనిక స్థావరాలపై ఇరాన్ కూడా ప్రతీకార డ్రోన్, మిస్సైల్ దాడులు చేసింది. ఇజ్రాయెల్‌ను అణచివేస్తామని ఇరాన్ ప్రతిజ్ఞ చేసింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలోని సైనిక కేంద్రాలపై దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైనికదళం ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సహా ఇరాన్ నగరాలైన ఇస్ఫహామ్, కోమ్, లోరెస్తాన్, కరాజ్, కెర్మాన్‌షా, తబ్రిజ్‌లపై క్షిపణి దాడులు జరిగాయి. ఇరాన్ గూఢచారి విభాగం, రక్షణ మంత్రిత్వశాఖ, ఇరాన్ అణుశక్తిసంస్థ, పార్చిన్ సముదాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఖమేనీ నివాసానికి సమీపంలో కూడా పేలుళ్ళు జరిగాయి. కానీ ఆయనను ముందుగానే సురక్షిత ప్రాంతానికి తరలించారు. అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులతో ఇరాన్‌లో అనేకమంది మరణించారు. దక్షిణ ఇరాన్‌లో స్కూలుపై జరిగిన క్షిపణి దాడిలో 51 మంది బాలికలు మరణించారు. రాజధాని నగరంలో భారీ ఎత్తున తరువాయి 2లో



## ఖమేనీ ప్రభుత్వాన్ని కూల్చేయడమే లక్ష్యం

### వీడియోలు విడుదల చేసిన ట్రంప్–నెతన్యాహూ

**వాషింగ్టన్:** ఇరాన్‌లో ఉగ్రవాద ఖమేనీ ప్రభుత్వాన్ని కూల్చివేయడమే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ''మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోండి'' అని ఇరాన్ ప్రజలకు ట్రంప్ అసాధారణస్థాయిలో పిలుపు ఇచ్చారు. ఇరాన్ ఒక ఉగ్రవాద దేశం, దాని దగ్గర అణ్వాయుధం ఉండకూడదని అన్నారు. ''మా దాడుల తర్వాత ఇరాన్ ప్రజలు మీ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకుంటారు'' అని ఖమేనీని హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ గగనతల క్షిపణి దాడులు ప్రారంభించిన తర్వాత ఎనిమిది నిమిషాలు నిడివిగల ట్రంప్ ప్రసంగం వీడియోను ఆయన యంత్రాంగం విడుదల చేసింది. అదేసమయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా హిబ్రూ భాషలో ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు ప్రారంభించినట్లు తెలియజేశారు. బయటదేశం నుండి వస్తున్న బెదిరింపులను నిర్మూలించేందుకు ఇరాన్ ప్రజల విధిరాత మార్చేందుకే తరువాయి 2లో

## భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలి

### భారత రాయబార కార్యాలయం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై ప్రధాన పోరాట ఆపరేషన్ ప్రకటించిన అనంతరం ఇరాన్, ఇజ్రాయెల్‌లోని తమ పౌరులు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని శనివారం భారతదేశం అక్కడి తన పౌరులకు సూచించింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆ దేశంలో ఉన్నటువంటి తన పౌరులు అనవసరమైన ప్రయాణాలను నివారించుకోవాలని, ఇంటిలో ఉండాలని కోరింది. వేగంగా మారుతున్న పరిస్థితికి అనుగుణంగా ఇరాన్‌లోని భారత జాతీయులు అత్యంత అప్రమత్తతో ఉండాల్సిన అవసరాన్ని ఆ ప్రకటన నొక్కిచెప్పింది.సాధ్యమైనంత మేరకు ఎక్కడకు వెళ్లవద్దని, ఇళ్లకే పరిమితం అయితే మంచిదని తెలిపింది. భారతీయులు నిరంతరం వార్తలను సమీక్షించుకోవాలని, పరిస్థితికి తగ్గట్లుగా తరువాయి 2లో

## దాడులను భారత్ ఖండించాలి

### సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన ఏకపక్ష సైనికదాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ చర్యలు అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్య సమితి చార్టర్‌ను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆక్షేపించింది. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం శనివారం ఇక్కడొక ప్రకటన విడుదల చేసింది. ఇటువంటి నిర్లక్ష్య సైనిక చర్యలు యావత్ పశ్చిమ ఆసియా ప్రాంతాన్ని అస్థిరపరిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రజలు తమ రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించే హక్కును పూర్తిగా విస్మరించి, ఇరాన్‌లో పాలన మార్పును విధించే ఒక ప్రమాదకరమైన వ్యూహంలో ఈ దాడులు తరువాయి 2లో







## బాణసంచా పేలుడు

# ప్రాణాలు బుగ్గిపాలు

## 21 మంది సజీవ దహనం

- తొమ్మిది మంది పరిస్థితి విషమం
- గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు
- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో విషాదం
- మృతులకు ప్రధాని మోదీ, ఎపి సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు సంతాపం

సామర్లకోట/కాకినాడ

ఎపి కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని వేట్లపాలెం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అక్కడి బాణసంచా తయారీ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. 21 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో తొమ్మిది మంది ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెండు గంటల పాటు పేలుళ్లు కొనసాగడంతో స్థానికులు ఎవరూ కర్మాగారం దగ్గరకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ధైర్యం చేసి కొందరు ఘటనాస్థలానికి చేరుకునే సమయానికి అనేక మంది కార్మికులు అగ్నికి ఆహుతయ్యారు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఘటనాస్థలి వద్ద పరిస్థితి భీతావహంగా మారింది. మంటల్లో కాలిపోయి, తీవ్రంగా గాయపడిన బాధితులను అతికష్టం మీద ఆసుపత్రికి తరలించారు. బాణసంచా తయారీ కేంద్రం పొలాల తరువాయి 2లో



## కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేయకుంటే

# పోరాటం తప్పదు

- కార్మికుల కష్టార్జితం ఇంకెంతకాలం దోచుకుంటారు?
- ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్
- వరంగల్‌లో ప్రారంభమైన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు
- వరంగల్ పుర వీధుల్లో భారీ ప్రదర్శన : ఎరుపెక్కిన నగరం

ప్రజాపక్షం/వరంగల్

తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ విధానం అమలు చేయకపోతే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రత్యక్ష పోరాటాలు తప్పవని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభలు వరంగల్ జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాలుగో మహాసభల సందర్భంగా వరంగల్ సికెఎం ఆసుపత్రి నుండి రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, వందలాది మంది కార్మికులు ఎర్ర జెండాలు చేతపట్టి ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి కదం తొక్కారు. కార్మిక ర్యాలీలో అగ్ర భాగాన తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల డప్పుల దరువులు ఆసుపత్రి మహిళాకార్మికుల కోలాట నృత్యాలతో వరంగల్ నగరం పురవీధుల గుండా భారీ ర్యాలీతో ఎరుపెక్కింది. అనంతరం తరువాయి 12లో

## ఆ భూమి యథాతథం

- కోకాపేటలో శారదాపీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలి
- జలమండలికి కేటాయింపులు రద్దు చేయాలి
- సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- అధికారులపై ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని సిఎం ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ తరువాయి 2లో

## యుఎస్‌తో వాణిజ్య ఒప్పందం

# భారత రైతులకు దెబ్బ

- ప్రధాని నాలుగు నెలల్లో చేయని పనిని 15 నిమిషాల్లోనే ఎందుకు చేశారు?
- మోదీపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపాటు



**బర్నాల :** భారత్, అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రధాని నరేంద్రమోదీని లక్ష్యంగా చేసుకుని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈ ఒప్పందం భారత రైతులను దెబ్బతీస్తుందని మండిపడ్డారు. శనివారం ఆయన పంజాబ్‌లోని బర్నాలలో జరిగిన కిసాన్ మహాచౌపాల్ ర్యాలీ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి కె సి వేణుగోపాల్, భూపేశ్ బఘేల్, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్, పంజాబ్ ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా, మాజీ ముఖ్యమంత్రులు చరణ్ జిత్ సింగ్ చన్నీ, రాజిందర్ కౌర్ భట్టల్, గురుదాస్ పూర్ ఎంపి సుఖ్ జిందర్ రాంధావా, రాష్ట్రానికి చెందిన మరో సీనియర్ నాయకుడు విజయ్ ఇందర్ సింగ్లా వంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ వ్యవసాయ రంగం ప్రారంభంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందని ఆరోపించారు. ప్రధానమంత్రి తరువాయి 12లో

## నార్మాక్స్‌కు పునర్వైభవం

### సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సాహసోపేత నిర్ణయం!

- రూ. 47 కోట్ల నష్టాల్లో కుదేలైన డైరీని ఎన్‌డిడిబికి అప్పగించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నేడు అలహాబాద్‌కు ఉన్నతస్థాయి బృందం




ప్రజాపక్షం/యాదాద్రి

తెలంగాణ పాడి పరిశ్రమలో ఒకప్పుడు వెలుగు వెలిగిన నల్గొండ రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్ (నార్మాక్) మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అనవసరపు ఖర్చులు, అవినీతి కార్యకలాపాలు, పర్యవేక్షణ లోపంతో సుమారు రూ.47 కోట్ల పేరుకుపోయిన నష్టాలు, రూ.33 కోట్ల నెగిటివ్ నెట్ వర్త్‌తో కుదేలైన ఈ సంస్థను గట్టెక్కించేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. వేలాది మంది రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారు చేసిన కృషి ఫలించి, సంస్థ పగ్గాలను జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డుకి అప్పగించేందుకు మార్గం సుగమమైంది.

**సంక్షోభం నుంచి పరిష్కారం వైపు..**

గత కొంతకాలంగా నార్మాక్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. పాలకు సక్రమంగా చెల్లింపులు అందక రైతులు, తరువాయి 2లో



## భద్రకాళి బండ్ నుండి మోడల్ రాకెట్

### ప్రయోగం విజయవంతం

ప్రజాపక్షం/హనుమకొండ

ఓరుగల్లు గడ్డపై నుండి తొలిసారిగా మోడల్ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఎటిడిఆర్‌ఎల్, కుడా, వరంగల్ ఎన్‌ఐటి సమన్వయంతో చేపట్టిన ఈ ప్రయోగం భద్రకాళి బండ్ వేదికగా తరువాయి 12లో



## అన్నిమార్గాల్లో ఆత్మరక్షణ చర్యలు

అరాఘ్చి

**టెహ్రాన్:** ఇరాన్ తన ఆత్మరక్షణకోసం అన్ని సైనిక మార్గాలనూ అనుసరిస్తుందని ఆ దేశ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. ఇరాన్ తరపున అమెరికాతో ఇన్నాళ్ళూ జరిగిన చర్చలన్నీ ఆయన నాయకత్వంలోనే జరిగాయి. తమకు ఉన్న హక్కుల మేరకు అన్ని విధాలుగా సైనిక బలం సమకూర్చుకుని పోరాటం చేస్తామని అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్,కువైత్, బహ్రైన్, సౌదీఅరేబియా, ఇరాక్ దేశాల ప్రతినిధులతో ఆయన ఫోన్‌కాల్స్ చేసి మాట్లాడారు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి శతవిధాల పోరాటం చేస్తామని వారికి తెలియజేశారు. తాను ఫోన్‌చేసిన దేశాలను ప్రస్తావిస్తూ, ఈ దేశాలన్నీ తమ తమ భూభాగాలను ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉపయోగించుకోకుండా అమెరికా, ఇజ్రాయెల్‌లను అడ్డుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.



## ఇరాన్‌లో ప్రభుత్వ మార్పిడికి దౌత్యం ఒక ముసుగు

చైనా నిపుణుడి విమర్శ

**బీజింగ్:** ఇరాన్‌లో, పశ్చిమ ఆసియాలో జరుగుతున్న పరిణామాలను కొద్దిరోజులుగా నిశితంగా చైనా అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు పరిశీలిస్తున్నారు. శనివారం ఉదయం ఇరాన్‌పై యుద్ధ దాడుదల తర్వాత వారు స్పందిస్తూ, ఇరాన్‌పై పరిపాలనను తమకు అనుకూలంగా మార్పు చేయాలని ఎప్పటినుండో అమెరికా, ఇజ్రాయెల్ కోరుకుంటున్నాయని ఒక నిపుణుడు విమర్శించారు. ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుంటే ఆకస్మికంగా ఈ దేశాలు ఎందుకు ఇరాన్‌పై దాడి చేశాయి? ఇది అసంబద్ధం అని ఆయన విమర్శించారు. సైనిక దాడులు చేస్తే ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందని వారు ప్రశ్నించారు. చైనా పత్రిక వారి అభిప్రాయాలను ప్రచురించింది. వారు ఇరాన్‌లో తమకు అనుకూలమైన ప్రభుత్వం రావాలని మార్పు కోరుకుంటున్నారు, అందుకోసం వారు దౌత్యమార్గాన్ని ఒక ముసుగులాగా తొడుక్కున్నారని, ఆ ముసుగులో దాడులు చేస్తున్నారన్నారు. కాగా చైనా రక్షణ నిపుణుడు ఒకరు మాట్లాడుతూ, ఈ దశలో ఇరాన్‌పై అమెరికా గగనతలదాడులు చేస్తోందని, మరోవైపు ఇరాన్ పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలను దెబ్బతీసేందుకు మానవ రహిత డ్రోన్లు, క్షిపణులను మోహరిస్తోందని అన్నారు. రింపాక్ స్ట్రాటజిక్–ఇంటర్నేషనల్ స్టడీస్ షాంఘై సెంటర్ ఎకడమిక్ కమిటీ డైరెక్టర్, వైస్‌చైర్మన్ లీ క్వియాంగ్ మాట్లాడుతూ, 1979లో ఇరాన్ చేజారిపోయిన తర్వాత అమెరికా అప్పటినుండీ ప్రభుత్వ మార్పుకోసం చాలా పట్టుదలగా ఎదురుచూస్తోందన్నారు.పశ్చిమ ఆసియాలో అమెరికా తన పట్టును నిలబెట్టుకోలేదని, తన అధికారాన్ని స్థిరీకరించుకోలేదని అన్నారు. షాంఘైలో పశ్చిమ ఆసియా అధ్యయనాల విభాగం ప్రొఫెసర్ డింగ్‌లాంగ్ మాట్లాడుతూ, గత ఏడాది నుండి అమెరికా ఇరాన్‌తో చర్చలను ఒక ముసుగులాగా ఉపయోగించుకుందని, ఈ సమయంలో ఇజ్రాయెల్‌తో కలిసి దాడులకు ప్రణాళిక చేసిందని విమర్శించారు.

## కిల్లర్స్‌ను అణచివేసేందుకే ట్రంప్ జోక్యం

### సమీపంలోనే తుది విజయం: రెజా పహ్లవీ



**వాషింగ్టన్ :** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేసిన తరుణంలో అమెరికాలో తలదాచుకుంటున్న ఇరాన్ పూర్వపు రాజకుమారుడు (1979) రెజా పహ్లవీ శనివారం ఒక సందేశం విడుదల చేస్తూ తుది విజయం అతి మీపంలోనే ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. ఈ దాడులను 'ఇది మానవతావాద జోక్యం, ఇస్లామిక్ రిపబ్లిక్‌ను, అణచివేత, హత్యలకు పాల్పడే దాని యంత్రాంగాన్ని నిర్మూలించే జోక్యమే తప్ప మహోన్నతమైన ఇరాన్ రాజ్యాన్ని, ఇరాన్ ప్రజలను అణచవేసే చర్య కాదు' అని పేర్కొన్నారు. ప్రస్తుత తరుణం ఒక నిర్ణయాత్మకమైన మేలి మలుపు అని పేర్కొన్నారు. 'ప్రియమైన ఇరాన్ పౌరులారా, ఇరాన్ తలరాత మారిపోయే సమయం సమీపించింది, ధైర్యవంతులైన ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు పంపించిన సహాయం ఇప్పుడు అందింది, ఇది మనందరి విజయం కాబోతోంది, మనం విజయం సాధించడానికి సిద్ధంగా ఉన్నాం, విజయానికి సమీపంలో ఉన్నాం' అన్నారు. ఇరాన్ ప్రజలు, భద్రతాదళాలు, ట్రంప్‌లను ఉద్దేశించి సందేశం రాశారు. ఇరాన్ ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ఇరాన్ మత పాలకుడు ఖమేనీకి వ్యతిరేకంగా మరోసారి అల్లర్లు, పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని కూడా రెచ్చగొట్టే ప్రకటన చేశారు. ఖమేనీ పరిపాలనను కూల్చివేసి ఆయన స్థానంలో రెజా పహ్లవీని అధికారంలో నిలబెట్టేందుకు అమెరికా అధ్యక్షుడు సన్నాహాలు చేస్తున్నారు. 'ఈ దాడుల తర్వాత ఇరాన్‌లో మీ పరిపాలనను ప్రజలు స్వాధీనం చేసుకుంటారు' అని ట్రంప్ తన తాజా వీడియోలో ఖమేనీకి హెచ్చరిక చేశారు. ఇరాన్‌లో ఖమేనీ పాలనను అంతం చేయడమే తన లక్ష్యమని బాహాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెజాపహ్లవీ కూడా ఇరాన్ ప్రజలకు ఒక సందేశం పంపించారు. గత నెల 14,15 తేదీలలో ఇరాన్‌లో దారుణహింస, అణచివేత చర్యలకు రెజా పహ్లవీ రెచ్చగొట్టే ప్రకటనలు కూడా ఆజ్యం పోశాయి.

## వియన్నాలో వచ్చేవారం అమెరికా–ఇరాన్ తదుపరి చర్చలు

అమెరికా–ఇరాన్ మధ్య తదుపరి అణుచర్చలు ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరుగుతాయని మధ్యవర్తిదేశం ఒమన్ అధికార ప్రతినిధి బదర్ అల్బుసైది ప్రకటించారు. ఫిబ్రవరి 26వ తేదీన జెనీవాలోని ఒమన్ విదేశీమంత్రిత్వ శాఖ కార్యాలయంలో జరిగిన చర్చలు ఆశాజనకంగా ఉన్నాయనీ, ఎంతో ప్రాముఖ్యత సంతరిచుకునేస్థాయిలో ప్రగతి సాధధించాయని ఒమన్ ప్రకటించింది. జెనీవాలో ఆగిపోయిన సాంకేతికస్థాయి చర్చలు వియన్నాల్లో కొనసాగుతాయన్నారు. కానీ ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌తో చర్చలవల్ల తాను పూర్తిగా విసిగిపోయానని విమర్శించారు. జెనీవాలో ముగిసిన మూడో రౌండ్ చర్చల సారాంశం ఇతిమిత్థంగా బయటకు రాకపోయినప్పటికీ ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి నాయకత్వానగల ప్రతినిధిబృందం చాలా సానుకూలంగా స్పందించింది. అణ్వాయుధాలను తయారు చేయడం తమ ఉద్దేశం కాదని, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ట్రంప్ డిమాండ్‌లను తాము అంగీకరిస్తామని చెప్పారు. ఈ మేరకే ఖమేనీ ప్రధాన సలహాదారు అలీ షంఖానీ గురువారం రాత్రి పొద్దుపోయాక ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేశారు. అణ్వాయుధాల ఉత్పత్తి చేయకూడనే షరతు వరకూ అయితే అమెరికాతో తక్షణం ఒప్పందం చేసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని షంఖానీ పేర్కొన్నారు. అమెరికా గనుక ఇక ఎక్కువ గొంతెమ్మ కోరికలు కోరకుండా అంతవరకూ సరిపెట్టుకుంటే తక్షణం ఒప్పందం కుదరగలదని ఆయన చెప్పడంతో జెనీవా చర్చల్లో సానుకూలమైన ముందడుగు పడినట్టు అందరూ భావించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆపేయాలని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ట్రంప్ మొదటినుండీ చెబుతున్నారు. అణ్వాయుధాల ఉత్పత్తిని నిషేధించడం వరకూ ఎలాంటి అభ్యంతరం లేదని షంఖానీ అన్నారు. శాంతియుత ప్రయోజనాలకోసం యురేనియంను శుద్ధిచేయడం ఇరాన్‌కు ఉన్న హక్కు అన్నారు.

## నార్మాక్స్‌కు పునర్వైభవం (మొదటి పేజీ తరువాయి)

నెలల తరబడి జీతాల్లేక ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ఈ దుస్థితిని గమనించిన బీర్ల ఐలయ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సంస్థ పరిస్థితిని వివరించి, ఎన్డీడీబీకి అప్పగిస్తేనే మనుగడ సాధ్యమని ఒప్పించడంలో వారు విజయం సాధించారు. పాడి రైతుల ప్రయోజనాలే పరమావధిగా భావించిన ముఖ్యమంత్రి, దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**నేడు 'ఆనంద్' పయనం.. అగ్రిమెంట్‌పై చర్చలు!**

నిర్వహణా ఒప్పందంపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, డెయిరీ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం ఆదివారం గుజరాత్లోని ఆనంద్ (ఎన్‌డిడిబి ప్రధాన కార్యాలయం) వెళ్లనుంది. అక్కడ ఎన్‌డిడిబి ఉన్నతాధికారులతో సమావేశమై నిర్వహణ ఒప్పందంపై నిర్ణయం తీసుకోనున్నారు.

**ఒప్పందం కుదిరితే రైతులకు మేలు– ఉద్యోగులకు భరోసా**

మదర్ డెయిరీ నైపుణ్యంతో పాల సేకరణ మెరుగుపడుతుంది. సరైన సమయానికి గిట్టుబాటు ధర, బోనస్ అందుతాయి. ప్లాంట్ ఆధునీకరణ చెంది లాభాల బాట పడితే, ఉద్యోగుల జీతభత్యాల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. మదర్ డెయిరీ మార్కెటింగ్ వ్యూహాలతో నార్మాక్ ఉత్పత్తులు మళ్లీ మార్కెట్‌లో దూసుకుపోనున్నాయి.

## ఆ భూమి యథాతథం (మొదటి పేజీ తరువాయి)

సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని పీఠం ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు.

## ప్రాణాలు బుగ్గిపాలు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య ఉండటంతో అక్కడికి ఫైరింజన్, అంబులెన్స్ వెళ్లే మార్గం లేదు. వరిపొలాలు బురదమయంగా ఉండటం వల్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఈ ప్రమాదం తీవ్రతను పెంచినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం భోజనానికి కార్మికులు కొందరు వెళ్లడంతో దుర్ఘటన సమయంలో 34మంది పనిచేస్తున్నట్లు అంచనా. అయితే మృతుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఈ ఘటనలో మూడు షెడ్లు పూర్తిగా ధ్వంసం కాగా, అక్కడ ఉన్న వాహనాలు దగ్ధమయ్యాయి. పేలుడు జరిగినప్పుడు కర్మాగారంలో భారీ ఎత్తున మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాల శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలు ఆర్పారు. మతుల్లో అడబాల శ్రీను, కడింపల్లి కపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నాని.. మొత్తం 11మందిని పోలీసులు గుర్తించారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. కొన్ని మతదేహాలు పూర్తిగా కాలిపోగా మరికొన్ని పక్కనున్న వరిపొలాల్లో పడటంతో, డ్రోన్ కెమెరాల ద్వారా వాటిని గుర్తించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి గాలింపులు చేపట్టారు. కలెక్టర్ షన్మోహన్, ఎస్‌పీ బిందు మాధవ్ ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసులు, వైద్యులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులు ఆదేశాలిచ్చారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్న వారిలో వేట్లపాలెం వాసి కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె.శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు అంటున్నారు. యజమాని పరారీలో ఉన్నట్లు తెలిసింది.



**సిఎం ఆరా పరామర్శ:** విజయనగరం జిల్లా పర్యటన ముగించుకొని సిఎం చంద్రబాబు సామర్లకోట, వేట్లపాలెం చేరుకున్నారు. ఘటనాస్థలాన్ని సందర్శించారు. చేపట్టిన సహాయక చర్యల గురించి ఆరా తీశారు. క్షతగాత్రుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు సిఎంకు వివరించారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మృతుల బంధువులకు ధైర్యం చెప్పారు. కూటమి నాయకులు, ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, మంత్రి కందుల దుర్గేశ్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, బిజెపి నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.

**తెలంగాణ సిఎం దిగ్భ్రాంతి:** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ప్రధాని సంతాపం: రూ.2 లక్షల పరిహారం**

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున పరిహారాన్ని 'ఎక్స్'లో ప్రకటించారు.

## భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలి (మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించాలని, భారత రాయబార కార్యాలయం తదుపరి మార్గదర్శకాల కోసం నిరీక్షించాలని, దీనికి సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన వివరాలు కూడా అందజేస్తున్నామని మిషన్ తెలియజేసింది. జనవరిలో అధికారిక అంచనాల ప్రకారం ఇరాన్‌లో విద్యార్థులు సహా 10,000మందికి పైగా భారతీయులు నివసిస్తున్నారని వెల్లడించారు. ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇదే తరహా అడ్వైజరీనే జారీ చేసింది. ఇజ్రాయెల్‌లో భారతీయపౌరులు అత్యంత జాగ్రత్తగా, అన్ని సమయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా ఇజ్రాయెల్‌లోని భారతీయ ప్రవాసుల సంఖ్య 41,000కు పైగానే ఉంది.

## భారత్ ఖండించాలి (మొదటి పేజీ తరువాయి)

భాగమని సిపిఐ గట్టిగా విశ్వసిస్తోందని సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా పేరిట విడుదల అయిన ఈ ప్రకటన తెలిపింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తోన్న సైనిక దురాక్రమణను తక్షణమే బేషరతుగా నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్య సమితి వెంటనే జోక్యం చేసుకుని ప్రాంతీయ శాంతిని కాపాడాలని కోరింది. ఈ దాడులు కొనసాగటం వల్ల పశ్చిమాసియా అంతటా అస్థిరత, దుర్భరత్వం, విధ్వంసం తీవ్రతరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. భారత ప్రభుత్వం ఈ దాడులను స్పష్టంగా ఖండించాలని సిపిఐ డిమాండ్ చేసింది.ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఈ దాడులు జరుగుతున్నాయని, ఈ ప్రమదకరమైన సైనికచర్యలకు వ్యతిరేకంగా భారత్ గళమెత్తాలని విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించే, ప్రాంతీయ, ప్రపంచ శాంతికి హాని కలిగించే చర్యలకు భారతదేశం ఏ రూపంలోనూ మద్దతు తెలపొద్దని అభ్యర్థించింది. ఇరాన్‌లోని పౌరుల భద్రతను నిర్ధారించడం, భారతదేశం వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలకు అంతర్భాగంగా ఉన్న కీలకమైన వాణిజ్య పెట్టుబడి సంబంధాలు సహా ద్వైపాక్షిక సంబంధాలను కాపాడుకోవడం భారత ప్రభుత్వ బాధ్యత అని సిపిఐ జాతీయకార్యదర్శివర్గం హితవు పలికింది.

## కూల్చేయడమే లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

ఈ దాడులు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్‌తో కలిసి ఉమ్మడి దాడి ప్రారంభించినట్లు ట్రంప్ తన వీడియోలో తెలియజేశారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమం పట్ల తాను ఎంతమాత్రం సంతోషంగా లేననీ, చర్చలు సంతృప్తికరంగా లేవని, ఈ చర్చలతో తాను విసిగిపోయానని ముందురోజు ట్రంప్ ప్రకటించారు. ''ఇరాన్ క్షిపణి పరిశ్రమను లక్ష్యంగా దాడులు చేస్తున్నాం, హమాస్‌ను ఇరాన్ పెంచిపోషిస్తోంది, హమాస్ సంస్థ ద్వారా ఇజ్రాయెల్‌తో ఇరాన్ పరోక్ష యుద్ధం చేస్తోంది, ఇరాన్ నెంబర్–01 టెర్రరిస్టుదేశం, దాని దగ్గర అణ్వాయుధం ఉండకూడదు, ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్ (గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై అమెరికా దాడి) సమయంలో ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలను ధ్వంసం చేశాం, వారు అంతటితో ఆగలేదు, మళ్ళీ అణ్వాయుధ కార్యక్రమాన్ని చేపట్టారు, అమెరికా మిత్రకూటమి దేశాలపై దాడులు చేయడంకోసమే క్షిపణులను వారు తయారు చేస్తున్నారు, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోంది, అందుకే అమెరికా ఈ దాడి కార్యక్రమాన్ని ఇరాన్‌తో కలిసి చేపట్టింది, అమెరికా దేశం, అమెరికా ప్రజల భద్రత లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నాం, ఇరాన్ ఒక టెర్రరిస్టుదేశం, దాని దగ్గర అణ్వాయుధం ఉండకూడదు, ఈ మధ్యనే అనేకవేలమంది ప్రదర్శకులను దారుణంగా చంపింది, ఈ విధంగా అణ్వాయుధాలతో అమెరికా సాయుధబలగాలను ఎవ్వరూ సవాలు చేయకూడదు, అందేరూ ఈ రిస్కు తగ్గించేందుకు కావాల్సిన అన్ని చర్యలూ చేపడతాం, భవిష్యత్తుకోసం ఈ గొప్ప ఘనకార్యం చేపట్టాం, ఎవ్వరూ ఇకమీదట అణ్వాయుధాలతో బెదిరింపులు చేయకూడదు, ఇరాన్‌లోని సైన్యం ఐఆర్‌జిసి కూడా ఆయుధాలను వదిలిపెట్టేయాలి, లేకపోతే వారు మూల్యం చెల్లించాలి,అమెరికా స్వేచ్ఛకోసం ప్రజలు ఏకం కావాలి, రాబోయే తరాలకు ఈ చర్య ఎంతో ముఖ్యమైనది, ఏ అధ్యక్షుడూ ఇలాంటి చర్యలు తీసుకోడు, కానీ నేను చెయ్యడానికి సిద్ధపడ్డాను, ప్రజలు అర్థం చేసుకోవాలి, ఇది కార్యాచరణ చేపట్టే సమయం, క్రియాశీల సమయం, అమెరికాను ఆ దేవుడు ఆశీర్వదించాలి'' అని ట్రంప్ తన వీడియో ప్రసంగంలో పేర్కొన్నారు.

## ఖమేనీ ఇంకా సజీవంగానే ఉన్నారు

ఇజ్రాయెల్ వందతులకు అరాఘ్చి ఖండన

**టెహ్రాన్:** అమెరికా–ఇజ్రాయెల్ శనివారం ప్రారంభించిన ''ఆపరేషన్ లయన్స్ రోర్'' యుద్ధ దాడుల్లో ఖమేనీ మరణించారని ఇరాన్‌లో శనివారం వదంతలు మొదలయ్యాయి. ఇజ్రాయెలీ పత్రికలు ఈ వందతులను వ్యాప్తిచేశాయి. దీనిపై ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి వివరణ ఇచ్చారు. నాకు తెలిసినంతవరకూ ఇరాన్ సర్వాధినేత ఆయొతొల్లా అలీ ఖమేనీ ఇంకా సజీవంగానే ఉన్నారని అరాఘ్చి ప్రకటించారు. ఇజ్రాయెల్–అమెరికా ఆకస్మికంగా శనివారం ఉదయం దాడులు ప్రారంభించిన తర్వాత సాయంత్రం అరాఘ్చి ఈ మేరకు ప్రకటన చేశారు. అలీ ఖమేనీ మరణించారని ఇజ్రాయెలీ ఛానల్–12 ప్రకటన చేసిన తర్వాత ఎన్‌బిసి న్యూస్‌కు ఆరాఘ్చి ఇచ్చిన ఒక లైవ్ ఇంటర్వ్యూలో, ''ఈ దాడుల్లో ఇద్దరు కమాండర్లు మరణించారు, ఉన్నతస్థాయికి చెందిన సీనియర్ కమాండర్లు అందరూ సజీవంగానే ఉన్నారు, నాకు తెలిసీ ఖమేనీ ఇంకా సజీవంగానే ఉన్నారు'' అని చెప్పారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఖమేనీ నివాసం పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలను అమెరికా న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రచురించడంతో ఈ వదంతులు బలపడ్డాయి. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌ను కూడా లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్–అమెరికా దాడులు చేశాయి.

## ఇరాన్ రక్షణమంత్రి

రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మృతి

దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి అమీర్ నాసిర్జాదే (62), ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహ్మద్ పక్పూర్(65) ఇద్దరూ మరణించారని వార్తాలు వెలువడ్డాయి. ఏకంగా మూడు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ ఈ వార్త ప్రచురించింది. 2024 నుండీ నాసిర్జాదే అధ్యక్షుడు పెజెష్కియన్ మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నారు. అంతకుముందు ఆయన నాలుగు సంవత్సరాలు ఇరాన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మ్‌డ్ స్టాఫ్‌గా పనిచేశారు. ఇక పక్పూర్ ఏడాది కాలంగా ఐఆర్‌జిసిలో కమాండర్‌గా కొనసాగుతున్నారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేసిన దాడుల్లో కూడా లెక్కలేనంతమంది ఇరాన్ కమాండర్లు, నాయకులు మరణించారు. బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలు, లాంఛర్లు కూడా నాశనమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించామని ట్రంప్ ఆనాడు పదే పదే ప్రకటించారు. కానీ ఇప్పుడు మళ్ళీ అదే వంకతో దాడులు చేశారు.

## యుద్ధం మొదలైంది..

(మొదటి పేజీ తరువాయి)

ఆకాశంలో పొగ మేఘాలు కమ్ముకున్నాయి. పేలుళ్ళకారణంగా శిథిలాలు, చెత్త శకలాలు గాలిలోకి చాలా ఎత్తుకు పైకి లేచాయి. ప్రధాన రహదారుల్లో వెళుతున్న వాహనాలు గాలిలో కమ్ముకున్న పొగలుచూసి డ్రైవింగ్ ఆపేశారు. సోషల్ మీడియాలో టెహ్రాన్‌లో దాడుల వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ వీడియోల్లో వెనుక వస్తున్న మాటల్లో, ''ఈ మంటలు ఎక్కడివి? అది ఖమేనీ ఇల్లు'' అని మాటలు వినిపించాయి. ఖమేనీ ఇంటికి కిలోమీటరు దూరంలోనే పేలుళ్ళు సంభవించాయి.

కువైట్, జోర్డాన్, బహ్రైన్, సౌదీఅరేబియా, ఇరాక్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్ దేశాలపై ఇరాన్ సైన్యం భారీసంఖ్యలో డ్రోన్ దాడులు చేసింది. బహ్రైన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ నావికాదళ కేంద్ర కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసిందని బహ్రైన్ ప్రభుత్వం ప్రకటించింది. సెంట్రల్, సదరన్ ఇజ్రాయెల్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రవాహంలాగా ఇరాన్ ప్రయోగిస్తూ ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్ ధ్వనులతో అనేక ప్రాంతాలు మారుమోగుతున్నాయి. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో పలుచోట్ల అమెరికా స్థావరాలపై దాడులు జరిగాయని, రియాద్‌లో పేలుడు శబ్దాలు వినిపించాయని ఎఎఫ్‌పి ప్రతినిధి తెలియజేశారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భూసంబంధమైన సరిహద్దులు లేనందువల్ల ప్రధానంగా గగనతల క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి.లుఫ్తాన్‌సా సహా అనేక విమానయాన సంస్థలు,ఇజ్రాయెల్, పశ్చిమాసియా ప్రాంతాలకు విమానాలను రద్దుచేశాయి. మరోవైపు అమెరికా అణు యుద్ధ విమాన వాహకనౌక 'గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'ఉత్తర ఇజ్రాయెల్ హాఫా తీరానికి చేరుకుంది. ఇదేసమయంలో, ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై, ఇజ్రాయెల్‌కు వెళ్ళే నౌకలపైన దాడులను పునరుద్ధరిస్తామని ఇరాన్ మద్దతుతో యెమెన్ కేంద్రంగా పనిచేసే హౌతీలు ప్రతిజ్ఞ చేశారు.

ఇజ్రాయెల్ తన దేశ సరిహద్దుల్లో భారీ ఎత్తున సైన్యాలను మోహరించింది. త్రివిధ దళాలను అప్రమత్తం చేసింది. దాడులు ప్రతిదాడులతో పశ్చిమా ఆసియాలో యుద్ధజ్వాలలు చెలరేగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ శనివారం క్షిపణులతో మొట్టమొదట దాడులు ప్రారంభించింది. దీంతో ఇరాన్ చమురు ధరలు భారీగా పెరిగాయి. అమెరికా స్టాక్స్ కుప్పకూలాయి. దాడులు ప్రారంభం కాగానే ఇరాన్ ప్రభుత్వం గగనతల వ్యవస్థను మూసివేసింది. దేశవ్యాప్తంగా సంపూర్ణంగా ఇంటర్నెట్ బ్లాకైట్ అమలులోకి వచ్చింది. నెట్‌వర్క్ బ్లాకౌట్స్ సోషల్ మీడియాలో ఈ విషయం వెల్లడించాయి. ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని ఆదేశించింది. గ్యాస్ స్టేషన్లవద్ద ప్రజలు వంట ఇంధనం కోసం బారులు తీరి నిలబడ్డారు.దాడుల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని ప్రభుత్వం అదేశించింది. భయంతో కొంతమంది ప్రజలు రాజధాని టెహ్రాన్‌ను వదిలి గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు.

అదేవిధంగా ఇరాన్ ప్రతిదాడుల అవకాశం ఉండటంతో ఆ తీవ్రతను తగ్గించేందుకు ఇజ్రాయెల్ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. షెబా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను, ఆ సేవలు,పరికరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇజ్రాయెల్ వరుస క్షిపణి దాడులు చేస్తే బాంబు షెల్టర్లలో ఉండవచ్చునని, తర్వాత బయటకు రావచ్చునని తెలిపింది. ఇప్పటికే విధుల్లో ఉన్న 50,000మంది రిజరిస్టులకు మద్దతుగా మరో 20,000మంది రిజర్విస్టులను కూడా ఇజ్రాయెల్ యుద్ధరంగంలోకి రావాలని ఆదేశించింది.ప్రధానంగా వైమానిక దళం, ఇంటిలిజెన్స్ డైరెక్టరేట్, హోం ఫ్రంట్ కమాండ్, నావికాదళంలో ఉన్నవారిని ప్రధానంగా యుద్ధంలోకి రప్పిస్తున్నారు. నిజానికి చెప్పాలంటే అనేక రోజుల నుండి ఇరాన్‌పై యుద్ధానికి ఇజ్రాయెల్ సన్నద్ధమవుతోంది. ఇజ్రాయెల్ అధికారులు శనివారం ఈ విషయం వెల్లడించారు. గల్ఫ్‌లో వివిధ దేశాల్లో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయాలు సోషల్ మీడియాలో ప్రకటనలు చేశాయి. దౌత్యసిబ్బంది, అమెరికన్లు ఒకే చోట ఆశ్రయం పొందాలని, ఉద్రిక్తత తగ్గేవరకూ ఇదేవిధానం కొనసాగించాలని తెలిపాయి. అత్యవసర విధుల్లో లేని సిబ్బంది, దౌత్యవేత్తల కుటుంబాలు ఇజ్రాయెల్ వదలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవచ్చునని అలా వెళ్ళాలనుక్నువారు తక్షణం బయలుదేరాలన ఇజ్రాయెల్‌లో ఉన్న అమెరికా రాయబారి మైక్ హక్కబీ ఈ–మెయిల్ ద్వారా తెలియజేసినట్లు న్యూయార్క్‌టైమ్స్ పత్రిక ప్రకటించింది.

అణుకార్యక్రమానికి ఇరాన్ ఒక కంచుకోటగా మారినందువల్ల, అణు క్షిపణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించినందువల్ల ఇరాన్‌లో డజన్లసంఖ్యలో సైనికస్థావరాలపై విస్తారమైన సమన్వయంతో అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నట్లు ఐ.డి.ఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ స్టాఫ్) ఒక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌కు దీర్ఘకాలంగా నేటికీ ఎదురవుతున్న బెదిరింపులను, ఇరాన్‌లో ఉన్న ఉగ్రవాద ప్రభుత్వాన్ని దాడుల ద్వారా నిర్మూలించే లక్ష్యంతో పవర్‌ఫుల్ ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపింది. గతఏడాది జూన్‌లో దాడులు చేసిన తర్వాత ఘోరంగా దెబ్బతిన్నప్పటికి ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని వదిలిపెట్టకుండా మళ్ళీ ప్రారంభించిందని ఐడిఎఫ్ తన దాడులను సమర్థించుకుంటూ ప్రకటన చేసింది. ఐడిఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మధ్యవర్తిదేశం ఒమన్‌కు జెనీవాలో ఉన్న దౌత్యకార్యాలయంలో ఫిబ్రవరి 26వ తేదీన జరిగిన తుది విడత–మూడో రౌండ్ చర్చల తర్వాత, అణ్వాయుధాలు తయారు చేయడం మానుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, షరతులు అంతవరకూ మాత్రమే పరిమితమైతే తక్షణం అమెరికాతో ఒప్పందానికి సుముఖంగా ఉన్నట్లు ఖమేనా ప్రధాన సలహాదారు ఒక ప్రకటన చేసినప్పటికీ అమెరికా సానుకూలంగా స్పందించలేదు.

**శాటిలైట్ చిత్రాల్లో ధ్వంసమైన ఖమేనీ కాంపౌండ్**

శాటిలైట్ చిత్రాల్లో అలీ ఖమేనా నివాసిత ప్రాంగణం ధ్వంసమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉన్న ఖమేనీ నివాసప్రాంత కాంపౌండ్ ధ్వంసమైన ఉపగ్రహ చిత్రాలను న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రచురించింది. ఇరాన్ నాయకత్వాన్ని నిర్మూలించడంలో ఇప్పటివరకూ జరిపిన దాడుల్లో ఘన విజయం సాధించామని అంచనావేస్తున్నామని, కానీ ఫలితాలు ఇంకా అస్పష్టంగా ఉన్నాయని పేరు చెప్పని అధికారి ఒకరు ప్రకటించినట్లు ఇజ్రాయెల్ ఛానల్–12 శనివారం సాయంత్రం తెలియజేసింది.సైనిక సెన్సార్‌షిప్ అమలులో ఉన్న ఈ తరుణంలో పరిమితస్థాయిలో వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ సర్వాధినేత ఖమేనీ, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, ఇతర సీనియర్ కమాండర్లస్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఇజ్రాయెల్ అధికారవర్గాలను ఉటంకిస్తూ టీవీ ఛానల్ తెలియజేసింది. ఐతే ఈ నివేదికలను ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. ఇజ్రాయెల్ ఆరంభదాడుల్లో అధ్యక్షుడు, సీనియర్ కమాండర్ల స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హీబ్రూ మీడియా ప్రకటించింది. దాడుల ఫలితాలపట్ల ఇజ్రాయెల్ చాలా సంతృప్తి చెందినట్లు మీడియా పేర్కొంది. కాగా ''ఎన్నాళ్ళుగానో కోరుకుంటున్నవిధంగా ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమే ఇజ్రాయెల్–అమెరికా రాజకీయ లక్ష్యం, అందుకే చర్చలపట్ల అమెరికా అధ్యక్షుడు అసంతృప్తి వ్యక్తం చేశారు'' అని మేజర్ జనరల్ ఎస్.బి.అస్థానా భారత్ మీడియాలో వ్యాఖ్యానించారు.

## యుద్ధంవల్ల వచ్చే సమస్యలపై అమెరికా టాప్ జనరల్ చర్చలు

ఇరాన్‌తో యుద్ధంలో ఎలాగైనా గెలవాలని వారం, పదిరోజుల క్రితమే ఛైర్మన్ ఆఫ్ ద జాయింట్ చీఫ్స్ జనరల్ డాన్ కైన్‌పై ట్రంప్ ఒత్తిడి తీసుకువచ్చారు. ఒకవేళ ఇరాన్‌లో యుద్ధం మొదలుపెడితే అంత తొందరగా ఆ యుద్ధం లోంచి బయటకు రావడం కష్టం అవుతుందని, సుదీర్ఘ యుద్ధం చేసేందుకు సిద్ధపడాలని జనరల్ డాన్ కైన్ హెచ్చరించడంతో వారిద్దరిమధ్యా విభేదాలు తలెత్తాయి ఆనాడే పత్రికలు వార్తలు రాశాయి. ఆ తర్వాత మూడు రోజులకు ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ తనకు జనరల్ డాన్ కైన్‌కు మధ్య ఎలాంటి విభేదాలు లేవని వివరణ ఇచ్చారు. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభించడానికి రెండు రోజుల ముందు ఒకవైపు జెనీవాలో చర్చలు జరుగుతున్న సమయంలోనే డాన్ కైన్ అమెరికా త్రివిధ దళాధిపతులను తన వద్దకు పిలిపించి యుద్ధ సన్నాహాలపై చర్చలు జరిపారు. అత్యంత సున్నితమైన ఈ సైనిక కార్యకలాపాలు, వ్యూహాల గురించి పెంటగాన్‌లోని ట్యాంక్ అని పిలిచే ఒక గదిలో వివిధ అధికారులను పిలిపించి ఈ చర్చలు కొనసాగిస్తున్నారు.

రక్షణశాఖలో సమాచారం బయటకు పొక్కకుండా గడచిన మూడు రోజులుగా డాన్ కైన్ చాలా గోప్యంగా అనేక మంది అధికారులను తక్కువ సమయంలో పిలిపించి మంతనాలు చేస్తూ వస్తున్నారు. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు ప్రారంభించడంవల్ల కలిగే కష్టాలు, నష్టాలు, సంక్లిష్టతలు, సమస్యల సంభావ్యతలు, ఒత్తిడులు వంటి అనేక అంశాలను ఆయన దిగువస్థాయి అధికారులతో చర్చిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి.

## పరిపాలనలో వేగం, పారదర్శకత, ఫలితాల కోసం

# 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ

మార్చి 6 నుంచి
జూన్ 12 వరకు
విస్తృత కార్యక్రమాలు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పరిపాలనలో వేగం, పారదర్శకత, ఫలితాల కోసం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పేరుతో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళిక కోసం ప్రత్యేక లోగోను కూడా రూపొందిస్తున్నామని తెలిపారు. మార్చి 4న జరిగే కలెక్టర్ల సమావేశంలో జిల్లాల వారీగా పనితీరును సమీక్షిస్తానని సిఎం స్పష్టం చేశారు. ప్రతి అధికారి ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని, ఎలాంటి మినహాయింపులు ఉండవని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో సిఎం సమీక్ష సమావేశంనిర్వహించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సేవా రంగంలో జరుగుతున్న మార్పులను గమనించి పరిపాలనను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పనులు ఆన్‌లైన్‌లో జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈఫైల్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులో ఫైళ్లు క్లియర్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. పాత సర్వర్లు అప్‌డేట్ చేయాలని, కంపెనీలతో కుదిరిన పెట్టుబడి ఒప్పందాలు భూమిపై అమలు కావాలని సూచించారు.





**సంక్షేమ పథకాల అమలులో సాంకేతికత**

సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా టెక్నాలజీ వినియోగించాలని సిఎం చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉండకూడదని, ప్రతి శాఖకు స్వంత భవనం నిర్మించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తామని, వంద నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించనున్నట్లు సిఎం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలని, ప్రాంతాల వారీగా మెడికల్ డేటా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యదర్శి తమ శాఖలో ఉత్తమ కార్యక్రమాన్ని రూపొందించాలని సిఎం సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని చెప్పారు. శాఖల ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పూర్తి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.

జూన్ 2న రాష్ట్ర పండుగ కార్యాలయాల పరిశుభ్రత తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ దినోత్సవం జూన్ 2వ తేదీన రాష్ట్రానికి పండుగ రోజు అని, ఆ రోజుకు ముందు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని సిఎం ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన మద్దతును సద్వినియోగం చేసుకుని ప్రజలకు మంచి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.

**జిహెచ్‌ఎంసి విభజన, అర్బన్ అభివృద్ధిపై దృష్టి**

హైదరాబాద్ మహానగరాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు సిఎం తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో తక్షణ కార్యాచరణ చేపట్టాలని, సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన ప్యూర్ అర్బన్ జోన్‌లో తయారీ రంగాన్ని విస్తరించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. పారిశ్రామికీకరణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. దాదాపు 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక దిశను మార్చే ప్రాజెక్ట్ అవుతుందని సిఎం పేర్కొన్నారు. అలాగే మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి వల్ల వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల వివాదం.. కార్యకర్తలు సంయమనం పాటించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూదాన్ భూముల వివాదంపై జరుగుతున్న ప్రచారం పట్ల ఆవేశానికి లోనుకాకుండా కార్యకర్తలు సంయమనం పాటించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఏ పేదవాడికీ అన్యాయం జరగదని మంత్రి తెలిపారు. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదకు గూడు కల్పించే బాధ్యత తనదేనన్నారు. విలువైన ప్రభుత్వ భూమిని పేదల పేరుతో కొందరు ఆక్రమించి సొమ్ము చేసుకుంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే, నిజమైన పేదల పట్ల ప్రభుత్వం మానవీయంగా వ్యవహరిస్తుందని చెప్పారు. భూదాన్ భూముల్లో నివసిస్తున్న పేదలు కనీస సదుపాయాలు లేక దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని, వారికి శాశ్వత నివాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై పోలీస్ ఫిర్యాదులు ఇవ్వవద్దని కార్యకర్తలకు సూచించారు. విచారణ పూర్తయ్యాక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, దుష్ప్రచారం చేస్తున్న వారిపై ప్రజలే తీర్పు ఇస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే అర్హులైన పేదలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇళ్లులేని పేదల గుర్తింపు పూర్తయ్యాక వారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని సిద్ధం చేయాలని సూచించినట్లు చెప్పారు. ఖమ్మం నగరంలో గతంలో వేలాది పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన అనుభవం తమకుందని గుర్తు చేశారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో గుడిసెలు వేసిన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. పేదల సంఘం పేరుతో నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేసిన ముఠాపై ప్రభుత్వం విచారణ జరుపుతోందని చెప్పారు. ఈ వ్యవహారాన్ని రాజకీయంగా మలచాలని కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్ట్ పార్టీలు కూడా జరిగిన అక్రమాలను ఖండించాయని పేర్కొంటూ, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ మాత్రం మోసగాళ్లకు మద్దతుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సోషల్ మీడియా ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ అండ తప్పకుండా ఉంటుందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు భరోసా ఇచ్చారు.

## విజ్ఞానం ప్రయోగశాలలకే పరిమితం కారాదు



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజ్ఞానం ప్రయోగశాలల గోడల మధ్యనో, ప్రచురణలకో పరిమితం కాకుండ ఆవిష్కరణలు ప్రాయోజిత ఫలితాలుగా మారాలని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా శనివారం రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సస్టైనబుల్ భారత్ 2047 పరిశోధన, డీప్ టెక్నాలజీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విధాన నిర్ణేతలు, వైస్ ఛాన్సలర్లు, పరిశ్రమ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, యువ పరిశోధకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత్ ప్రస్తుతం కీలకమైన డీప్‌టెక్ క్షణంలో నిలిచిందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ వ్యవస్థలు, వాతావరణ సాంకేతికతలు, ఆధునిక తయారీ, భౌగోళిక మేధస్సు వంటి రంగాల్లో జరుగుతున్న పురోగతులు రాబోయే దశాబ్దాల్లో దేశ పోటీతత్వాన్ని నిర్ణయిస్తాయని చెప్పారు. భారత్ 2047 నాటికి సాంకేతిక స్వావలంబన కలిగిన, పరిశోధన ప్రాధాన్యమున్న, సుస్థిరత ఆధారిత దేశంగా ఎదగాల్సి ఉందనాన్నరు. ఇది వినియోగం వల్ల సాధ్యంకాదని సృష్టి వల్లే శాశ్వత వృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. డీప్ టెక్నాలజీలు ఐచ్ఛికం కాదని, అవి జాతీయ పురోగతికి అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ దేశ ఆవిష్కరణ రంగంలో ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ రక్షణ పరిశోధన, బయోటెక్నాలజీ, ఔషధ తయారీ, ఏరోస్పేస్ రంగాల్లో కీలక కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. విజ్ఞానం పరిశ్రమలను బలోపేతం చేయాలి, పరిపాలనను ఆధునీకరించాలి, యువతను శక్తివంతం చేయాలి, దేశ భవిష్యత్తును భద్రపరచాలని మంత్రి పునరుద్ఘాటించారు.

## దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం



టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ నాయకత్వంలో పదేళ్ల యుపిఎ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ దేశంలోని గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా నిలబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తెచ్చి దేశ ప్రజలకు ప్రతీ ప్రభుత్వ వ్యవస్థ జవాబుదారీగా ఉండేలా, ప్రతీ సమాచారాన్ని ప్రజల ముందు ఉంచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. రాజకీయంగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నష్టపోతుందని తెలిసినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ ప్రజల కోసం రాష్ట్రాన్ని ఇచ్చిన చరిత్ర సోనియా గాంధీ, రాహుల్ గాంధీలది అని గుర్తు చేశారు. ఈ దేశంలోని యువతి యువకుల ఉద్యోగాల కల్పన కోసం ఐటి రంగాన్ని ప్రవేశ పెట్టి, ఐటి రంగాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ఈనాడు మనం ఉపయోగిస్తున్న సెల్ ఫోన్‌లకు బీజం అనాడు రాహుల్ గాంధీ నాన్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తెచ్చిన టెలికాం విప్లవమే కారణమని, అందుకే దేశం మరింత అభివృద్ధిలో ముందుకు దూసుకుపోవాలంటే రాహుల్ గాంధీ లాంటి యువ నాయకుడు ప్రధాని కావాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు.



## అండగా ఉంటాం

మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు
సిఎం రేవంత్ రెడ్డి భరోసా
బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలది. ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ప్రజలందరికీ, బాధితులకు అండగా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరో సా ఇచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత ఏడాది నవంబర్ 17న సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో సజీవ దహనం అయిన 44మంది హైదరాబాద్ వాసుల కుటుంబ సభ్యులకు పరిహారం 5లక్షల చొప్పున పరిహారం, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబానికి రూ.3లక్షల పరిహారాన్ని సిఎం అందజేశారు. మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు బాధిత కుటుంబ సభ్యులతో సిఎం మాట్లాడారు. మదీనాలో ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపామని సిఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్ట్‌లు, వీసాలు ఇప్పించి మదీనా పంపించామన్నారు. అక్కడి భారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నతుల్ బఖీలో చేయించామన్నారు. సహజంగా దేశం బయట జరిగే ప్రమాదాల్లో మృతిచెందిన వారికి ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని, కానీ కాంగ్రెస్ మాత్రం మానవతా దృక్పథంతో సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నదన్నారు. ఇటీవల నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించామని ఎంఎం తెలిపారు. 'బాధితులకు పరిహారం చెక్కులను ఇళ్లకు పంపించవచ్చు. కానీ మీ అందరితో కలవాలని, మీకు అండగా ఉంటామనే భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించాం' అని సిఎం అన్నారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని సిఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, నాంపల్లి ఎంఎల్‌ఎ మాజీద్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టిజిఎంఆర్‌ఈఐఎస్) వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సిఎం ఒఎస్‌డి వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వంట కార్మికులకు సమాన పనికి సమాన వేతనం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఎస్.బాలరాజు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సమన పనికి సమన వేతనం చెల్లించాలని ఎఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడితే ఉరుకోబోమని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సంఘం (ఎఐటియూసి) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అధ్యక్షురాలు ప్రేమ పావని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎస్.బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సమన పనికి సమన వేతనం చెల్లించాల్సిందేనన్నారు. పాలకులు అవలభిస్తున్న కార్మిక వ్యతరేక విధానాల కారణంగా మధ్యాహ్న భోజన వంట కార్మికుల దుర్భరమైన పరిస్థితులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నెలకు రూ.1000 ఉన్న వేతనాన్ని రూ.3000లకు పెంచిందని ఇప్పటికి ఇదే వేతనం అమలు చేస్తుండడంతో వారి కుటుంబ పోషణ భారమై దిక్కుతోచని స్థితిలో జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సమన పనికి సమన వేతనం చెల్లించి న్యాయం చేయాలనీ కోరారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల మానిఫెస్టోలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాలు పదివేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, లేకపోతే మెనూ చార్జీలు అయినా సరిపోయే విధంగా పెంచుతామని, గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన అల్పాహారం బిల్లులు వెంటనే చెల్లిస్తామని అని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు అన్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వ రంగంలోని నిర్వహిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం సెంట్రల్ కిచెన్ విధానం పేరుతోని హరే రామ హరే కృష్ణ అనే స్వచ్ఛంద సంస్థకు సంబంధించిన అక్షయపాత్రకు కట్టబెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంవత్సర కాలపు అల్పాహారం బిల్లులను, వంట బిల్లులు వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్ కార్యదర్శులు, మీస లక్ష్మ ణ్, రామకృష్ణ, కోశాధికారి రంగారెడ్డి, కౌన్సిల్ సభ్యులు పోరెడ్డి ప్రమీల, సామల రమ, గడ్డం భారతి, ముద్దబోయిన భారతి, మంగ, ప్రభావతి, పద్మ, శారధ, సరస్వతి, కళావతి, రాజేశ్వరి, అయ్యవారి లక్ష్మ ణ్, తదితరులు పాల్గొన్నారు.

## 9న ఢిల్లీలో కిసాన్ మజ్దూర్ పార్లమెంట్: ఎస్‌కెఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 9న ఢిల్లీలో నిర్వహించనున్న కిసాన్ మజ్దూర్ పార్లమెంటును విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు పిలుపునిచ్చారు. కిసాన్ మజ్దూర్ పార్లమెంటు వాల్ పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ.సాగర్, బి.రాము, డి.జి.ప్రసాద్, మండల వెంకన్న, బుర్రి ప్రసాద్, జక్కుల వెంకటయ్య, మామిడాల బిక్షపతి, విజయ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అవభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 1 నుండి గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో పాటు మార్చి 9న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కిసాన్, మజ్దూర్ పార్లమెంట్‌ను నిర్వహించిరాష్ట్ర పతికి వినతి పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. భారతదేశం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, 4లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025 ఉపసంహరించాలని, విబిజిఆర్‌ఎఎంజి చట్టం 2025 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం భారత దేశం యొక్క సార్వభౌమత్వాన్ని స్వావలంబనను అమెరికాకు అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చారిత్రాత్మక రైతుల పోరాటం నేపథ్యంలో 2021 డిసెంబర్ 9, 2021 నాటి లేఖలో కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన అన్ని అంశాలపై పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

**FORM - IV**

Statement about ownership and other particulars about newspaper **PRAJA PAKSHAM**, RNI Regd.No.**TELTEL/2018/76759**

1. Place of Publication : **Khammam**
2. Periodicity of its Publication : Daily
3. **Printer's Name** : **Palla Venkat Reddy**
   Nationality : Indian
   Address : 12-1-493/VA, Giriprasad Bhavan Bandlaguda(Nagole), GSI Post Hyderabad-500068. Telangana State.
4. **Publisher's Name** : **Palla Venkat Reddy**
   Nationality : Indian
   Address : 12-1-493/VA, Giriprasad Bhavan Bandlaguda(Nagole), GSI Post Hyderabad-500068. Telangana State.
5. **Editor's Name** : **Makkena Subbarao**
   Nationality : Indian
   Address : Flat No.201, 2nd Floor, Venkatasai Castle, Raghavendra Colony, Bandlaguda, Nagole, Hyderabad - 500 068. Telangana State.
6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital : **NAVACHETHANA VIGNANA SAMITHI**

***Members of the Governing Body***

**President** : **Palla Venkat Reddy**
Hasthinapuram - Hyderabad
**Secretary** : **B.S.R. Mohan Reddy**
Gaddiannaram - Hyderabad
**Treasurer** : **V. Ratnakar Rao**
Nagole - Hyderabad

***Members :***

**K. Sreenivas Reddy** - Manikonda - Hyderabad
**T. Srinivas** - Hanumakonda - Warangal
**B. Prabhakar** - Gaddiannaram - Hyderabad
**N. Madhusudhan Reddy** - LB Nagar - Hyderabad
**K. Shankar** - Srirampur Colony - Mancherial
**B. Hemantha Rao** - Nelakondapalli - Khammam
**V.S. Bose** - AS Rao Nagar - Hyderabad
**N. Jyothi** - Hanumakonda - Warangal

I, **Palla Venkat Reddy,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Khammam — **Palla Venkat Reddy**
Date: 28.02.2026 — Signature of Publisher

## రూ.వేలకోట్ల విలువ చేసే సీడ్‌ఫామ్ భూములను కాపాడాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రైతు కమిషన్ సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విత్తనోత్పత్తి క్షేత్రాల భూములను రక్షించాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో 8 చోట్ల 1629 ఎకరాల్లో వున్న సీడ్ ఫార్మ్ ద్వారా గతంలో వివిధ రకాల విత్తనోత్పత్తి జరిగేది. కానీ గత కొన్నేళ్లుగా ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నట్లు కమిషన్ తన నివేదికలో వివరించింది. శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ను కలిసి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్, గోపాల్‌రెడ్డి సీడ్ ఫారమ్స్ భూములపై నివేదికను అందజేశారు. గతనెలలో కమిషన్ కామారెడ్డి జిల్లాలో పర్యటించిన సమయంలో మాల్తుమ్మెదలో 700 ఎకరాలకుపైగా వున్న సీడ్ ఫార్మ్ అన్యాక్రాంత అయ్యే స్థితిలో ఉన్నట్లు అక్కడి స్థానిక రైతులు కమిషన్ దృష్టికి తేవడంతో వెంటనే కమిషన్ ఆ స్థలాన్ని పరిశీలించినట్లు ఈ సందర్భంగా రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి సీఎస్ కు వివరించారు. సీడ్ ఫార్మ్‌పై ఈనెల 10న కమిషన్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో కమిషన్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో మిగతా చోట్ల కూడా విత్తనోత్పత్తి క్షేత్రాల భూములు అన్యక్రాంతం అవుతున్నట్లు కమిషన్ గుర్తించిందన్నారు. అంతేకాదు భూ భారతిలో కొన్ని చోట్ల భూములు నమోదు కాకపోవడాన్ని సిఎస్ రామకృష్ణారావుకు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, సునీల్ వివరించారు. వెంటనే ఆ భూములను కాపాడాలని, ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సిఎస్‌ను కోరారుస్వాతంత్రం వచ్చిన కొత్తలో ఏలక్ష్యం కోసం భూములు కేటాయించారో దాని కోసం ప్రభుత్వాలు పనిచేయాలని కమిషన్ సూచించారు.

## నిషేధిత పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

ఐఎంఎ ప్రతినిధులు రైతు కమిషన్‌కు విజ్ఞప్తి

**ప్రజా పక్షం/హైదరాబాద్:** నిషేధిత పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) ప్రతినిధులు తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎ. కోదండరెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం రైతు కమిషన్ కార్యాలయంలో ఐఎంఎ ప్రతినిధుల బృందం ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. పారక్వాట్ గడ్డి మందు ఇతర పురుగుమందుల కంటే ప్రమాదకరమైని దీనికి ఎటువంటి వైద్యపరమైన విరుగుడు (యాంటీడోట్) లేదరి తెలిపారు. పొరపాటున లేదంటే ఉద్దేశపూర్వకంగా ఇది శరీరంలోకి వెళ్ళినప్పుడు ప్రాణాలు కాపాడడం కష్టమని తెలిపారు. ఈ పారక్వాట్ గడ్డి మందు ఇప్పటికే 70 పైగా దేశాలలో, మన దేశంలోని కొన్ని రాష్ట్రాలలో నిషేధించబడినట్లు కమిషన్‌కు ఐఎంఎ ప్రతినిధులు వివరించారు. పారాక్వాట్ గడ్డి మందు వాడకంపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కలిసినవారిలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్, డాక్టర్ మహేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
**కొత్తకోట మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా.**

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు**

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో 02 పనుల కొరకు టెండర్‌ను పిలవడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 28.02.2026న ఉ.10.30గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేది:** 09.03.2026న సా.05.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. **బిడ్ల ఆహ్వానించు కార్యాలయం:** కమిషనర్, కొత్తకోట మున్సిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9440418505, 9440656778.

సం/- కమిషనర్,
కొత్తకోట మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 16176-PP/CL/ADVT/1/2025-26, Date: 28-02-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఘట్‌కేసర్ సర్కిల్ - 06, పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఘట్‌కేసర్-501301. E mail: ee.2.ghatkesar@gmail.com

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**


టెండర్ నోటీస్ నెం. 04 /EE/ Ghatkesar circle-06/MMC /Tenders/ 2025-26, తేదీ 28.02.2026న 3 పనుల కోసం ప్రచురణ. ఘట్‌కేసర్ వార్డు 6, ఘట్‌కేసర్ సర్కిల్-6, ఉప్పల్ జోన్, ఎంఎంసిలోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ బావుల యొక్క మెయింటెనెన్స్. మోటార్ మరియు విద్యుత్ బోర్ బావులు... మెయింటెనెన్స్/ మరమ్మతు వార్డు నెం.08 పోచారం, ఘట్‌కేసర్ సర్కిల్-6, ఉప్పల్ జోన్, ఎంఎంసిలో... శివారెడ్డి గూడ వాటర్ ట్యాంక్ నుండి శివారెడ్డి గూడ టెంపుల్ స్ట్రెచ్ వరకు నీటి పైపు లైన్ వేయడం. మరిన్ని వివరాల కోసం https ://tender.telangana.gov.in/login.htmlకు లాగిన్ అవడం ద్వారా చూడవచ్చు. ఈవెంట్ల వివరాలు కింద వివరంగా ఇవ్వబడ్డాయి.

| ఈవెంట్లు | మూడు పనులు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేదీ | 02-03-2026 @ 04 : 00 PM |
| డౌన్‌లోడ్ ముగింపు తేదీ | 11-03-2026 @ 04: 00 Pm |
| చివరి తేదీ & బిడ్ల స్వీకరణ సమయం | 11-03-2026@ 04: 00 PM |
| ధర బిడ్ తెరవడం | 11-03-2026 @ 04: 30 PM |

**సంబంధిత అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్ -06, ఎంఎంసి, హైదరాబాద్.
మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https: //tender.telangana.gov.in/login.htmlలో చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్-06,
ఎంఎంసి

DIPR R.O. No. : 16203-PP/CL/ADVT/1/2025-26, Date: 28-02-2026



## ఉద్యోగ రీత్యా విరమణ సహజం

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఉద్యోగ రీత్యా విరమణ సహజమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి సిపిఐ ప్రజా భవన్‌లో ఆర్టీసి కార్మికులు బొట్టు వెంకన్న, ఏడిసి ఆంజనేయులు, మేకల చిట్టిబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసిలో నమ్మకంగా సంస్థ బాగు కోసం అహర్నిశలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందడం గొప్ప పరిణామమని అన్నారు. అనంతరం వారిని శాలువా, పూలమాలలతో ఆర్టీసి కార్మికులతో కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆర్టీసి నాయకులు మైనోద్దిన్, రాజమల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి దేపా సుదర్శన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, రామస్వామి, నాయకులు వెంకట్‌రాములు, జ్యోతిబస్, మల్లయ్య, బక్కయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పదవి తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం రాయగిరిలోని లింగబసవ గార్డెన్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి వెల్ఫర్ విద్యార్థి, విద్యార్థులకు ప్రేరణ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు క్రమ శిక్షణ, నిరంతరం కష్టపడి చదువుతూ పదవ తరగతి పరీక్షలో మంచి ఉత్తీర్ణత మార్కులు సాధించాలన్నారు. పరీక్షల సమయంలో ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్య లభించే విరామ సమయాన్ని విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమమునకు షెడ్యుల్ కులాల వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితి, విద్య శాఖ అధికారి సత్యనారాయణ, ఏమిసిడిఓ, ఏఎస్‌డబ్ల్యూ మరియు ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహ సంక్షేమ అధికారులు అధ్యాపకులు పాల్గొనారు.

## మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తే తగిన బుద్ధి చెబుతాం

ఉపాధి కూలీలతో కలిసి మట్టి పనులు చేసిన ప్రభుత్వవిప్



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు వెన్నుముక లాంటిదని, ఆ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తే ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హెచ్చరించారు. వికారాబాద్‌లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల్లో భాగంగా, ఎనిమిదవ రోజైన శనివారం ఆయన ఉపాధి హామీ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో కూలీల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షులతో కలిసి స్వయంగా పార పట్టి మట్టి పనులు చేశారు. కూలీలతో కలిసి శ్రమదానం చేస్తూ వారి సమస్యలను, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించాలనే ఆలోచన సరికాదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేర్లు మార్చడంపై చూపుతున్న శ్రద్ధ, పేదల బతుకులు మార్చడంపై చూపడం లేదని ఆయన విమర్శించారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలని హాస్టల్ వార్డెన్‌ను కోరారు. శనివారం ఆయన పోచంపల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్లో అందుతున్న ఆహారం వంట సరుకులు పని వేళలు విద్యార్థులు స్టడీ అవర్లు అడిగి తెలుసుకున్నారు. ఆహారం వడ్డింపు కూరలు, కూరగాయలు తాజాగా మార్కెట్ నుంచి తెచ్చినవి వండుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది భోజనశాల మూత్రశాలలు పరిసరాలను తిరిగి పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను చెక్ చేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత ఆహారం నాణ్యత క్వాంటిటీ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు, ఆర్డీవో శేఖర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ ఆయన వెంట ఉన్నారు.

## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేది నుండి నెల రోజుల వరకు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పి కె నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జనసమూహం చేయడం పూర్తిగా నిషేధమన్నారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేస్తామన్నారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాణాసంచా, డిజెలు ఉపయోగించవద్దన్నారు.

# వేగంగా సాగునీటి కాలువల పునర్నిర్మాణ పనులు

సాగునీటి కాలువల పునర్నిర్మాణంపై ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూనాదిగాని కాలువ, ధర్మారెడ్డి పల్లి కాలువ , పిల్లాయిపల్లి కాలువల పునర్నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాలువల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లను తక్షణమే తొలగించాలని, పనులకు ఆటంకం కలగకుండా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని బోల్లేపల్లి, భీమలింగం మరియు అలీనగర్ కాలువల పునర్నిర్మాణం కోసం అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఎక్కడా జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రవీందర్, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, భూసేకరణ ఎస్డీసీ జగన్నాధరావు, నీటిపారుదల శాఖ ఈఈలు శైలేందర్, ఖుర్షీద్, డీఈ, ఏఈలతో పాటు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# నల్లగొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేయాలి

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను పార్టీలకతీతంగా అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన తొలి సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు తమ డివిజన్లలో ఉన్న సమస్యలను విపులంగా వివరించారు. ముఖ్యంగా త్రాగునీటి కొరత, వీధి దీపాల సమస్యలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ లోపాలు, సీసీ రోడ్ల నిర్మాణం, చెత్త తరలింపుకు ట్రాక్టర్ల కేటాయింపు, మున్సిపల్ సిబ్బంది నియామకంలో వోల్టేజ్ సమస్య పరిష్కారం, మసీదులు , పార్కుల అభివృద్ధి వంటి అంశాలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రతి సమస్యపై మున్సిపల్ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఉర్దూ ఎజెండాను అమలు చేయడంలోనూ కట్టుబడి ఉంటామని తెలిపారు. అనంతరం సర్వసభ్యుల ఏకాభిప్రాయంతో ఎజెండా ఆమోదించబడింది.నల్లగొండ మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా తీసుకువచ్చిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని 48 వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ కార్పొరేషన్ సిటీగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ అస్రప్ అలీ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, మున్సిపల్ అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ముందస్తు జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చను జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. అరవై అలైవ్ మహా ఉద్యమం 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రవి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా సగటున రోజుకి 3500 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నాన్నారు. భారత దేశంలో సంవత్సర కాలంలో సుమారుగా 1.5లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని తెలంగాణ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 7500 మంది మరణిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 2024లో 278 మంది మరణించగా, 2025లో 58 మరణాలు జరిగాయని, జిల్లా పోలీసు శాఖ తీసుకున్న పటిష్ట చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గించగలిగామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక లైన్స్‌క్లబ్ డాక్టర్లు, గ్లోబల్ కంటి ఆస్పటల్ డాక్టర్ల సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా 500 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, మాజీ శాసనసభ్యులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు దోసపాటి గోపాల్, లయన్స్ క్లబ్ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, నరసింహారావు, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

# జీతాల గురించి మాట్లాడే హక్కు విద్యా కమిషన్‌కు లేదు

పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్




**ప్రజాపక్షం/చిట్యాల :** ఉపాధ్యాయుల జీతాల గురించి మాట్లాడే హక్కు విద్యా కమీషన్‌కు గాని, ప్రభుత్వానికి గాని లేదని రాష్ట్ర పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపల్ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో రాష్ట్ర నాయకులు అంబటి సత్తయ్య ఉద్యోగ విరమణ సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ విద్యా కమిషన్ చైర్మన్‌గా ఉన్న ఆకునూరి మురళి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో టీచర్ల జీతాలను తగ్గించాలని సూచించడం అనైతికం, అర్ధరహితమని విమర్శించారు. ముందుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను, పిఆర్‌సి, డిఏలను వెంటనే మంజూరి చేసేలా సూచనలు చేయాలని, బెనిఫిట్స్ అందక రిటైర్డ్ ఉపాధ్యాయులు చనిపోతున్నారన్నారు. సర్వీస్ రైల్స్‌ను చేతిలోకి తీసుకొని మార్పులు చేసే అధికారం మీకు ఎవరిచ్చారని మండిపడ్డారు. జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని అభినందించారు. మున్సిపల్ చైర్మన్ పందిరి గీతరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువస్తుందన్నారు. పదవీ విరమణ చేసిన అంబటి సత్తయ్యను మండల ఉపాధ్యాయులతో పాటు, బంధువులు, ఆత్మీయులు పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన సైదులు, మండల విద్యాధికారి సైదానాయక్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరెడ్డి, జాన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బాధం భిక్షపతి పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సారించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కాబోయే వైద్యులు పట్టణ ప్రాంతం తో పాటు, గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల లో నిర్వహిస్తున్న వైద కళాశాల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.పట్టణ ప్రాంతంలో ప్రజలకు 75 శాతం నాణ్యమైన వైద్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయని, అయితే ఈ శాతం గ్రామీణ ప్రాంతంలో కేవలం 35 మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయాలతో పాటు, ప్రాథమిక వైద్యరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంకా 65 మంది గ్రామీణ ప్రాంతంలో ప్రజలు సరైన వైద్యశాలు పొందలేకపోతున్నారని, అందువల్ల వైద్యులందరూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ అంతంలేని చదువని, భవిష్యత్తులో పీజీ, స్పెషలైజేషన్ కి ఇది ఉపయోగపడుతుందని, అంతేకాక ఎంచుకున్న సబ్జెక్టులో నిష్ణాతులు కావాల్సిన అవసరం ఉంద ని, అందుకు వైద్య విద్యార్థులు భవిష్యత్తులో మంచి సబ్జెక్టులు ఎంచుకొని విజయం సాధించాలని ఆశించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన జిమ్ ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ ఉన్నారు.




# శ్రీవారి 'అష్టోత్తర శతఘటాభిషేకం'



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవములలో భాగంగా శనివారం ఉదయం శ్రీ స్వామివారి ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేకము అత్యంత వైభవంగా జరిగింది. నిత్యారాధనల అనంతరం, పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎమ్. హనుమంతరావు, కార్యనిర్వహణాధికారి జె.భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త శ్రీ బి.నరసింహామూర్తి, ఇతర ఉన్నతాధికారులు , భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

108 కలశాల పరమార్థం

లోకకల్యాణార్థం నిర్వహించే ఈ 'అష్టోత్తర శతఘటాభిషేకం' ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనది.108 కలశాలు భగవంతుని సృష్టిలోని 108 తత్వాలకు (సంవత్సర, అయన, మాస, తిథి, నక్షత్ర గణితం) ప్రతీకలు. పవిత్ర నదీ జలాలు, పంచామృతాలు, ఫల రసాలు , సుగంధ ద్రవ్యాలతో మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. పంచభూతాలు శాంతించి, లోకం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈ అభిషేక మంత్రాలను పఠించినట్లు అర్చకులు తెలిపారు. శృంగార డోలోత్సవం నేడు రాత్రి శ్రీ స్వామివారికి, అమ్మవారికి శృంగార డోలోత్సవము వైభవంగా నిర్వహించనున్నారు. డోలోత్సవం అనంతరం వేద పండితులకు సన్మానం నిర్వహించి, ఉత్సవాలను మంగళప్రదంగా ముగిస్తారు.మంచస్థం మధుసూదనం' అనే ఆర్యోక్తి ప్రకారం.. ఊయల సేవలో ఉన్న స్వామివారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఆదిశంకరాచార్యుల స్తోత్రాల అంతరార్థంతో ఈ సేవ సాగనుంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఆధ్యాత్మిక శోభలో భాగంగా రాత్రి 9:00 గంటలకు ప్రధానాలయంలో డి. లక్షణాదేవి బృందం వారిచే భక్తి సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు బట్టర్ సురేంద్ర చార్యులు ఉత్సవాల నిర్వహించగా వేడుకల్లో దేవస్థానం ఈవో జే.భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహమూర్తి, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం.హనుమంతరావు, డీఈవో దోర్బల భాస్కర శర్మ, ఏఈఓలో ప్రతాప నవీన్ కుమార్ శర్మ, గజ్వేల్ రఘు పాల్గొన్నారు.



## చిల్లంచర్ల వరలక్ష్మి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రెడ్ చిల్లంచర్ల రఘునాథం సతీమణి చిల్లంచర్ల వరలక్ష్మి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు ఆమె ఎల్లప్పుడు భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తూ వెన్నుదన్నుగా నిలిచారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన చిల్లంచర్ల వరలక్ష్మి అంతిమయాత్ర శనివారం మండల కేంద్రంలోని ఆమె నివాసం నుండి ప్రారంభం కాగా మొదటగా వరలక్ష్మి పార్థివ దేహంపై పశ్య పద్మ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎర్ర జెండా అన్నా ప్రజా ఉద్యమాలంటే ఆమె ఎంతో ఇష్టంగా భావించే మనిషి వరలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మేకల శ్రీనివాసరావు, కంబాల శ్రీనివాస్, నంద్యాల రామిరెడ్డి, దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు బద్దం భద్రారెడ్డి, పైడిమర్రి వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు పాల్గొన్నారు.

## నేడు బుద్ధవనానికి బౌద్ధదమ్మ పాదయాత్ర



**ప్రజాపక్షం/నందికొండ:** కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి నుంచి ప్రారంభమైన బౌద్ధ దమ్మ పాదయాత్ర నేడు సాయంత్రం 3 గంటకలకు నాగార్జునసాగర్ లోని బుద్ధ వనం కు చేరుకుటుందని బుద్ధ వనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యం, శాంతిఅహింస సందేశాలతో సాగుతున్న ఈ పాదయాత్ర బౌద్ధ భక్తుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతోందని బౌద్ధ దమ్మ ప్రచారం, సమానత్వం మానవతా విలువలను ప్రజల్లో బలపరిచే లక్ష్యంతోఈ యాత్ర కొనసాగుతోందని అన్నారు పాదయాత్రలో భాగంగా బౌద్ధ భిక్షువులు, ధర్మానురాగులు, యువత పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, మార్గమధ్యంలో వివిధ ప్రాంతాల్లో ధర్మోపదేశాలు, ప్రార్థనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి చేరుకున్న అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ధర్మసభలు స్వాగత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు అన్నారు.ఈ కార్యక్రమంలోబుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్ రావు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి సహకారంతో జర్నలిస్టులకు స్థలాలు

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో జర్నలిస్టులకు జిల్లా స్థలాలు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని నల్లగొండ కార్పొరేషన్ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటానని ఆమె హామీ ఇచ్చారు. నల్లగొండ నగర తొలి మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులను శనివారం నల్లగొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. ప్రెస్‌క్లబ్ మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఏళ్ల తరబడి జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నగర తొలి మేయర్‌గా రికార్డు సృష్టించిన చైతన్య శ్రీనివాస్ రెడ్డికి నగర అభివృద్ధి విషయంలో సంపూర్ణ సహకారం అందిస్తామని జర్నలిస్టులు తెలిపారు.ఈకార్యక్రమంలో నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, ఉపాధ్యక్షుడు జిల్లా యాదయ్య, మదనాచారి, కార్యదర్శులు వరకాంతం కిరణ్ రెడ్డి, లింగయ్య, సహాయ కార్యదర్శులు మహమ్మద్ సయ్యద్,నత్తి ఉపేందర్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సోమ శేఖర్,తెల్లగమల్ల దశరథ,అశోక్ కుమార్, భాస్కర్, వెంకన్న, రవి, కృష్ణ, , కారింగు శ్రీను పాల్గొన్నారు.



### ప్రతిపక్షనేతలను లక్ష్యంగా చేసుకునేందుకు...

# చట్టాన్ని బిజెపి 'ఆయుధంగా' మారుస్తోంది

సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకునేందుకు భారతీయ జనతా పార్టీ (బిజెపి) చట్టాన్ని 'ఆయుధంగా' మారుస్తోందని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆరోపించారు. మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విడుదల అనంతరం శనివారం కపిల్ సిబల్ స్పందించారు. మెజిస్ట్రేట్ చర్యలను సమర్థించే మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారాలు చూపిన తర్వాతే అరెస్టులు జరిగేలా చట్టాలను సవరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీనియర్ న్యాయవాది అయిన సిబల్ సుప్రీం కోర్టును కోరారు. ప్రభుత్వం వలసవాద మనస్తత్వాన్ని అనుసరిస్తోందని, మొదట అరెస్టులు చేసి తర్వాత ఆధారాలు సేకరిస్తోందని ఆరోపించారు. రాజకీయంగా ప్రభావితం అయిన మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులు 21మందిని సుప్రీంకోర్టు విడుదల చేసిన తర్వాత కపిల్ సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పాలసీలో ఎక్కువ కుట్ర లేదా నేరపూరిత ఉద్దేశం ఏదీ లేదు అని లేదని పేర్కొంటూ ఆయన సిబిఐని తీవ్రంగా విమర్శించారు. కేజ్రీవాల్ జైలులో 126 రోజులు గడిపారని, సిసోడియా జైలులో 503 రోజులు గడిపారని, ఈ సంఘటనలకు ఎవరు బాధ్యత వహిస్తారని మేం ప్రభుత్వాన్ని అడగాలనుకుంటున్నామని, దానికి తప్పక జవాబుదారీతనం ఉండాలని కపిల్ సిబల్ విలేకరుల సమావేశంలో అన్నారు. 'వారు (బిజెపి) దీనిని రూ.100 కోట్ల కుంభకోణంగా చెప్పుకొచ్చారు. ఇది ముందస్తు ప్రణాళిక అని న్యాయమూర్తి అన్నారు. వారిని నిందితులుగా చేయడానికి ముందస్తు ప్రణాళిక అని తీర్పు పేర్కొంది. అప్పుడు ఎలా చేయలో సిబిఐ నిర్ణయించుకుంది' అని కపిల్ సిబల్ వివరించారు. 'ప్రధానమంత్రి వలసవాద మనస్తత్వంతో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ మొత్తం చట్టం వలసవాద మనస్తత్వం గురించి.మొదట అరెస్ట్ చేసి ఆ తర్వాత సాక్ష్యధారాలు సేకరించడం. ఈ చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉంది' అని సిబల్ తెలిపారు. దర్యాప్తు సంస్థలు నియమ నిబంధనలను అనుసరిస్తూ ఒకరిని అరెస్ట్ చేస్తున్నాయని, ఆ వ్యక్తి మరొక వ్యక్తిని నిందితుడిగా పేర్కొనేలా చేస్తున్నాయని, వారు వారిని లక్ష్యంగా చేసుకోవాలనుకుంటున్నారని ఆయన ఆరోపించారు.ఇతరులపై ఆరోపణలు చేయడానికి వారు ఆ వ్యక్తిని మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇవ్వాలని బలవంతం చేస్తారని, కానీ వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, అయితే బిజెపికి సహాయపడటానికే వారి ఉద్దేశాలు ఉన్నాయని ఆయన దర్యాప్తు సంస్థలను ఎంపి కపిల్ సిబల్ విమర్శించారు.

# రాజకీయ ప్రతీకార చర్య

### ఎక్సైజ్ పాలసీ కేసులో ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి : సామ్నా సంపాదకీయం

**ముంబయి :** ఎక్సైజ్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ విడుదలను రాజకీయ ప్రతీకార చర్యగా శివసేన (యుబిటి) అభివర్ణించింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రిపై కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. శివసేన (యుబిటి) అధికారిక పత్రిక సామ్నా సంపాదకీయంలో ఎక్సైజ్ పాలసీ కేసులో ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి అని ఆరోపించింది. బిజెపి నాయకులు, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఇడి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలు దేశ రాజధానిలో ఆప్ ప్రభుత్వాన్ని తొలగించడానికి కుట్ర పన్నాయని మండిపడింది. ఆప్ ప్రభుత్వం పతనానికి దారితీసిన ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్, ఆయన డిప్యూటీ మనీష్ సిసోడియా, మరో 21 మందిని ఢిల్లీ కోర్టు శుక్రవారం విడుదల చేసిన విషయం విదితమే. కోర్టు తీర్పును రాజకీయ ప్రతీకార చర్యపై చెంపదెబ్బగా అభివర్ణించిన సామ్నా సంపాదకీయం, ప్రాసిక్యూషన్ తన ఆరోపణలను నిరూపించడంలో విఫలమైందని ఉద్ఘాటించింది. సిబిఐ మోపిన అభియోగాలకు అర్హత లేదని, ఎటువంటి నేరపూరిత కుట్ర నిరూపించబడలేదని కోర్టు స్పష్టంగా పేర్కొందని, కేసును సాగదీశారని తెలిపింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ నివాసంలో దాడులు నిర్వహించారని, తరువాత ఆయనను అరెస్టు చేసి చాలా కాలం పాటు జైలులో ఉంచారని పేర్కొంది. కేజ్రీవాల్, సిసోడియా, అనేక మంది మంత్రుల చుట్టూ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఉచ్చు బిగించాయని, కోర్టు తీర్పు ఇప్పుడు సిబిఐపై మలుపు తిప్పిందని పార్టీ ఆరోపించింది. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కేజ్రీవాల్‌కు క్షమాపణలు చెప్పాలని, కేసు దర్యాప్తుకు నాయకత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేసింది. గత దశాబ్ద కాలంగా రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆధారాలు లేకపోయినా అరెస్టులు జరిగాయని సంపాదకీయం పేర్కొంది. మహారాష్ట్ర నుండి ఉదాహరణలను ఉటంకిస్తూ, సీనియర్ రాజకీయ నాయకులు ఛగన్ భుజ్‌బాల్, అనిల్ దేశ్‌ముఖ్, నవాబ్ మాలిక్, సంజయ్ రౌత్ అరెస్టులను పార్టీ ప్రస్తావించింది. కొన్ని కేసుల్లో విచారణ లేకుండా దీర్ఘకాలిక జైలు శిక్ష విధించబడిందని పేర్కొంది. కొంతమంది నాయకులపై దర్యాప్తు ద్వారా రాజకీయ విధేయతను మార్చుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చిందని అది పేర్కొంది. కేంద్ర సంస్థల అతిక్రమణలను అరికట్టడంలో విఫలమైందని, అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ, సంపాదకీయం న్యాయవ్యవస్థను కూడా విమర్శించింది.

## మహిళల భద్రతకు ప్రత్యేక కార్యక్రమాలు: మమతా బెనర్జీ



**కోల్‌కతా :** నగరంలో మహిళల భద్రత, విశ్వాసాన్ని మరింత పెంచే లక్ష్యంతో కోల్‌కతా పోలీసులు రెండు కొత్త కార్యక్రమాలను ప్రారంభించినట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అనేక పూర్తి మహిళా 'పింక్ బూత్‌లు' కీలకమైన నగర కూడళ్లలో ఏర్పాటు చేయబడతాయని, సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు పనిచేస్తాయని చెప్పారు. 'నగరంలోని నా సోదరీమణులు ఈ బూత్‌లలో ఏదైనా సహాయం కోసం కెపి మహిళా అధికారులతో నేరుగా కనెక్ట్ కాగలరు' అని ఆమె చెప్పారు. 'షైనింగ్' అని పేరు పెట్టిన పూర్తి మహిళా మొబైల్ పెట్రోల్ బృందాలను కూడా మోహరిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ బృందాలు రాత్రి 8 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల వరకు విధుల్లో ఉంటాయి, ఇఎం బైపాస్, రాత్రి వేళల్లో శ్రామిక మహిళలు తరచుగా ఉపయోగించే ఇతర ప్రధాన రహదారులలో గస్తీ తిరుగుతాయన్నారు. 'అనేక 'షైనింగ్' (నేను వాటికి పేరు పెట్టినట్లుగా) పూర్తి మహిళా మొబైల్ పెట్రోల్ బృందాలు కూడా రాత్రి 8 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల వరకు విధుల్లో ఉంటాయి, ఇఎం బైపాస్, రాత్రి వేళల్లో నా శ్రామిక సోదరీమణులు ఉపయోగించే ఇతర ప్రధాన నగర రహదారులలో గస్తీ తిరుగుతాయి' అని బెనర్జీ ఎక్స్‌లో పోస్టు చేశారు. సంవత్సరాలుగా కోల్‌కతా దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరంగా కొనసాగుతోందని పేర్కంటూ, ఈ రెండు ప్రత్యేకమైన కొత్త కార్యక్రమాలు మహానగరంలో మహిళల భద్రతను బలోపేతం చేయడంలో చాలా దూరం వెళ్తాయని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## పాక్‌కు ట్రంప్ మద్దతు
# మోదీ కౌగిలింతల దౌత్యానికి భారీ ఎదురుదెబ్బ

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ :** అఫ్గానిస్థాన్‌తో యుద్ధం చేస్తున్న పాకిస్థాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తి మద్దతును ప్రకటించడం అనేది ప్రధాని మోదీ కౌగిలింతల దౌత్యానికి (హగ్లోమసీ) భారీ ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. స్వయం ప్రకటిత విశ్వగురువుపై అమెరికా పూర్తి అంచనాకు వచ్చిందంటూ పరోక్షంగా ప్రధాని మోదీపై విమర్శలు చేసింది. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. ఒక వ్యక్తి (పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్) చేసిన వ్యాఖ్యల వల్లే 2025 ఏప్రిల్ 22న జమ్ముకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందని, ఇప్పుడు మళ్లీ అదే వ్యక్తిని ఆకాశానికి ఎత్తుతూ ప్రెసిడెంట్ ట్రంప్ వ్యాఖ్యలు చేయడం ఆందోళనకరమని ఆయన తెలిపారు. పాక్‌కు ఈవిధంగా అమెరికా మద్దతు లభిస్తుండటం అనేది, భారత సర్కారు హగ్లోమసీ విఫలమైందని నిరూపిస్తోందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.



**డొనాల్డ్ ట్రంప్ వరుస షాక్‌లు ఇస్తున్నారు**


'భారతదేశ వ్యూహాత్మక దౌత్యానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరుస షాక్‌లు ఇస్తున్నారు. ఆయన పదేపదే పాకిస్థాన్‌కు మద్దతును ప్రకటిస్తున్నారు. పాక్‌కు వంతపాడుతూ వ్యాఖ్యలను చేస్తున్నారు. భారత్, పాకిస్థాన్‌లను ఒకేగాటన కట్టి మాట్లాడేందుకు ట్రంప్ యత్నిస్తున్నారు. భారత ప్రధాని మోదీ తన పరిచయాలు, ప్రభావంతో అవార్డులను పొందొచ్చు కానీ, వాస్తవమేంటో అందరికీ తెలిసిపోయింది. స్వయం ప్రకటిత విశ్వగురువుపై ప్రపంచం అసలు అంచనాకు వచ్చేసింది. ప్రత్యేకించి అమెరికా, ఈవిషయంలో ఫుల్ క్లారిటీకి వచ్చింది' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

**ఏకపక్ష ట్రేడ్ డీల్‌కు మోదీ సర్కారు తల ఊపింది**

'అమెరికాతో భారత ప్రభుత్వం ఆర్థిక దౌత్యం కూడా తీవ్రంగా విఫలమైంది. అందుకే ఏకపక్షంగా అమెరికా డిసైడ్ చేసిన వాణిజ్య ఒప్పందానికి మోదీ సర్కారు తల ఊపాల్సి వచ్చింది. ఇందులో అమెరికాకు భారత్ పెద్దపెద్ద హామీలను ఇచ్చింది. ప్రత్యేకించి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని మోదీ సర్కారు మాట ఇచ్చింది. ఇక ఇదే సమయంలో భారత్ నుంచి వస్తు,సేవలను దిగుమతి చేసుకునే విషయంలో అమెరికా అరకొర హామీలనే ఇచ్చింది. ఈ ట్రేడ్ డీల్ ఖరారైన మరుసటి రోజే, భారత్ నుంచి అమెరికాకు వెళ్లిన సోలార్ మాడ్యూల్స్‌పై అమెరికా ఏకంగా 125.87 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది' అని జైరాం రమేశ్ ఆరోపించారు.

## మార్చి-మే మధ్య సాధారణం కంటే అధిక వేడిగాలులు

భారత వాతావరణ శాఖ అంచనా



**న్యూఢిల్లీ:** దేశంలోని చాలా ప్రాంతాలలో మార్చి-మే మధ్య సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ఈ ప్రాంతాలలో పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, దక్షిణ, తూర్పు మహారాష్ట్ర, తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, గంగా నది పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటక, ఉత్తర తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. అయితే, మార్చిలో, ఈశాన్య, తూర్పు, పశ్చిమ హిమాలయ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య, ద్వీపకల్ప భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా భారతదేశంలోని అనేక ప్రాంతాలలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. మార్చిలో భారతదేశంలో సగటు వర్షపాతం సాధారణంగా ఉండే అవకాశం ఉండటం దీనికి కారణం కావచ్చని ఐఎండి తెలిపింది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో భారతదేశం అంతటా వర్షపాతం 2001 తర్వాత అత్యల్పంగా నమోదైందని ఐఎండి తెలిపింది. ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా చలిగాలులు నమోదు కాలేదని వివరించింది.

## హెచ్‌పివి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ



**అజ్మేర్ :** రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 14, 15 ఏళ్ల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నారు. దేశంలో 1.15 కోట్ల మంది బాలికలకు టీకాలు వేయనున్నారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు సంబంధించి ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'దేశంలోని ఆడబిడ్డలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవడానికి మేం ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టం. వారు సంపన్నంగా ఉండేలా చూసుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో హెచ్‌పివి టీకా వ్యాక్సినేషన్‌ను ప్రారంభించాం. గర్భాశయ క్యాన్సర్ నివారణే ఈ వ్యాక్సినేషన్ ముఖ్య ఉద్దేశం' అని మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్త హెచ్‌పివి వ్యాక్సినేషన్ టీకా అమలు అనేది భారత ప్రజారోగ్య ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక చర్యను అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్థ నారి' విజన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహించనున్నారు. ఏటా 14 ఏళ్ల వయసు గల సుమారు 1.15 కోట్ల మంది బాలికలకు ఈ వ్యాక్సినేషన్ టీకాలు వేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రత్యేక చొరవ మహిళల ఆరోగ్య సంరక్షణకు తోడ్పడనుంది. హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తారు.

# కూనో నేషనల్ పార్క్‌కు మరో 9 చీతాలు..

బోట్స్‌వానా నుంచి చేరుకున్న కూనలు



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌కు మరో 9 చీతాలు చేరుకున్నాయి. దక్షిణాఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి ఈ తొమ్మిది చీతాల్ని అధికారులు భారత్‌కు తీసుకొచ్చారు. వీటిని త్వరలోనే ప్రత్యేక నివాస స్థలాల్లోకి వదలనున్నారు. దాదాపు నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ చీతా' కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా 2023 వరకు మొత్తం 20 చీతాల్ని విదేశాల నుంచి తీసుకొచ్చారు. మొదట సెప్టెంబర్ 2022లో ఎనిమిది చీతాల్ని నమీబియా నుంచి తీసుకొచ్చారు. అలాగే రెండో దశలో ఫిబ్రవరి 2023లో దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల్ని తీసుకొచ్చారు. ఇప్పుడు మూడో దశలో బోట్స్‌వానా నుంచి 9 చీతాల్ని తీసుకొచ్చారు. వీటిలో మూడు మగ చీతాలు, ఆరు ఆడ చీతాలున్నాయి. బోట్స్‌వానా నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ పట్టణానికి తీసుకొచ్చారు. వీటిని కూనో నేషనల్ పార్క్ పరిధిలో చీతాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లలోకి వదిలిపెడతారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వీటిని విడుదల చేయనున్నారు. అక్కడ వీటిని అధికారులు, నిపుణులు పర్యవేక్షిస్తుంటారు. ఈ చీతాల రాకతో దేశంలో వీటి సంఖ్య 48కి చేరింది. దేశంలో చీతాల సంఖ్య పెంచాలని కేంద్రం భావిస్తోంది. అందువల్లే మన దేశంలో అంతరించిపోయే దశలో ఉన్న వీటిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా 'ప్రాజెక్ట్ చీతా' చేపట్టింది. విదేశాల నుంచి వీటిని తీసుకొస్తోంది. అయితే, వీటిని పెంచడం అంత సులభం కాదు. కొన్ని చీతాలు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడలేక మరణించాయి. అయినప్పటికీ కేంద్రం వీటిని పెంచడానికి కృషి చేస్తోంది. కూనో నేషనల్ పార్క్ వీటికి అనువైన ప్రదేశం. ఇక్కడ 2023లో 39 చీతా కూనలు ఉండగా.. వాటిలో ఇప్పుడు 27 జీవించి ఉన్నాయి. అలాగే అన్ని చీతాల్ని ఒకే చోట ఉంచడం లేదు. వీటికి వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున కొన్నింటిని గాంధీ సాగర్ అభయారణ్య కేంద్రానికి తరలించి సంరక్షిస్తున్నారు.

## పశ్చిమాసియా గగనతలం మూసివేత

అన్ని విమాన సర్వీసులు రద్దు



**న్యూఢిల్లీ:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. మరోవైపు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రాకెట్ల వర్షం కురిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాంతంలో విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, టర్కీ సహా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, దోహా వంటి అంతర్జాతీయ విమాన విమానాశ్రయాల్లోనే భారీ సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ పరస్పర దాడుల ప్రభావం భారతీయ విమానయాన సంస్థలపై పడింది. మధ్యప్రాచ్య దేశాలకు నడిచే అన్ని సర్వీసులను శనివారం అర్ధరాత్రి వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. 'ఇరాన్, మధ్యప్రాచ్య గగనతలంలో విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో అటువేపు వెళ్లే, వచ్చే అన్ని విమానాలను రద్దు చేస్తున్నాం' అని ఇండిగో ట్వీట్ చేసింది. దీంతో దుబాయ్, జెడ్డా, దోహా, అబుదాబి, దమ్మామ్, బహ్రెయిన్, షార్జా, కువైట్, రస్ అల్‌ఖైమా నగరాలకు సర్వీసులు నిలిచిపోయాయి. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పశ్చిమాసియా వెళ్లే అన్ని అంతర్జాతీయ విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఎయిర్ ఇండియా కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్యస్థానాలకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ (టెల్ అవీవ్) వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం (ఎఐ139) గాలిలో ఉండగానే భద్రతా కారణాల దృష్ట్యా వెనక్కి మళ్లింది. దీన్ని ముంబైలో సురక్షితంగా పైలెట్లు ల్యాండ్ చేశారు. బోయింగ్ 777 విమానం గాలిలో సుమారు ఐదు గంటల పాటు ప్రయాణించింది. సౌదీ అరేబియా గగనతలంలో ఉన్న సమయంలో, ఇజ్రాయెల్ ఎయిర్‌స్పేస్ మూతపడటంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీని వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్ ఇండియా విచారం వ్యక్తం చేసింది. గగనతలాల మూసివేత కారణంగా అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విమానాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ Flightradar24.com కూడా వెల్లడించింది.


## సీట్ల పంపకాలపై డిఎంకె, కాంగ్రెస్ చర్చలు



**చెన్నై :** తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు పొత్తులు సీట్ల పంపకాలపై చర్చలను ముమ్మరం చేశాయి. అధికార డిఎంకెతో అధికారికంగా సీట్ల పంపకాల చర్చలు స్నేహపూర్వకంగా జరిగాయని, కోరికలు నెరవేరుతాయని ఆశాభావం కాంగ్రెస్ వ్యక్తం చేస్తోందని తమిళనాడుకు చెందిన ఎఐసిసిఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్ పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య జరిగిన చర్చలు ఒకరి ఆందోళనలను మరొకరు అర్థం చేసుకోవడానికి సహాయపడ్డాయని, ఇరువురి సమస్యలను స్వేచ్ఛగా చర్చించుకున్నట్లు ఆయన చెప్పారు. తాము రెండు పార్టీల మధ్య ఆందోళనలను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, తమ కార్యకర్తల ప్రయోజనాలను కాపాడుకుండా ఉత్తమంగా సీట్లు ఎలా పొందాలో చూస్తున్నామని చోడంకర్ అన్నారు. శనివారం చెన్నైలోని డిఎంకె రాష్ట్ర ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో దాదాపు గంటసేపు జరిగిన చర్చ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరువురం తమ తమ ఆందోళనలపై చర్చించుకున్నామని, వారు రాజ్యసభ సీటును ఇస్తామన్నారని గిరీష్ చెప్పారు. చర్చలు చాలా స్నేహపూర్వకంగా జరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీ డిఎంకెతో అధికారంలో వాటా కోరుకుందా అని అడిగినప్పుడు, 'వారు ఈ సమస్యను అర్థం చేసుకున్నారు. మేము ఈ అంశాలపై స్వేచ్ఛగా చర్చించాము. ఇప్పుడు మా దృష్టి అంతా డిఎంకె తిరిగి అధికారంలోకి వచ్చేలా చూసుకోవడమే' అని ఆయన బదులిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ టిడికెతో కూడా సంప్రదింపులు జరుపుతోందా లేదా అనే దానిపై ఆయన తాము డిఎంకె ప్రధాన కార్యాలయంలో ఉన్నామని చెప్పారు. తమిళనాడు ఎఐసిసి ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్, టిఎన్‌సిసి చీఫ్ కె. సెల్వపెరుంతగై, ఎఐసిసి కోఇన్‌చార్జ్ నివేదిత అల్వా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధి బృందం సీనియర్ పార్లమెంటరీ సభ్యుడు టీఆర్ బాలు నేతృత్వంలోని డిఎంకె ప్యానెల్‌తో చర్చల్లో పాల్గొంది.

# 58 లక్షలకు పైగా ఓటర్ల తొలగింపు

బెంగాల్‌లో ముగిసిన ఎస్ఐఆర్




**కోల్‌కతా:** బెంగాల్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగిసింది. దీంతో ఇసి శనివారం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 58,20, 899 మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు బంగాల్‌లో మొత్తం 7.66 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 7.04 కోట్ల ఓటర్లు ఉన్నట్లు ఇసి పేర్కొంది. మొత్తం 58 లక్షలకుపైగా ఫారాలు అందలేదని ఇసి తెలిపింది. 24 లక్షలకు పైగా ఓటర్లు చనిపోయారని వెల్లడించింది. ఇతర కారణాల వల్ల మరి కొంత మందిని జాబితా నుంచి తొలగించామని తెలిపింది. 'మొత్తం 58,20,899 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందలేదు. దాదాపు 24,16,852 మంది మరణించినవారిగా గుర్తించాం. 12,20,039 మంది గైర్హాజరు అయ్యారు. 19,88,076 మంది ఇతర ప్రాంతాలకు మారినట్లు నమోదు అయింది. 1,38,328 మంది ఇప్పటికే ఇతర చోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు గుర్తించాం. అదనంగా 57,604 పేర్లు ఇతర కారణాలతో తొలగించాం' అని ఇసి అధికారులు పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 16న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత, ఫారం6, 6ఎ ద్వారా 1,82,036 మంది కొత్త ఓటర్లను చేర్చారు. ఫారం8 ద్వారా 6,671 సవరణలు, చేర్పులు చేశారు. విచారణలో ఉన్న 60,06,675 మంది ఓటర్లను తుది జాబితాలో చేర్చినట్లు ఇసి వెల్లడించింది. ముసాయిదా జాబితా సమయంలో ఉన్నట్లుగానే లింగ నిష్పత్తి 956 వద్ద కొనసాగుతోందని తెలిపింది.

**అర్హులను ఓటరు జాబితాలో చేర్చడమే ఎస్ఐఆర్ లక్ష్యం**

మరోవైపు, ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యం అర్హులైన ప్రతి ఓటరు ను చేర్చడం, అనర్హులను పారదర్శకంగా తొలగించడమేన ని ఎన్నికల సంఘం పేర్కొంది. 100 శాతం భౌతిక ధృవీకరణ విధానాన్ని అనుసరించినట్లు వెల్లడించింది. బూత్ స్థా యి అధికారులు వ్యక్తిగతంగా ఫారమ్‌ల పంపిణీ, సేకరణ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపింది. ఈ సమగ్ర ప్రక్రి య ద్వారా మ రణించిన వారు, శాశ్వతంగా ఇతర రా ష్ట్రాలకు వలస వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదులు వంటి అ నర్హ పేర్లను తొలగించామని అధికారులు పేర్కొన్నారు.

**బెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**

అతిత్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నగరా మోగనుంది. ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి రెండవ వారంలో ప్రకటించే అవకాశం ఉందని రాష్ట్ర సిఇఒ కార్యాలయంలోని ఓ అధికారి శనివారం తెలిపారు. ఎన్నికలు ఎన్ని దశల్లో నిర్వహించబడతాయనే దానిపై నిరంతరం ఊహాగానాలు వస్తున్నాయి. మార్చి రెండవ వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ అధికారి తెలిపారు. మూడు దశలకు మించకుండా ఓటింగ్ నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఆదివారం ఎన్నికల కమిషన్ పూర్తి బృందం రాష్ట్రాన్ని సందర్శించదని కూడా అధికారి తెలిపారు. 'హోలీ', 'డోల్‌జాత్ర' పండుగలు ముగిసిన తర్వాత పోల్ ప్యానెల్ పర్యటన జరగవచ్చని ఆయన చెప్పారు. ఆనవాయితీ ప్రకారం... ఎన్నికల తేదీలను ప్రకటించే ముందు ఇసి పూర్తి బెంచ్ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాన్ని సందర్శిస్తుంది. కమిషన్ పూర్తి బెంచ్ ఇప్పటికే తమిళనాడు, అసోంలను సందర్శించింది., కానీ ఇంకా పశ్చిమ బెంగాల్‌లో పర్యటకు రాలేదు. తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత పూర్తి బెంచ్ రాష్ట్రాన్ని సందర్శించవచ్చని అధికారి తెలిపారు. ఆ గడువు కొనసాగితే, మార్చి మధ్య నాటికి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అధికారిక ప్రకటన రావచ్చని ఆయన అన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 304 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o. WARANGAL.**

**.... Disputant**

AND

**Mr.MANDA RAKESH KUMAR,& others**

**... Opponents**

1. MR.MANDA RAKESH KUMAR, S/O. RAJAIAH, AGED ABOUT : 39 YEARS, OCC: BUSINESS, R/O: H.NO. 7-1-360/10, LAXMIPURAM, SWAMY VIVEKANANDA HIGH SCHOOL, HANAMKONDA, WARANGAL, TELANGANA, INDIA - 506001.
2. MRS.GUNDU SRINIVAS, S/O. RAMKISHAN, AGED ABOUT :47 YEARS,OCC: ATTENDER, EMPLOYEE CODE: 2108181, O/O. RDO OFFICE, HANAMKONDA. R/O: H:NO. 6-2-347, DH SUTHOON BUSSTAND ROAD, HANAMKONDA, TELANGANA, INDIA - 506011.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-03-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION WARANGAL,**




## ఎటు వెళుతున్నాం?



మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో 17 ఏళ్ల బాలిక పదో తరగతి బోర్డు పరీక్షలు రాస్తూ, వాష్‌రూమ్‌లో బిడ్డను ప్రసవించిన ఘటన ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. సమాజంలో బాలికల స్థితి ఎంత సంక్లిష్టంగా మారిందో ఈ ఘటన తీవ్రంగా గుర్తుచేస్తోంది. చదువు, భవిష్యత్తు, వ్యక్తిత్వ నిర్మాణం వంటి అత్యంత కీలక దశలో ఉండాల్సిన ఒక పిన్న వయస్కురాలు పరీక్ష హాల్‌లోనే శిశువుకు జన్మనివ్వాల్సి రావడం అనేది ఆమె వ్యక్తిగత విషాదం కాదు. ఇది సమాజపు నైతిక, కుటుంబ, విద్యా వ్యవస్థల వైఫల్యాన్ని కూడా ప్రతిబింబిస్తున్నది. ఈ ఘటన బాలికలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, భయం, అవగాహన లోపం, సామాజిక నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఆధునిక సమాజం వేగంగా మారుతోంది. స్వేచ్ఛ, వ్యక్తిగత ఎంపికలు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగినప్పటికీ, బాధ్యత, విలువలపై దృష్టి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. స్వేచ్ఛ అనేది నియంత్రణలేని ప్రవర్తనకు అనుమతి కాదు. అది అవగాహనతో కూడిన నిర్ణయ సామర్థ్యాన్ని కోరుతుంది. కానీ చాలాసార్లు యువత, ముఖ్యంగా టీనేజ్ బాలికలు, భావోద్వేగ ప్రభావాలకు లోనై భవిష్యత్తు పరిణామాలను అంచనా వేయకుండా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో స్వేచ్ఛ దుర్వినియోగం వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఇక్కడ భయం, మౌనం అనే ముఖ్యమైన కోణాలను కూడా గుర్తించాలి. అనేక సందర్భాల్లో బాలికలు ఎదుర్కొనే వేధింపులు లేదా దుర్వినియోగాన్ని బయటపెట్టడానికి వెనుకాడుతున్నారు. సమాజం తీర్పు చెప్పే ధోరణి, కుటుంబాలతో సంభాషణ లోపం, అవమాన భావన కారణంగా సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. ఫలితంగా సమస్య ప్రారంభ దశలో పరిష్కారం కాకుండా, సంక్షోభంగా మారుతుంది. బాలికలను ఎలా చూడాలి అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది. వారిని కేవలం నియంత్రించాల్సిన వ్యక్తులుగా కాకుండా, అవగాహన కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. కుటుంబాలు ఓపెన్ సంభాషణ వాతావరణాన్ని కల్పించాలి. పాఠశాలలు లైంగిక అవగాహన, వ్యక్తిగత భద్రత, భావోద్వేగ విద్యను బోధించాలి. సమాజం విమర్శకు బదులుగా రక్షణ భావనను పెంపొందించాలి. అదే సమయంలో టీనేజ్ బాలికలకు కూడా బాధ్యతలు ఉన్నాయి. తమ శరీరం, భావోద్వేగాలు, సంబంధాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరం. అపరిచిత సంబంధాలపై జాగ్రత్త, ఒత్తిడికి లోనుకాకుండా నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు లేదా నమ్మకమైన పెద్దలను సంప్రదించడం కీలకం. మౌనం సమస్యను రక్షించదు... అది ప్రమాదాన్ని పెంచుతుంది. ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలి.

## జంతువులకూ నివాస పత్రాలు!



నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారుల చేతివాటం గురించి ఆరోపణలు కొత్తకాదు. అయితే, కనీసం ఎవరు దరఖాస్తు చేసుకున్నారన్నది కూడా చూడకుండా, ధ్రువీకరణ పత్రాలను జారీచేయడం, ఈ దారుణాలకు పరాకాష్ట. బిహార్‌లో వెలుగులోకి వచ్చిన ఘనట ప్రభుత్వ విభాగాల ప్రస్తుత దయనీయ స్థితిని స్పష్టంగా బయటపెడుతోంది. 'క్యాట్ కుమార్' అనే పేరుతో నివాస ధ్రువీకరణకు దరఖాస్తు వచ్చింది. తండ్రి పేరు క్యాటీ బాస్, తల్లి పేరు కాటియా దేవిగా పేర్కొన్నారు. అంతేకాదు, ఒక పిల్లి ఫోటోతో ఆన్‌లైన్‌లో నివాస సర్టిఫికెట్ కోసం చేసిన దరఖాస్తును స్వీకరించబడటం పరిపాలనా వ్యవస్థలో ఉన్న తీవ్రమైన లోపాలను సూచిస్తోంది. అంతకుముందు 'డాగ్ బాబు', 'డాగేశ్ బాబు', 'సోనాలికా ట్రాక్టర్' వంటి పేర్లతో కుక్కలు, ట్రాక్టర్లకు కూడా నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేశారు. చివరికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతోనూ నివాస ధ్రువీకరణ దరఖాస్తులు నమోదు కావడం ప్రభుత్వ డిజిటల్ వ్యవస్థలు సరైన పర్యవేక్షణ యంత్రాంగం లేకుండా పనిచేస్తున్నాయని చూపిస్తోంది. ఈ సంఘటనలు కేవలం సరదా లేదా వ్యంగ్య చర్యలుగా కనిపించినప్పటికీ, వాస్తవానికి ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లు తగిన డేటా పరిశీలన లేకుండా నకిలీ దరఖాస్తులను అంగీకరించడం వల్ల అధికారుల సమయం వృథా కావడంతో పాటు అసలు లబ్ధిదారులకు సేవలు ఆలస్యం అవుతున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి రావడం పరిస్థితి ఎంత దిగజారిందో తెలియజేస్తోంది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# కేరళ ప్రభుత్వ 'తాయిలాలు'

కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న కేరళ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం వివిధ విభాగాల ప్రజలకు మేలు చేకూర్చే పలు 'తాయిలాలు' ప్రకటించింది. అయితే ఇవి పలు రాష్ట్రాలు ఎన్నికలకు ముందు ప్రకటిస్తున్న 'మితాయిలు' (ప్రధాని భాషలో) వంటివి కావు; వివిధ తరగతుల ప్రజావిభాగాలకు మేలు చేకూర్చే, ఇబ్బందులు నివృత్తి చేసేటటు వంటి ప్రజాహిత నిర్ణయాలు. కేరళ రాష్ట్రం పేరును తమ మాతృ భాష మళయాళంలో ఉచ్చరించే విధంగా 'కేరళం'గా మార్చాలన్న చిరకాల ఆకాంక్ష నెరవేరిన సంతోషంలో ఉంది కేరళ. రాష్ట్ర అసెంబ్లీ ఈ మేరకు చట్ట సవరణ కోరుతూ రెండేళ్ల క్రితం ఆమోదించి కేంద్రప్రభుత్వానికి పంపిన తీర్మానాన్ని కేంద్రమంత్రివర్గం గతవారం ఆమోదించటం తెలిసిందే. దీని ప్రకారం చట్టబద్ధంగా తీసుకోవలసిన శాసనసంబంధ చర్యలు పూర్తికావటానికి కొన్ని మాసాలు పడుతుంది.

కేరళ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాల్లో ప్రధానమైంది కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరయ్యే జనరల్ కేటగిరి అభ్యర్థుల వయోపరిమితిని 36 నుంచి 40కి పెంపుచేయటం. రాష్ట్రంలో విద్యావంతులైన యువతలో నిరుద్యోగిత 29.9శాతంగా ఉన్న నేపథ్యంలో – ఎస్ఎస్ఎల్‌సి నుంచి పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ వరకు – ప్రభుత్వోద్యోగాలు ఆశించే లక్షలాదిమందికి ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందనుటలో సందేహం లేదు. మరో ప్రాముఖ్యత గల చర్య – మహిళల భద్రతకు ఉద్దేశించి కేరళ పోలీసు రూపొందించిన "నిర్భయ నిష" ప్రాజెక్టును ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించటం. ఉద్యోగాలు చేయటానికి, ఇతరత్రా అవసరాలకు అపరరాత్రి వేళల్లో ప్రయాణాలు చేసే మహిళల్లో ఇది ఎంతో ఆత్మవిశ్వాసం కలుగజేస్తుంది. ఈ ప్రాజెక్టు కింద కేరళ వ్యాప్తంగా పోలీసులు రాత్రి గస్తీలు ముమ్మరం చేస్తారు, రవాణా కేంద్రాలు, ఐటి పార్క్‌లు, ఆసుపత్రిజోన్‌లు, విద్యాసంస్థల వంటి సున్నితమైన ప్రాంతాల్లో పోలీసులను నియమిస్తారు. టెక్నాలజీ ఉపయోగించి హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. హైవే గస్తీ యూనిట్లు, పింక్ పెట్రోలు యూనిట్లు రంగంలో దిగుతాయి.

12వ వేతన కమిషన్ ఏర్పాటు నిర్ణయం ఉద్యోగులు ఆహ్వానించే వార్త. ఉద్యోగుల వేతనాల సవరణను సిఫారసు చేసే ఈ కమిషన్‌కు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.పి.జాయ్ చైర్మన్. మూడు మాసాల్లో నివేదిక సమర్పించాలన్నది ప్రభుత్వ ఆదేశం.

కేరళీయునిగా ఎవరైనా నిరూపించుకునేందుకు లీగల్ డాక్యుమెంటుగా నేటివిటీ కార్డ్ జారీ చేయాలన్న నిర్ణయం ముఖ్యంగా మైనారిటీలకు ఎంతో ఉపశమనం కలిగించే నిర్ణయం. నివాస అర్హతకు రుజువుగా ప్రభుత్వం ఇప్పటికే నేటివిటీ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నది. కాగా ఈ కార్డు లీగల్ డాక్యుమెంట్‌గా పనిచేస్తుంది. అంతర్గత వలసలు ఎక్కువగా జరుగుతున్న ఈ కాలంలో ఈ కార్డు ప్రభుత్వ సేవలు పొందేందుకు కూడా ఉపకరిస్తుంది. తల్లిదండ్రులు కేరళలో జన్మించిన వారై ఉన్నవారికి లేదా దంపతుల్లో ఒకరు ఇక్కడ జన్మించి, రాష్ట్రంలో శాశ్వత నివాసిగా ఉన్నటువంటి సంతానానికి ఈ కార్డు జారీ అవుతుంది.

రాష్ట్రంలోని క్రైస్తవ మైనారిటీల విద్య, ఆర్థిక, సంక్షేమ సమస్యలను అధ్యయనం చేసిన జె.బి.కోషీ కమిషన్ నివేదికను కేరళ మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదించింది. సంబంధిత బిషప్‌లు జారీ చేసిన సర్టిఫికేట్‌లను కూడా ఇకపై కమ్యూనిటీ సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు సపోర్టింగ్ డాక్యుమెంట్‌గా గుర్తిస్తారు.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా మానవ నివాస గృహాలకు సంభవించే నష్టాలు పూడ్చేందుకు సమగ్రమైన గ్రూపు ఇన్సూరెన్స్ పథకాన్ని మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర బీమా డిపార్టుమెంట్ ద్వారా దీన్ని అమలు చేస్తారు. రెండేళ్ల క్రితం ఆకస్మిక వర్ష బీభత్సంతో వాయనాడ్ జిల్లాలో జనావాసాలకు అపారనష్టం సంభవించిన కాలంలో వారిని ఆదుకోవటానికి కేంద్రం ముందుకు రాకుండా కేరళ పట్ల వివక్ష చూపటం తెలిసిందే. వాయనాడ్ జిల్లాలో కేరళ ప్రభుత్వం తలపెట్టిన ప్రధానమైన రహదారి ప్రాజెక్టులో టన్నెల్ త్రవ్వకం నిమిత్తం కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి కేరళ ప్రభుత్వం క్లియరెన్స్ సంపాదించింది. రూ.2,134 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అనుకున్నట్లు నాలుగేళ్లలో పూర్తయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వాయనాడ్ జిల్లా వెళ్లే ప్రయాణీకులు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగిపోతాయి. ●

# నారింజ విప్లవంపై పందెం

తులసి జయకుమార్
ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్, ఇడి, భవన్స్ సెంటర్ ఫర్ ఫ్యామిలీ బిజినెస్ అండ్ ఎంటర్‌ప్రీన్యూర్‌షిప్, ఎస్‌పిజెఐఎంఆర్

దశాబ్దాలుగా భారతదేశ ఆర్థిక కథనం స్టీల్, సిలికాన్, విత్తనాల చుట్టూ తిరుగుతుంది. మన రహదారుల పొడవు, మన గోధుమల ఉత్పత్తి టన్నులు, మన సాఫ్ట్‌వేర్ ఎగుమతుల పరిమాణం ఆధారంగా మనం మన పురోగతిని కొలిచాము. కానీ 2026–27 కేంద్ర బడ్జెట్ భారతదేశ వృద్ధి ఆకాంక్షలో కొత్త రంగును సూచిస్తుంది. అది 'ఆరెంజ్ ఎకానమి (నారింజ ఆర్థిక వ్యవస్థ)'. ఇంటర్ అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూపొందించిన ఈ పదం సృజనాత్మకత, సంస్కృతి, మేధో సంపత్తి ఉత్పత్తి చేసే పరిశ్రమల ఆర్థిక విలువను సూచిస్తుంది.

నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో సంస్కృతిని మృదువైన శక్తిగా సంబరాలు జరుపుకోవటం కంటే ఎక్కువ చేసి చెప్పారు. ఆమె దానిని కఠినమైన ఆర్థికశాస్త్రంగా ముందుకు తీసుకువచ్చారు. 2026 లో భారతదేశ మీడియా, వినోద రంగం విలువ రూ.2.87ట్రిలియన్లు (35 బిలియన్‌ల డాలర్లు) ఉండటంతో, స్టోరీ టెల్లింగ్ (కథ చెప్పడం) అనేది వ్యూహాత్మక ఆస్తి తరగతి (అస్సెట్ క్లాస్) గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. భారతదేశ సేవలరంగం చాలా కాలంగా అధిక వృద్ధిని సాధిస్తోంది. కానీ సాంప్రదాయ ఐటి, వ్యాపార ప్రక్రియ నిర్వహణ నమూనా పరిపక్వం చెందుతోంది. 7–8 శాతం జిడిపి వృద్ధిని కొనసాగించడానికి కొత్త రంగం అవసరం. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే భారతదేశ శ్రామిక శక్తి లో దాదాపు 8 శాతం ఉంటుందని అంచనా. ఇది ఆస్ట్రేలియాలో 2.1శాతం, దక్షిణ కొరియాలో 1.9శాతం ఉండొచ్చు.

బడ్జెట్‌లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ (విఎఫ్ఎక్స్), గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ వంటి రంగాలపై దృష్టి పెట్టడం డిజిటల్ తరం ఎలా సంపాదిస్తుందో తెలియజేస్తుంది. బెంగళూరులో కోడర్ ఎంత ముఖ్యమో, ఇప్పుడు పూణేలోని విఎఫ్ఎక్స్ కళాకారుడు లేదా హైదరాబాద్‌లోని గేమ్ డిజైనర్ ఎగుమతులకు అంతే ముఖ్యం. గత ఆర్థిక సంవత్సరంలో సృజనాత్మక సేవల ఎగుమతులు 20 శాతం పెరిగాయి. నిర్వహణ, మెయింటినెన్స్, అనుబంధ పనికి మించి విదేశీ మారకపు ద్రవ్య ఆదాయాలను కొత్తరంగాలకు విస్తరిస్తున్నాయి. 2030 నాటికి ఈ రంగానికి 20లక్షల మంది నిపుణులు అవసరమవుతారనే అంచనాను నిజంగా అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం నైపుణ్యం కలిగిన వారు తక్కువ సంఖ్యలో ఉండడాన్ని సూచిస్తుంది.

ఈ కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ముంబైలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ విద్యకు సంబంధించి ఒక మౌలికమైన మార్పుకు నాయకత్వం వహించేందుకు మద్దతు ఇస్తోంది. సెకండరీ పాఠశాలల్లో 15,000 కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు, కళాశాలల్లో 500 ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలనే ప్రణాళిక కళలకు 'సిలికాన్ వ్యాలీ క్షణం'(ఐటి విప్లవం తరహా) వంటిది. గణితం, భౌతిక శాస్త్రంతో పాటు డిజిటల్ స్టోరీ టెల్లింగ్, క్యారెక్టర్ డిజైన్, ఎఐ సహాయక యానిమేషన్‌ను పొందుపరచడం ద్వారా ప్రభుత్వం సృజనాత్మకతను ప్రధాన స్రవంతి కెరీర్‌గా చట్టబద్ధం చేస్తోంది.

ఈ చర్య అవకాశాలను ప్రజాస్వామికీకరణ చేస్తుంది. నారింజ ఆర్థిక వ్యవస్థలో, భౌగోళిక ప్రాంతం ముఖ్యం కాదు. ఇండియా ఏఐ మిషన్ కింద టైర్–3 పట్టణంలోని విద్యార్థి గంటకు రూ.65 చొప్పున వెచ్చించి, సబ్సిడీపై అందుబాటులో ఉండే గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్‌తో కాలిఫోర్నియా స్టూడియోలోని పనిచేసేవారితో పోటీ పడవచ్చు.

సినిమా చారిత్రకంగా భారతదేశ ప్రాథమిక సాంస్కృతిక ఎగుమతిగా పనిచేసినప్పటికీ, గేమింగ్ రంగం డిజిటల్ సేవలలో ముఖ్యమైన ఆర్థిక స్తంభంగా ఉద్భవించింది. ప్రభుత్వ డేటా ప్రకారం భారతదేశ ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ విలువ 2024లో రూ.23,200 కోట్లుగా ఉంది. ఇది 2027 నాటికి రూ.31,600కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఈ పథం గేమింగ్‌ను డిజిటల్ సృజనాత్మక పర్యావరణ వ్యవస్థ ప్రధాన చోదకశక్తిగా ఉంచుతుంది. దీనికి పట్టణ, గ్రామీణ కేంద్రాలలో దాదాపు 50 కోట్లమంది వినియోగదారుల పునాది ఉంది.

'క్రియేట్ ఇన్ ఇండియా' అనే ప్రోత్సాహం దేశాన్ని వినియోగదారుడి నుండి సృష్టికర్తగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. సంవత్సరాలుగా, భారతీయ గేమర్లు పశ్చిమ దేశాల్లో, జపాన్ లేదా చైనాలో నిర్మించిన ప్లాట్‌ఫామ్‌లపై ఆడారు. దేశీయ అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా, ఐపి ఆధారంగా రుణాలను అందించటం ద్వారా, ప్రభుత్వం డెవలపర్లను ప్రపంచ ప్రేక్షకుల కోసం భారతీయ పురాణాలను, సమకాలీన కథనాలను వెలికితీయడాన్ని ప్రోత్సహిస్తోంది. గేమింగ్ గొలుసులలో పాల్గొనడం మాత్రమే కాదు, ఐపి యాజమాన్యం పెద్ద బహుమానం.

అయితే, ఆర్థికవేత్త దృష్టి చాలా పరిశీలనాత్మకంగా కూడా ఉండాలి. నారింజ ఆర్థిక వ్యవస్థ అధిక జీతం ఇచ్చే ఉద్యోగాలను అందిస్తున్నప్పటికీ, సృజనాత్మకత లేని వాటికంటే సృజనాత్మక పాత్రలు 88 శాతం ఎక్కువ వేతనం ఇస్తున్నట్లు చెబుతున్నారు. తద్వారా అంతరం పెరిగే ప్రమాదం ఉంది. కోవిడ్ మహమ్మారి తర్వాత భారతదేశంలో కె–ఆకారపు(ఒక విపత్తు లేదా మాంద్యం తదుపరి వివిధ రంగాల మధ్య అసమతుల ఆర్థిక పునరుజ్జీవనం – ఏదో ఒక రంగం వేగంగా వృద్ధి చెందటం)రికవరీ కొనసాగుతోంది. సృజనాత్మక విజృంభణ ప్రస్తుతం పట్టణ సమూహాలలో కేంద్రీకృతమై ఉంది. అందరినీ కలుపుకోవడంలో సవాలు ఉంది. నారింజ ఆర్థిక వ్యవస్థ ముంబైలోని డిజిటల్ యానిమేటర్‌తో పాటు కాంచీపురంలోని చేనేత నేతకారుడిని కూడా తనలోకి తీసుకోవాలి.

జనరేటివ్ ఎఐ ఆవశ్యకతను కల్పిస్తుంది. ఇది ఉత్పత్తి వ్యయాన్ని 40 శాతం తగ్గించగలదు. కానీ డబ్బింగ్, ప్రాథమిక ఇలస్ట్రేషన్(బొమ్మలు), కోడింగ్‌లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కూడా ముప్పు వాటిల్లేలా చేస్తుంది. ప్రభుత్వం 'విశ్వసనీయ ఎఐ'పై ప్రాధాన్యత ఇవ్వడం, కాపీరైట్‌పై ఏకాభిప్రాయం ప్రతిపాదించటం సరైన దిశలో ఒక అడుగు. నారింజ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలంటే, సృష్టికర్తను రక్షించాలి. ఎఐ నమూనాలు పరిహారం లేకుండా ఒక కళాకారుడి శైలిని 'గీయడం' చేయగలిగితే, కొత్త వాటిని సృష్టించేందుకు ప్రోత్సాహకం మాయమవుతుంది. అమలు చేయగల ఐపి రక్షణ లేనట్లయితే, సృష్టికి ప్రోత్సాహకాలు క్షీణిస్తాయి. ఆశావాదం ఉన్నప్పటికీ, నిధుల అంతరాలు, నియంత్రణ చిక్కు, భౌతిక మౌలిక సదుపాయాల కొరత వంటి నిర్మాణాత్మక అడ్డంకులు అలాగే ఉన్నాయి. స్క్రిప్ట్ లేదా గేమ్ డిజైన్‌కు ఎలా విలవగట్టాలో బ్యాంకులు తెలుసుకోకపోవడంతో సృజనాత్మకత కలిగిన చిన్న సంస్థలు రుణం కోసం ఇబ్బంది పడుతున్నాయి. మనకు 'సృజనాత్మక బ్యాంకు' లేదా ప్రత్యేక ఐపి మూల్యాంకన చట్రం అవసరం. గేమింగ్ వర్గీకరణల నుండి ఒటిటి సెన్సార్‌షిప్ వరకు, నియంత్రణ వాతావరణం తరచుగా ప్రతిస్పందనాత్మకంగా ఉంటుంది. లైవ్ ఈవెంట్స్‌కు సింగిల్ విండో అనుమతులు, సృజనాత్మక ఆడియో – విజువల్ రంగానికి ఒక సమగ్ర జాతీయ విధానం అవసరం. చివరగా, డిజిటల్ ల్యాబ్‌లు గొప్పవి, కానీ నారింజ ఆర్థిక వ్యవస్థ కూడా 'ఢీకొనటాలు' ఆధారంగా వృద్ధి చెందుతుంది. మనకు కళాకారులు, సాంకేతిక నిపుణులు, పెట్టుబడిదారులు ఒకచోట చేరి ఆలోచనలను మార్పిడి చేసుకోగల భౌతిక ప్రదేశాలతో కూడిన సృజనాత్మక జిల్లాలు అవసరం. నారింజ ఆర్థిక వ్యవస్థ ప్రాముఖ్యత జిడిపి శాతాలను మించింది. ఇది అస్థిత్వానికి సంబంధించింది. ఒక దేశం తన ఊహను ఎగుమతి చేసినప్పుడు, అది తక్కువ వ్యయంతో కూడిన శ్రమ ఆధారంగా పోటీపడటం నిలిచిపోతుంది. భావాల ఆధారంగా ముందుకు పోవటం ప్రారంభిస్తుంది. బడ్జెట్ రూపురేఖలను రూపొందించింది. భారతదేశం ప్రపంచ 'బ్యాక్ ఆఫీస్' నుండి దాని 'సృజనాత్మక స్టూడియో'గా పరిణామం చెందుతుందా లేదా అనేది ఇప్పుడు దాని అమలు నిర్ణయిస్తుంది. అది విజయవంతమైతే 'మేడ్ ఇన్ ఇండియా' మరింత శక్తివంతమయ్యేందుకు దారితీస్తుంది. అదే 'ఇమాజిన్డ్ ఇన్ ఇండియా'(భారతదేశంలో పుట్టిన ఊహ). మన డబ్బును మన మేధస్సు ఉన్న చోట వెచ్చించాల్సిన సమయం ఇది.

*(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో..)*

# ప్రైవేటు విద్య మేడిపండే!

## తెలంగాణ విద్యా కమిషన్ నివేదికలో వెల్లడైన సత్యాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం నాడు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో పాటు సభ్యులు సమర్పించిన నివేదికలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ విద్యారంగం బ్రహ్మపదార్థం, ప్రైవేటు విద్యా రంగం భేష్ అనే ప్రచారాలను పటాపంచలు చేసేవి కమిషన్ నివేదికలో ఉన్నాయి. ప్రధానంగా ఆంగ్లమాధ్యమంపై మోజు తల్లిదండ్రులను ప్రైవేటు విద్యారంగం వైపు మళ్ళిస్తుందనే అంశం కమిషన్ అధ్యయనంలో తేలింది. అందుకు విరుగుడుగా నర్సరీ స్థాయి నుంచే ఆంగ్లం, ఇంగ్లీషు పాఠ్యాంశాలను తప్పనిసరి చేసి, ఒకటవ తరగతి నుంచి హిందీ లేదా ఉర్దూ పాఠ్యాంశాన్ని చేర్చాలనే త్రిభాషా విధానాన్ని సిఫార్సు చేసింది. అంతేగాక, ప్రభుత్వ విద్యా సంస్థలు అన్ని స్థాయిల్లో ఇంగ్లీష్ మీడియంలోనే నిర్వహించాలని సూచన చేసింది. ఇందుకు ఒక మినహాయింపునిచ్చింది. ఒకవేళ తల్లిదండ్రులు తమ పిల్లలను తెలుగు మీడియంలోనే చదివించాలని కోరుకుంటే, అలాంటి వారికోసం ఉమ్మడి జిల్లాకు ఒక రెసిడెన్షియల్ పాఠశాలను 5వ తరగతి నుంచి తెలుగు మాధ్యమంలో నిర్వహించాలని పేర్కొంది. విద్యారంగానికి ప్రామాణికంగా నిలిచిన కొఠారి కమిషన్ ప్రతిపాదనకు అనుగుణంగానే త్రిభాషా ఫార్ములాను రూపొందించినట్లు వివరించింది. ఏడేళ్ళ లోపు పిల్లలు బహుళ భాషలను సులువుగా నేర్చుకోగలరనే అంతర్జాతీయ పరిశోధనలు ఇందుకు ప్రాతిపదికగా చేసుకున్నారు. దీనిపై కొంత చర్చ జరగాల్సిన అవసరం లేకపోలేదు.

### ప్రైవేటులో పెద్దగా నేర్చుకున్నదేమీ లేదు

ప్రైవేటు పాఠశాలలకు పంపితేనే తమ పిల్లలు బాగా చదువుకుంటారనే తల్లిదండ్రుల ఆలోచనను బలపరిచే రీతిలో ఫలితాలు లేవని విద్యా కమిషన్ నివేదికలోని సమాచారం తేల్చింది. అభ్యసన నైపుణ్యాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్ద తేడా లేదని తేలింది. గ్రామీణ తెలంగాణలో 5వ తరగతి చదివే విద్యార్థులు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలను సరిగా చదవన వారిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిలు 29.3 శాతం ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో 35.6 శాతమే ఉన్నారు. అంటే ప్రైవేటు పాఠశాలల్లో కూడా నేర్చుకునేది గొప్పగా ఏమీ లేదనే స్పష్టమవుతోంది. చదువు మాత్రమే తమ పిల్లలను పేదరికం నుంచి బయటపడేస్తుందనే ఆశ నిరుపేద తల్లిదండ్రులలో నెలకొంది. నెలకు రూ.10వేల లోపు సంపాదించే దళిత కుటుంబాలలో 70 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్ళకే పంపిస్తున్నారు.

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా విద్యార్థులు చదువుతున్నారనే అంశంపై ఆసక్తికర గణాంకాలు కమిషన్ నివేదికలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరిలలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ కాలేజీలు మొత్తం 28,033 ఉండగా, అందులో 26.05 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే సమయంలో 13,244 ప్రైవేటు పాఠశాలలు (అన్‌ఎయిడెడ్) ఉండగా, వాటిల్లో 49.51 లక్షల విద్యార్థులు చదువుతుండడం గమనార్హం. ఇలా చూస్తే ఎవరికైనా ప్రభుత్వ విద్యారంగంపై అసంతృప్తి రావడం సహజం. ప్రభుత్వ విద్యా సంస్థల్లో టీచర్ల సంఖ్య 1.54 లక్షలు ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో 2.11 లక్షల టీచర్లు (ప్రభుత్వ పాఠశాల కంటే 150 శాతం అధికం)గా ఉన్నారు. ప్రభుత్వ టీచర్లు 43.48 శాతం, ప్రైవేటు టీచర్లు 55.48 శాతం ఉండడమే ప్రభుత్వ పాఠశాలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండేందుకు ఒక ప్రధాన కారణమే. సంఖ్యకు ప్రభుత్వ విద్యా సంస్థలు ఎక్కువే అయినప్పటికీ, టీచర్ల సంఖ్య ప్రైవేటు కంటే తక్కువ, పైగా బోధనేతర పనులు ఎక్కువ. ఒక ఉపాధ్యాయునికి రోజుకు సగటున 3 గంటలు మాత్రమే బోధించే సమయం ఉంటుంది. ఒక పూటంతా బోధనేతర బాధ్యతలకే పోతుందని నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో, ప్రత్యేకించి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే టీచర్లు ఉండే చోట భారం మరింత ఎక్కువ. ఇక్కడ ఒకే టీచర్ పలు తరగతులకు పాఠాలు చెప్పడం, పాఠశాల నిర్వహణ వ్యవహారాలు చూసుకోవడం, అలాగే విద్యార్థు అవసరాలను పట్టించుకోవడం వంటి బహుళ పనులు చేయాల్సి వస్తుందని నివేదిక తెలిపింది. ప్రైవేటు పాఠశాలలో టీచర్ల నియామకం లేదా అర్హతలపై సరైన పర్యవేక్షణ లేకపోవడాన్ని కూడా ఎత్తి చూపింది.

### ప్రైవేటు కాలేజీల్లో ఐఐటి/ నీట్ కొట్టేది ఒక్క శాతమే

ప్రైవేటు జూనియర్ కాలేజీల డొల్లతనాన్ని విద్యా కమిషన్ నివేదిక బట్టబయలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియెట్‌లో సుమారు 11 లక్షల మంది చేరుతుండగా, అందులో సింహభాగం ప్రైవేటీ కాలేజీల్లోనే ఉన్నారు. ప్రైవేటు జూనియర్ కాలేజీలలో 7.20 లక్షల మంది(66 శాతం), రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కెజిబివి, ఎయిడెడ్ కాలేజీలు సహా ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో సుమారు 3.50 లక్షల మంది (34 శాతం) చదువుతున్నారు. ఇంటర్ విద్యారంగాన్ని కార్పొరేట్ కాలేజీలు ఆధిపత్యం చలాయిస్తూ కోళ్ళ పరిశ్రమలు మాదిరిగా నిర్వహిస్తున్నాయని కమిషన్ ఘాటు వ్యాఖ్యలే చేసింది. కేవలం ఆదాయం పెంచుకోవడంపైనే దృష్టి తప్ప విద్యార్థుల చదువు, మానసిక ఆరోగ్యం, సమగ్ర వ్యక్తిత్వ వికాసంపై ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని లోపాన్ని ఎత్తి చూపింది. గడిచిన మూడు దశాబ్దాలుగా కేవలం ఐఐటి, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలపైనే ఇంటర్ కాలేజీలు దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. దీంతో మల్టిపుల్ ఛాయిస్ ఉండే పరీక్షలను ఏ విధంగానైనా విజయం సాధించేందుకు తక్కువ సమయంలో లెక్కలు చేయడం, పాత పరీక్షా పత్రాలను బట్టీ కొట్టించడం తప్ప పాఠ్యాంశాలను సరిగా చదివించటం లేదనే అసంతృప్తిని కమిషన్ వ్యక్తంచేసింది. పైగా ఇంటర్ బోర్డు సిలబస్‌ను పట్టించుకోకుండా, వారి సొంత సిలబస్, పాఠ్యాంశాలను పోటీ పరీక్షల కేంద్రంగా తయారు చేస్తున్నారని, కేవలం వార్షిక పరీక్షలకు నెల ముందే ఇంటర్ సిలబస్ చదివిస్తున్నారని తెలిపింది. బోర్డు సూచించిన పుస్తకాలను పక్కనబెట్టి కోచింగ్ మెటీరియల్‌ను కార్పొరేట్ కాలేజీలే తయారు చేసి, వాటికి ఒక్కో విద్యార్థి నుంచి రూ.18వేల నుంచి రూ.30వేలు వసూలు చేస్తున్నట్లు

**రాజధాని సందడి**

– బొమ్మగాని కిరణ్‌కుమార్

తాము నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌లో తేలిందని కమిషన్ నివేదికలో వెల్లడించింది.

అలాగే ఫీజుల కింద రెండేళ్ళలో రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు చేస్తున్నారని, హాస్టల్, ఆహారం, బస్సు ట్రాన్స్‌పోర్టేషన్‌కు అదనంగా వసూలు చేస్తున్నారనే కఠోర సత్యాన్ని తెలిపింది. అయినప్పటికీ కార్పొరేట్ కాలేజీల్లో ఫలితాలేమి గొప్పగా లేవని తెలిపింది. ఐఐటి– నీట్ ఫలితాలలో టాప్ ర్యాంకర్‌ల ఫోటోలు వేసి, భారీ అడ్వర్టయిజ్‌మెంట్‌లతో తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొంది. ఐఐటి జీ ఫలితాలలో 11 మంది ర్యాంకర్‌ల ఫోటోలను వేర్వేరు కార్పొరేట్‌కాలేజీలు తమ అడ్వర్టయిజ్‌మెంట్‌లలో వేసిన ఉదాహరణ కమిషన్ దృష్టికి వెళ్ళింది. ఇలాంటివి చూసి లక్షల మంది తల్లిదండ్రులు తమ పిల్లలు కూడా ఐఐటి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీటు సాధిస్తారని భారీ ఫీజులు కట్టి చేర్పిస్తున్నారనే ఆవేదన నివేదికలో వ్యక్తమైంది. నిజానికి కార్పొరేట్ కాలేజీలు పోటీ పరీక్షల్లో తమ కాలేజీ నుంచి ఎంత మంది హాజరయ్యారో, అందులో ఎంత మంది సక్సెస్ అయ్యారనే నిష్పత్తిని బయట పెట్టడం లేదు. ఎందుకంటే కార్పొరేట్ కాలేజీల్లో చేరిన విద్యార్థుల్లో చాలా తక్కువ మంది అంటే, ఒక్క శాతం కంటే తక్కువ మంది విద్యార్థులే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. ఇది రూ.వేల కోట్ల వ్యాపారంగా మారిందని తెలిపింది. అయితే, భారీగా అప్పులు చేసి తమ పిల్లలను కార్పొరేట్‌లో చేర్పించినప్పటికీ, అందులో కనీస వసతులు, ల్యాబ్‌లు సరిగా లేవనే వాస్తవాన్ని కమిషన్ ఎత్తి చూపింది. కేవలం టాపర్‌లుగా వస్తారనే కొద్ది మందికి మాత్రమే మంచి లెక్చరర్‌లతో పాఠాలు చెప్పించి, మిగతా విద్యార్థుల విషయంలో అంత గా ప్రమాణాలు పాటించడం లేదని తెలిపింది. ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలను కేటగిరిలుగా విభజించి కచ్చితంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని విద్యా కమిషన్ చేసిన సిఫార్సు ఆహ్వానించదగిందే.

### క్షీణదశలో ఉన్నత విద్య

డిగ్రీ కాలేజీల్లో 80 శాతం ప్రైవేటు రంగంలోనే ఉన్నాయి. డిగ్రీ స్థాయిలో చేరికలు కూడా తక్కువగానే ఉంటున్నాయి. మొత్తం 4.40 లక్షల సీట్లు ఉండగా, సగం కంటే తక్కువగా 2.05 సీట్లే భర్తీ అవుతున్నాయి. అయితే, ఇంటర్ నుంచి ఎక్కువ మంది ఇంజనీరింగ్‌కు వెళ్తుండడం కూడా ఇందుకు ఒక కారణం. ఇటీవల ఇంజనీరింగ్‌లో చేరుతున్న వారి సంఖ్య కూడా తగ్గుతుండడం గమనార్హం. ఇక యూనివర్సిటీల విషయానికి వస్తే పరిస్థితి దారుణంగా దిగజారడాన్ని కమిషన్ నివేదిక అద్దం పడుతోంది. యూనివర్సిటీల పరిస్థితి దిగజారడానికి ప్రధాన కారణం బోధనా సిబ్బంది లేకపోవడమే. ఈ పరిస్థితి తెలంగాణ ఏర్పడి నాటి నుంచి నెలకొని ఉంది. కమిషన్ నివేదిక ప్రకారం ఉస్మానియా యూనివర్సిటీలో మంజూరైన 1267 బోధనా సిబ్బందిలో కేవలం 329 మంది మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉండడం, 938 ఖాళీలు ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీలో 409 పోస్టుల్లో 143 మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉండగా, 331 పోస్టులు ఖాళీనే. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ(జెఎన్‌టియు)లో 408 పోస్టుల్లో 265 పోస్టులు దర్శనమిస్తాయి. తెలంగాణలోని 12 విశ్వవిద్యాలయాల్లో ఇదే దుస్థితి. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఉస్మానియా యూనివర్సిటీకి నాక్ ఇచ్చిన ఎ + ప్లస్ గ్రేడ్ 2024లో కోల్పోయింది.

### బాగుపరిచే మార్గమేమిటి?

విద్యారంగం పరిస్థితిపై తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన నివేదిక రాష్ట్రంలోని విద్యారంగం విషయంలో ప్రమాదఘంటికలను మోగించింది. ఇటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిధులు, బోధనా, బోధనేతర సిబ్బంది, వసతుల కొరత సమస్యలు సతమతం చేస్తుండగా,దీనిని ఆసరా చేసుకొని ప్రైవేటు విద్యాసంస్థలు నిలువుదోపిడీ చేస్తున్నాయి. వాటిపై నియంత్రణ లేకుండా పోయింది. ప్రభుత్వ విద్యారంగాన్ని బాగు పరిచేందుకు బడ్జెట్‌లో 18 శాతం నిధులు ఇవ్వాలని కమిషన్ స్పష్టమైన సిఫార్సు చేసింది. అందులో 5 శాతం ఉన్నత విద్యా రంగానికి ఇవ్వాలని సూచించింది. విద్యారంగానికి 2014–15లో 10.9 శాతం ఉన్న బడ్జెట్, 2021–22 నాటికి 5.9 శాతానికి పడిపోయింది. 2024–25 నుంచి క్రమంగా పెంచుతుండడంతో 7.55 శాతానికి చేరింది. ఇదే కాకుండా ప్రైవేటుకు కళ్ళెం వేసేందుకు 400 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం ముందు ఉంచింది విద్యా కమిషన్. అందుకు నమూనాగా తాము విజయవంతంగా అభివృద్ధి చేసిన ఆరుట్ల పాఠశాల ప్రయోగాన్ని చూపించింది. అలాగే యూనివర్సిటీల రిక్రూట్‌మెంట్‌తో పాటు, పరిశోధనలను బలోపేతం చేసే సూచనలను కూడా చేసింది. ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలోనే ఎక్కువ ప్రైవేటు పాఠశాలల ఉండడం, అతి తక్కువ సంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో వసతులు లేకపోవడం వంటి అంశాలపై కమిషన్ కొంత లోతుగా పరిశీలన చేయా ల్సి ఉండింది. అయితే, జిహెచ్ఎంసి పరిధిలోని మూడు జిల్లాలకు అదనంగా ఆరు విద్యా జిల్లాలను ఏర్పాటు చేయాలనే సూచన కొంత ఊరట.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి సారిగా రాష్ట్రంలో నర్సరీ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు విద్యారంగంపై ఒక అవగాహన కల్పించేందుకు విద్యా కమిషన్ డాక్యుమెంట్ ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. ఆయా స్థాయిల్లో సమస్యలనే గాకుండా, వాటి పరిష్కారానికి మార్గాలను కూడా విద్యా కమిషన్ చూపించింది.అయితే, అందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించిన వ్యాఖ్యలపై, ఎస్ఎస్‌సిలో ఇంటర్‌బోర్డు విలీనం, త్రిభాష ఫార్ములాపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వాటిపై లోతైన చర్చ చేసి సరైన అభిప్రాయానికి వచ్చే అవకాశం ఇంకా ఉంది. కానీ, ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా విద్యారంగాన్ని ప్రక్షాళన, బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదనే ఉంది. చిత్తశుద్ధి ఉంటే అదేమీ పెద్ద సమస్య కాదు. ఢిల్లీలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలోనే అరవింద్ కేజ్రీవాల్ విద్యావ్యవస్థలో సమూల మార్పు తీసుకువచ్చి, ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వసనీయతను పెంచిన విషయాన్ని మరవరాదు.

## ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణంలో డా.రాజారెడ్డి నూతన ఆరాధన హాస్పిటల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి హాజరయ్యారు.ఎమ్మెల్యే ఆసుపత్రిని ప్రారంభించి,వినూత్న వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలను పరిశీలించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆధునిక సాంకేతికతతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.అనంతరం ఆసుపత్రి నిర్వాహకులను అభినందించారు.ప్రాంత ప్రజలకు న్యాయమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు,నాయకులు వైద్య సిబ్బంది,పాల్గొన్నారు.

## రిమ్స్ డైరెక్టర్‌ను కలిసిన ఎఐటియుసి నూతన కమిటీ



ప్రజాపక్షం/ఆదిలాబాద్: తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ను యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 25న ఎన్నుకొబడిన నూతన జిల్లా కమిటీని ఈ సందర్భంగా డైరెక్టర్‌కు పరిచయం చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్ల శివన్న, డొంగ్రే చందులతో పాటు 16 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ అధికారికంగా ఎన్నికైన ఈ కమిటీ పేరుతో మరెవరైనా కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి సిద్ధమైన ఆహారంతోనే ఆరోగ్యం




ప్రజాపక్షం / మంచిర్యాల : ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని, రాబోయే వేసవిలో ప్రతి ఒక్కరు మట్టి కుండల నీటినే సేవించాలని జిల్లా అదనపు పాలనాధికారి చందయ్య సూచించారు. శనివారం జిల్లా విద్యాశాఖ, జిల్లా సైన్స్ కేంద్రం మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నేషనల్ గ్రీన్ కోర్ తెలంగాణ డైరెక్టర్ ఆదేశాల మేరకు మట్టి పాత్రలు, మట్టి గణపతి వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాలు మానవాళి శ్రేయస్సు కోసమే ఉండాలని, పర్యావరణ హానికి తావుండకూడదని ఆయన పేర్కొన్నారు. కుండల తయారీదారు రాంచందర్ వివిధ రకాల మట్టి పాత్రలను ప్రత్యక్షంగా తయారు చేసి చూపగా, 50 మంది విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర, సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ విజేతలు గంప శ్రీనివాస్, జాడి ప్రవీణ్‌లను మెమెంటోలతో సత్కరించారు.జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, ప్రభుత్వ పరీక్షల సంచాలకులు మల్లేషం, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి , రాజ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, రాజన్న పాల్గొన్నారు.

## సిసిఐ కొనుగోళ్లు బంద్

### దళారుల చేతిలో చిక్కిన పత్తి రైతు

ప్రజాపక్షం / రెబ్బెన : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోళ్లను శనివారంతో నిలిపివేయడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. మద్దతు ధర దక్కక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది వర్షాల ప్రభావంతో పత్తి దిగుబడి తగ్గడమే కాకుండా నాణ్యత దెబ్బతిన్నదని, తేమ శాతం పేరుతో అధికారులు కొనుగోళ్లు తిరస్కరించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కిసాన్ కపాస్ యాప్ లో నమోదు ప్రక్రియ గ్రామీణ రైతులకు ఇబ్బందిగా మారడంతో వారు ప్రైవేట్ వ్యాపారులకే పంటను తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. సిసిఐ కేంద్రాల మూసివేతను అదునుగా తీసుకున్న ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్ కు రూ.5,000 నుండి రూ.6,000 లోపే ధర చెల్లిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు దళారులు అధికారులతో కుమ్మక్కై తక్కువకు కొన్న పత్తిని తిరిగి సిసిఐకే విక్రయిస్తున్నారని వారు మండిపడుతున్నారు. పంట తీత ఆలస్యమైనందున సిసిఐ కొనుగోళ్ల గడువును మార్చి నెలాఖరు వరకు పొడిగించి తమను ఆదుకోవాలని పత్తి రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు

ప్రజాపక్షం/నిజాంపేట్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని రిషిక్ స్కూల్లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.స్వామి, భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, మనం చేసే ప్రతి పనిలోనూ సైన్స్ అంతర్లీనంగా ఉంటుందని పేర్కొన్నారు. సైన్స్ లేనిదే ప్రపంచంలో ఏ పని జరగదని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించాలన్నారు అనంతరం పాఠశాల విద్యార్థులకు సైన్స్ అంశాలపై ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయురాలు సంధ్య ఉపాధ్యాయురాలు స్వప్న, భాగ్యలక్ష్మి, స్వప్న, లావణ్య, సంధ్య, పాల్గొన్నారు.




# పిఎంశ్రీ పాఠశాలలను పరిశీలించిన సెంట్రల్ నోడల్ అబ్జర్వర్

### కలెక్టరేట్‌లో.. ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో పిఎంశ్రీ నిధులు మంజూరైన పాఠశాలలను సెంట్రల్ నోడల్ అబ్జర్వర్ దేవేంద్రకుమార్ రాయ్(జాయింట్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ టెలి కమ్యూనికేషన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిఎంశ్రీ నిధులతో కంజర, నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయం పాఠశాలలో చేపడుతున్న పనులను, జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పిఎంశ్రీ నిధులు మంజూరు చేసిన 40 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. డీఈఓ అశోక్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సెంట్రల్ నోడల్ అబ్జర్వర్ దేవేంద్రకుమార్




మాట్లాడుతూ పిఎంశ్రీ కార్యక్రమాల అమలు పట్ల పాఠశాలల్లో ఉపాధ్యాయులు శ్రద్ధ కనబరుస్తున్నారని అభినందించారు. విద్యార్థులు కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ప్రగతిని కనబరుస్తున్నారని, ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తన పరిశీలనలో గమనించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల అమలు కోసం సమయం ఇచ్చినట్లయితే సరైన విధంగా ప్లాన్ చేసుకుని ఇంకా మంచి ఫలితాలు సాధించగలుగుతామని హెడ్‌మాస్టర్‌లు అభిప్రాయాలను వెలిబుచ్చారు. సెంట్రల్ అబ్జర్వర్ పాఠశాలలో కార్యక్రమాల అమలు తీరును పరిశీఇంచి అభినందించడం సంతోషంగా ఉందని, ఈ స్ఫూర్తిని కొనసాగించడానికి జిల్లా విద్యాశాఖకు మరింత ప్రోత్సాహానందిస్తామన్నారు. గత యేడాది పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలను అభినందించారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం మెదక్ : మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిని శనివారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో పుష్పగుచ్చం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలనీ, ప్రజా ప్రభుత్వానికి మరింత మంచి పేరు తేవాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ తన శక్తి వంచనతో అహర్నిశలు పనిచేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెస్తామన్నారు.

## భక్తులకు సకల వసతులు కల్పించాలి

### రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/గజ్వేల్: నాచగిరి శ్రీలక్ష్మి నృసింహ క్షేత్ర నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు సకల వసతులు కల్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షులు రవీందర్ గుప్త, కార్యనిర్వహణాధికారి రంగాచారి నేతృత్వంలో మంత్రికి నాచగిరి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద ఆశీర్వచనాల మధ్య స్వామి వారి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

## విద్యాశాఖ ఆధ్వర్యంలో మోడల్ ఐక్యరాజ్య సమితి

ప్రజాపక్షం మెదక్ : మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సోషల్ ఫోరమ్ సహకారంతో మాడల్ ఐక్యరాజ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా అడిషనల్ కలెక్టర్ నగేష్, డీఈఓ విజయ, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, హవెలి ఘనపూర్ ఎంఈఓ మధుమోహన్, సీఎమ్ఓ రాజు, ఏ ఎస్ ఓ నవీన్ హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా ఎంఈఓ శంకర్, ప్రధానోపాధ్యాయులు రఘు వర్ధన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డిలు, చైర్మన్ రవిబాబు, వైస్ చైర్మన్ నర్సింలు, అనుసంధాన కర్తగా ప్రభాకర్, సూపర్వైజర్లు గా దేవి సింగ్, సత్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, ప్రశాంత,




భూలి బాయి, సంగీత, సుజాత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాల నుండి ఇద్దరు ఇద్దరు విద్యార్థుల చొప్పున 56 దేశాల ప్రతినిధులుగా పాల్గొని, ఆ దేశాల తరపున చర్చలో పాల్గొనడం జరిగింది. 10 పాఠశాలల నుండి జర్నలిస్టులుగా పదిమంది విద్యార్థులు వ్యవహరించారు. సమావేశంలో పాల్గొని ప్రసంగించినటువంటి విద్యార్థులను 11 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపడం జరిగింది ఏఎంఓ సుదర్శనమూర్తి తెలిపారు.సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, స్వరూప రాణి, కిషన్ ప్రసాద్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాపక్షం/రామాయంపేట: ట్టణంలోని మంజీరా విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నోబెల్ బహుమతి అందుకున్న సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ కనుక్కున్న రోజు సందర్భంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మండల విద్యాదికారి శ్రీనివాస్, తహశీల్దార్ రజనికుమారి, డాక్టర్ తిరుపతిలు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంబించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలల్లో ఎంతో విజ్ఞానం దాగి ఉందని వీరే రేపు కాబోయె శాస్త్రవేత్తలని అన్నారు. ఇప్పుడు ప్రతిది ఎలా వచ్చింది..ఎలా పనిచేస్తుంది అనేటువంటి ఆలోచనలతో ఉన్న వారు రేపు కాబోయె శాస్త్రవేత్తలు అని తరగతి గది పుస్తకాలలో చదువుకున్నటువంటి విషయాలను నిత్య జీవితంలో ఏ విదంగా ఉపయోగించాలో నేర్చుకుంటారు. అలాగే సైంటిఫిక్ థింకింగ్ ఎలా చేయాలో ఉదాహరణలతో వివరించారు. విద్యార్థిని, విద్యార్థులు 3వందలకు పైగా సైన్స్ ఎగ్జిబిషన్లను ప్రదర్శించారు. ఇందులో బాగంగా ఏఐ డాక్టర్ ఏ విదంగా ఉపయోగపడుతుంది అంటే చెట్టుకి వచ్చే రోగాలను



ముందుగానే గుర్తించడం, చెట్టుకి ఎంత నీరు కావాలి, ఎలాంటి మందులు వేయాలి చెట్టు అనేది సైంటిఫిక్ నేమ్స్‌దాని కాలం ఎంత అనే విషయాలన్నింటిని వివరిస్తుంది. రోబో, చంద్రయాన్, చంద్రమండలం, ఎర్త్‌క్వేక్, అలారం ఫైర్, ఇంజన్ హైడ్రాలిక్ కార్, చేనేత పనివారు, కుమ్మరి, కమ్మరి, బీడికార్మికులు దారమును చేతితో చుట్టడానికి బదులుగా హైడ్రాలిక్ మిషన్ ద్వారా చుట్టడం చూపరులను ఆకట్టుకుంది.

## అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఉక్కు పాదం

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మోపాల్ గ్రామంలో నిజామాబాద్ మంచిప్ప రోడ్డులో గల సర్వేనెంబరు 449 నందలి 13 ఎకరాల 17 గుంటల విస్తీర్ణంలో ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మాణాలు గావిస్తున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెల్లడించాయని హైకోర్టు అడ్వకేట్ జి నరహరి అన్నారు. చింతా గంగాదర్, చామకూర లక్ష్మిరెడ్డి, కోతి హైమావతి తదితరులు నిజామాబాద్ మంచిప్ప రోడ్డులో గలిగిన 449 సర్వేనెంబరు లో 13 ఎకరాల 17 గుంటలను ఆక్రమించి ఇట్టి స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని హైకోర్టు గత మంగళవారం అనగా ఫిబ్రవరి 24న డబ్ల్యు.పి. నెంబరు 5671/2026 ఉత్తర్వులను జారీచేశారు. మోపాల్ గ్రా మంలో అక్రమ నిర్మాణాలు నిర్వహిస్తు, ప్రభుత్వ భూమిని పరిరక్షించండి అని అనేక పర్యాయాలు జిల్లా కలెక్టర్ తదితర సంబంధిత అదికారులకు ఎన్నిమార్లు అభ్యర్థించినా ఫలితం లేక చివరగా హైకోర్టును ఆశ్రయించవలసి వచ్చిందన్నారు. ఇట్టి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేసి మోపాల్ గ్రామస్తునిగా గ్రామ ప్రజలకు చెందిన ప్రభుత్వ భూమిని కాపాడామన్న తృప్తి ఉందన్నారు. రాష్ట్ర ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ సభ్యురాలు పి.స్వప్న, ఈగ గంగారెడ్డి పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన హైకోర్టు న్యాయవాదులు

ప్రజాపక్షం/నిజామాబాద్ : బాన్సువాడలో ఇటీవల జరిగిన అల్లర్లలో అరెస్టయి నిజామాబాద్ సెంట్రల్ జైలులో రిమాండ్‌లో బిజెపి వివిధ సం స్థల కార్యకర్తలను శనివారం బిజెపి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గోకుల రామారావు నాయకత్వంలోని హైకోర్టు న్యాయవాదులు ప్రతినిధుల బృంం జైలు ములాఖత్ వారిని కలిసి పరామర్శించారు. బెయిలు పొందేందుకు చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటున్న వారికి అండగా ఉంటామని భరోసా నినిచ్చి మాట్లాడారు. రాష్ట్రాల్లో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రభుత్వం ఒక వర్గానికి వత్తాసు పలుకుతున్నాయన్నారు. బాన్సువాడ, కామారెడ్డిలలో అమాయక హిందువులపై పోలీసులు అక్రమ కే సులు బనాయించటానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అల్లర్లకు సం బంధం లేని అమాయక హిందువులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తక్ష ణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బాన్సువాడలో జరిగిన సంఘటనకు బాధ్యులైన సంఘ వ్యతిరేక శక్తులను తక్ష ణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ చేశారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్, కార్యదర్శి రవి, చింతకుంట సాయిరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కోకన్వీనర్ అంతోని రెడ్డి, హైకోర్టు న్యాయవాదులు ఎంవి రామారావు, సీనియర్ న్యాయవాది మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు,అన్నింటిలో భరోసా

### ఎస్‌పి పరితోష్ పంకజ్

ప్రజాపక్షం/ సంగారెడ్డి : మంత్రి క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా ఈ రోజు తేది 28.02.20 26 సంగారెడ్డి పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ నిర్వహించారు.అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న గ్రేవ్,నాన్ గ్రేవ్, మీస్సింగ్ ఎబ్‌బి డబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్ వేగం పెంచాలని ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసే భాదితులకు అండగా నిలవాలని అందికారులకు సూచించారు. లాంగ్ పెండిగ్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని ఇన్వెస్టిగేషన్లో సందేహాలు ఉంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవాలను వినియోగించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చిన పిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి వారిలో భరోసా కల్పించాలన్నారు. ప్రతి పిర్యాదును ఆన్లైన్‌లో నమోదు చేయిలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు ను త్వరి త గతిన పూర్తిసి భాదితులకు అండగా నిలవాలని, లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ఎబ్ బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, రోడ్డు ప్రమాదాలు ,ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని , విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి రివార్డ్‌లు అందజేస్తామని మంత్రి క్రైమ్ మీటింగ్‌లో అధికారులకు జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ పలు సూచనలు చేశారు. ఎస్ హెచ్ ఓ లు తమ ఏరియాలో గల ప్రతి గ్రామాన్ని సందర్శించి ఆయా ప్రాంతాలలో గల సమస్యలను తెలుసుకోవాలని, రౌడీ షీటర్స్ సస్పెక్ట్ ల కదిలికపై నిఘా ఉంచి తరుచూ చెక్ చేయాలన్నారు. బ్లాకోల్స్డ ,నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలోన్ డివైస్ ,లను వినియోగిస్తు వివిధ కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాలో పరిశ్రమలు ,దాబాలు పెట్రోల్ పంప్స్ తదితర ముఖ్యమైన ప్రాంతాలలో కమ్యూనిటీ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగాసంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలని యస్‌హెచ్‌ఓలకు సూచించారు. యస్. హెచ్. ఓ వాహనాలను తనిఖీ చేస్తూ వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. అదనపు ఎస్‌పి సిహెచ్ రఘునందన్‌రావు ,డిఎస్‌పిలు, సత్త య్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, సైదా సురేందర్ రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి న రేందర్ ,ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సదా నాగరాజు, ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్స్పెక్టర్స్, సభ్ఇన్స్‌పెక్టర్స్, పాల్గొన్నారు.




## మాజీ మున్సిపల్ చైర్మన్ అరెస్టు, బెయిల్

### కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలపై హెచ్ఆర్‌సిలో ఫిర్యాదు చేస్తాం

### మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి ధ్వజం

ప్రజాపక్షం మెదక్ : బిఆర్ఎస్ పార్టీకి చెందిన మెదక మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్ గౌడ్ ను శనివారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో పట్టణంలోని పిట్లంబేస్ కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఇంటిపై దాడికి యత్నించారన్న ఫిర్యాదుతో పట్టణ పోలీసులు మల్లిఖార్జున్ గౌడ్ ను అరెస్ట్ చేశారు. ఆయనపై కేసు నమోదు చేసిన పోలీసులు అదుపులోకి తీసుకొని మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలీస్ స్టేషన్ కు చేరుకోగా ఎవరిని పోలీసులు లోపలికి అనుమతించ లేదు. అనంతరం మల్లిఖార్జున్ గౌడ్ ను జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. మల్లిఖార్జున్ గౌడ్ కేసును సీనియర్ న్యాయవాధులు యం. దేవేందర్ రెడ్డి, జీవన్ రావు, మాయా వెంకటేశం, ప్రశాంత్, చిరంజీవి, సుధాకర్, ఇప్ప సాయి కుమార్, మల్లూరి రాకేశ్ లు మల్లిఖార్జున్ గౌడ్ తరుపున న్యాయస్థానం కు వాదనలు వినిపించడం జరిగింది. అనంతరం మల్లిఖార్జున్ గౌడ్ కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన విడుదలపై బిఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ కక్ష్యపూరిత రాజకీయాలు చేస్తూ, బిఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతుందని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్ గౌడ్ అక్రమ అరెస్టును పద్మా దేవేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మెదక్ లో స్థానిక ఎమ్మెల్యే కక్ష్యపూరిత రాజకీయాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులను అరెస్టులు, కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామంలో ఇలాంటి చర్యలు సరికావని హెచ్చరించారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లాగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు పెడుతున్న అక్రమ కేసులపై త్వరలో హెచ్ఆర్‌సి లో పిర్యాదు చేస్తామని తెలిపారు.





### అక్రమ కేసులు దారుణం.. మాజీ మంత్రి హరీశ్ రావు

మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్‌పై అక్రమ కేసులు దారుణమని మాజీ మంత్రి హరీశ్ రావు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ ఉద్దేశ పూర్వకంగా మరో కొత్త కేసు లో ఇరికించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ రోజుకో కేసుతో బిఆర్ఎస్ కార్యకర్తలను ఇ బ్బంది పెడుతుందని విమర్శించారు. పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ చట్టవిరుద్ధం గా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు మారాలని హెచ్చరించారు.

## పట్టణాభివృద్ధికి జిల్లా సహకారం

### మున్సిపల్ కమిషనర్ రాజలింగు

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి పట్టణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచేందుకు జిల్లా పరిపాలనతో సమన్వయం అత్యంత అవసరమని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి. చంద్రయ్యను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య స్పందిస్తూ. పట్టణాభివృద్ధి పనులను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుమతి, రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణప్రసాద్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వినీత్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సాయి నిఖిల్, సిస్టమ్ మేనేజర్ ఎ. శిరీష్ పాల్గొన్నారు.





## విద్యార్థుల ప్రతిభను అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/ముత్తారం :** డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ (టి వర్క్స్) నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శనివారం మంథనిలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్‌పో '2026 లో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు తక్కువ వ్యయంతో తయారు చేసిన వినూత్న నీటి సీసా (బడ్జెట్ ఫ్రెండ్లీ వాటర్ బాటిల్) నమూనాను ప్రదర్శించారు. ఈ నీటి సీసా తాగునీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఉన్న నీటిని శుద్ధి చేసి తాగునీటిగా మార్చే విధంగా రూపొందించబడింది. విద్యార్థుల ఈ ఆవిష్కరణకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, టి వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ళ, ఎంఈఓ హరి ప్రసాద్ ప్రశంసలు తెలియజేశారు. సందర్శకులు, నిర్వాహకుల నుండి కూడా ప్రాజెక్ట్‌కు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా.కేసరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తక్కువ వ్యయంతో కూడిన ఆవిష్కరణలను డిజైన్ చేయడానికి టి వర్క్స్ ఎంతో తోడ్పడింది.

## ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని తరగతుల విద్యార్థులు తాము తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. 6వ తరగతి చదుతున్న వర్ణిక రావుల, శ్రీరామోజు ఆద్యశ్రీ, కవ్వల హన్విత, 8వ తరగతి చదువుతున్న అభయ్ శ్రీకర్ రావుల, సాన్విత్ దూస, ఓరుగంటి శ్రీరామ్, నితిశ్ వంగల, దేశబోయిన హయగ్రీవ్ తదితర విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు.

## మోత్కురావుపేటలో పెద్దపులి సంచారం

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని కోడిమ్యాల ఫారెస్టు రేంజ్ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత ఆదివారం గ్రామ శివారులో పులి చెరువు వద్ద నీరు తాగిన అనవాళ్లను అధికారులు గుర్తించారు. ఇదే ప్రాంతంలో మళ్లీ వారం రోజుల తర్వాత పులి సంచరించడం ప్రజలను భయాందోళనకు గురి చేసింది. శనివారం తెల్లవారు జామున గ్రామ శివారులో ఉన్న ఆవుల మందపై పులి దాడి చేసి మూడు ఆవులను గాయపరిచింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి అటవీ శాఖ అధికారులు చేరుకుని దాడి చేసింది పెద్దపులే అని నిర్ధారించారు. పులి కదలికల నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను ఒంటరిగా అడవి బయట మేతకు తీసుకువెళ్లవద్దని, రాత్రి వేళల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

## నల్ల రిబ్బన్లతో ఐఎంఎ, 'తానా' వైద్యుల నిరసన



పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు వైద్యుల వినతి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** వైద్య వృత్తిపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్‌లోని ఐఎంఏ హాలులో శనివారం వైద్యులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాదులోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీనియర్ పీడియాట్రీషియన్‌పై జరిగిన దాడిని హేయమైన చర్యగా అభివర్ణిస్తూ బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బండ్లగూడ సన్‌సిటీలోని క్రియాన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆరు నెలల శిశువు మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఆ ఆసుపత్రి వైద్యుడిపై వందలాదిమంది దాడి చేయడం తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడేందుకు వెళ్లిన వైద్యుడిపై దాడి చేయడం, దుర్భాషలాడడం రాష్ట్రవ్యాప్తంగా వైద్య వర్గాల్లో ఆగ్రహాన్ని రేపిందన్నారు. తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కటారి మాట్లాడుతూ చిన్న హాస్పిటళ్లపై దాడులు జరగడం ప్రజలకు మేలు చేయదన్నారు. ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ మాట్లాడుతూ శిశువు మృతి చెందిన నేపథ్యంలో ఒక వైద్యుడిపై వందలాది మంది దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరీంనగర్ సిపి గౌస్ ఆలంను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎనుముల నరేష్, ఐఎంఏ జిల్లా కార్యదర్శి డా.ఎన్.మహేష్‌బాబు, కోశాధికారి డా.నీలిమ కాసం, డా.విజయేంద్ర రెడ్డి, డా.బిఎన్‌రావు డా.సురేష్ కుమార్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా.రాజకుమార్, ఎఫ్‌ఓజిఎస్ఐ కార్యదర్శి డా.శ్రావంతి, కోశాధికారి డా.స్వప్న, కెజిఏపి జిల్లా అధ్యక్షుడు డా.రామ్ మోహన్, కార్యదర్శి డా.రఘునాథ్, డా.శ్రీలత రెడ్డి, డా.మోహన్‌రెడ్డి, డా.ఝాన్సీ, డా.వేణుగోపాల్, డా.శివకుమార్, డా.రవికాంత్, డా.జె.సురేష్ కుమార్, డా.జ్యోతి, డా.తత్విక, డా.శ్రీలక్ష్మి , డా.శ్రవణ్, డా.జాదవ్, డా.సుధీర్, డా.సునీల్‌రెడ్డి, డా.నరేందర్, డా.ఐ.రవీందర్, డా.విజయలక్ష్మి , డా.విద్య, డా.నవీన్ తదితరులున్నారు.


## సర్వేతో రైతుల సమస్యకు పరిష్కారం




**ప్రజాపక్షం/మల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి భూ సర్వేలో భాగంగా మండలంలో నడి కూడా గ్రామంలో భూ రి సర్వే పై రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం చేపట్టారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో చేపట్టిన భూ సర్వే అవగాహన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత పాల్గొని రైతులకు సర్వే చేపట్టడం ద్వారా జరిగే ప్రయోజనాలను వివరించి అవగాహన కల్పించారు. మల్లాపూర్ మండలంలో ఐదు గ్రామాలలో భూ రీ సర్వే చేపట్టామని అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఈ సర్వే తో రైతుల్లో నెలకొన్న వివాదాలు తొలగిపోతాయని, ముందుగా అధికారులు గ్రామ సరిహద్దులు నిర్వహించిన తర్వాతే రైతుల భూములపై సర్వే నిర్వహిస్తారని రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా సహకరించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూర్పు సమత రాజన్న, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి కిసాన్ ప్రసాద్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ దేవరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆవుల రాజేష్, పంచాయతీ కార్యదర్శి సంతోషిని, మండల సర్వేయర్ కుమారస్వామి,సర్వే అధికారులు గ్రామ రైతులు ప్రజాప్రతినిధులు,తదితరులు ఉన్నారు.

# కన్నులపండువగా నృసింహుడి కల్యాణం

వేలాదిగా హాజరైన భక్తులు







**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన వేడుక అయిన ముప్పురు స్వామివారల కళ్యాణ మహోత్సవం శనివారం వేలాది మంది భక్తజనం సమక్షంలో వైభవంగా కన్నుల పండువగా జరిగింది. శ్రీ మఠం స్థలంలోని పుష్పవేదికపై శ్రీ యోగానంద, శ్రీ ఉగ్రనరసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామివారల కళ్యాణ మహోత్సవాన్ని గోధూళి సుమూహూర్తంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, సంప్రదాయ పద్ధతిలో భక్తుల కరతాళధ్వనుల మధ్య ఘనంగా నిర్వహించారు. యాజ్ఞికాచార్యులు కందాళై పురుషోత్తమ చార్యులు వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, అర్చకులు కళ్యాణోత్సవంలో భాగంగా గోత్ర ప్రవర సువర్ణ యాజ్ఞపవీతధారణ, మహాసంకల్ప మాంగళ్య సూత్రధారణ, కన్యాదానం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రముఖ పౌరాణిక ప్రవచన కర్త బాచంపెల్లి సంతోష్ కుమార్ శాస్త్రి నారసింహతత్వం వివరించారు. అంతకు ముందు ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ నేతృత్వంలోని అర్చకులు స్వామి వారల కళ్యాణమూర్తులను మంగళవాయిద్యాల మధ్య పుష్పాలంకరణ చేసిన శ్రీమఠం కళ్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. లోక కల్యాణార్థం ఏటా నిర్వహించే ధర్మపురీశుల వివాహ మహోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మహారాష్ట్రలోని నాందేడ్ నుండి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి ధర్మపురి ఎమ్మెల్యే ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామి వారల కల్యాణానికి పురపాలక సంఘం పక్షాన చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , కమిషనర్ ఎం.శ్రీనివాసరావు సాంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. మండలంలోని రాజారాం, గొల్లపల్లి మండలం చిల్వకోడూర్, వెంగళాపూర్ గ్రామాలనుండి భక్తులు స్వామివారికి తలంబ్రాలను తీసుకువచ్చారు. సాయంత్రం మూల విరాట్టులకు తిరుకళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, కార్యనిర్వాహణధికారి సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డిఎస్పీ రఘు చందర్, ధర్మపురి సిఐ రాంనర్సింహ రెడ్డి, ఎస్సైలు గురుక మహేష్, మిర్యాల రవీందర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉదయ్ కుమార్, ఏలూరి కిరణ్ కుమార్, సతీష్, ఏఎస్ఐలు ప్రత్యేక సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులే కుండా భారీ బందోబస్తు నిర్వహించారు. జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , వైస్ చైర్మన్ ఐ.రామయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ సంగనబట్ల దినేష్, పాల్గొన్నారు.

## 'అడస్ట్రా' ప్లే స్కూల్‌లో ఘనంగా సైన్స్‌డే సంబరాలు



**ప్రజాపక్షం/చొప్పదండి:** పట్టణంలోని అడస్ట్రా ప్లే స్కూల్‌లో శనివారం సివి రామన్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా సైన్స్‌డే సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ పెరమాండ్ల మానస గంగయ్యగౌడ్‌లు పాల్గొని విద్యార్థులు తయారు చేసిన రకరకాల నమూనాలను చూసి వాటి పనితీరును అడిగి తెలుసుకుని అభినందించారు. పాఠశాల చైర్మన్ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు సివి రామన్ జీవిత చరిత్రను తెలియజేస్తూ ఇలాంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకుని సైన్స్‌లో కొత్త కొత్త ఆవిష్కరణలు చేసి దేశానికి సేవ చేయాలని విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో 13 రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీ యోగానంద, శ్రీ ఉగ్ర లక్ష్మి నారసింహ, శ్రీ వెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన వేడుకైన మువ్వురు స్వాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వం పక్షాన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం 11.30 గంటలకు స్థానిక ఇసుక స్థంభ వేదిక నుండి దేవస్థానం వరకు మంగళవాయిద్యాల మధ్య కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ ఇతర అధికారులు తోడురాగా పట్టువస్త్రాలను తలపై మోస్తూ ఆలయంకు చేరుకున్నారు. దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, సభ్యులు, సిబ్బంది, అర్చకులు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. ప్రధానాలయం శ్రీయోగానంద లక్ష్మి సమేత నారసింహాలయంలో పట్టువస్త్రాలు, కానుకలను అర్చకుల ద్వారా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజాదికాలలో కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్యులు, ఆస్థానవేద పండితులు బొజ్జా రమేశ శర్మ, నంబి నరసింహ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో అర్చకులు కలెక్టర్ దంపతులకు వేదాశిస్సులు అందించారు.

**ఉచిత అన్నదానం :** 13 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక రైస్ మిల్లర్లు, భక్తుల భాగస్వామ్యంతో స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి స్వయంగా భక్తులకు వడ్డించారు. తదుపరి భక్తులతో పాటు వారు భోజనం చేశారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తనవంతుగా రూ.50, 016లను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, ఈఓ సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏ.శ్రీనివాస్ నాయకులు ఎస్.దినేష్, వేముల రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు విఐపి సౌకర్యాలు

2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష సమావేశం
సమావేశానికి హాజరు కాని అధికారులపై ఆగ్రహం



**ప్రజాపక్షం/జగిత్యాల :** రానున్న గోదావరి పుష్కరాల్లో పాల్గొనే సామాన్య భక్తులకు సైతం వీఐపీ సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. 2027 గోదావరి పుష్కరాలపై శనివారం జగిత్యాల కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి అక్ష్మణ్ కుమార్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2015 గోదావరి పుష్కరాలకు జగిత్యాల జిల్లాలోని వివిధ పుష్కర ఘాట్ల వద్ద కోటి 50 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించారన్నారు. రానున్న 2027 గోదావరి పుష్కరాలకు సూమారుగా 4 కోట్లకు పైగా భక్తుల వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారన్నారు. పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనుల్లో కొన్ని మార్పులు చేసి పూర్తి ప్రణాళికలను అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచల వరకు నిధులు కేటాయిస్తామని ఇది వరకే సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నార న్నారు. జిల్లాలో రూ.940 కోట్లతో అధికారులు అభివృద్ధి పనులు చేపట్టేలా అంచనాలు తయారు చేశారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పుష్కరాలకు రానున్నారని పారిశుద్ధ్య పనులతో పాటు పార్కింగ్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాలకు రానున్న భక్తులకు ప్రభుత్వం తరపున అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గోదావరి నది వెంట ఉన్న ఆలయాలను ఆగమశాస్త్ర ప్రకారం అభివృద్ధి చేయాలన్నారు. గత పుష్కరాల కంటే భిన్నంగా అధికారులు అభివృద్ధి పనులు చేపట్టేలా చూడాలన్నారు. కనురెప్పపాటు కరెంటు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పుష్కరాల సమీక్ష సమావేశాని హాజరు కాని అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గొదావరి పుష్కరాలకు నిధుల కేటాయింపు విషయంలో సీఎంను కలిసిన 10 రోజుల్లో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని మంత్రి వివరించారు. సమీక్ష సమావేశంలో జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, సంజయ్, కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ రాజ గౌడ్ ఉన్నారు.



## విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సైన్స్ జీవితంలో ఒక భాగమని, పరిశీలన ద్వారా పరికల్పనల ద్వారా విద్యార్థులు కూడా శాస్త్రీయ నైపుణ్యాలను అలవర్చుకోవాలని, విద్యార్థులలో వైజ్ఞానికతను, ప్రతిభను వెలికి తీసే వేదికనే ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు అని ధూల్మిట్ట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.కరుణాకర్ రెడ్డి అన్నారు. భారతదేశ మొట్టమొదటి నోబెల్ పురస్కార గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలంలోని హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్స్ బిట్స్ ప్రదర్శనలను విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పావని లక్ష్మి, ఉపాధ్యాయులు ఆశక్తిగా తిలకిచారు. అనంతరం వారు మాట్లాడుతూ, సైన్స్ అనేది ఒక తరగతి గదికే పరిమితం కాకుండా, నిజ జీవితానికి దారి చూపేది అని, ఈ వైజ్ఞానిక ప్రదర్శన విద్యర్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మంచి వేదిక అని అన్నారు. ఈ సందర్బంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పావని లక్ష్మి ఈ సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థిని, విద్యార్థులకు ప్యాడ్, పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ డైరెక్టర్ కొండూరి ఉమాదేవి, విద్యార్థుల తల్లి దండ్రులు, మాజీ స్కూల్ చైర్మన్ నాచగోని కిష్టయ్య గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# యువత భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి


నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని, యువత భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వికసిత భారత్ 2047 కార్యక్రమ నేపథ్యంలో శనివారం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ప్రిన్సిపల్ ప్రొ.రామకృష్ణ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అంశం ప్రసంగం పై రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుండి దాదాపు 200పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొని, వికసిత్ భారత్ కార్యక్రమం లో దేశ ఆర్థిక, సామాజిక, సాంకేతిక తదితర అంశాల పై విద్యార్థులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ దేశ ప్రగతి కోసం ప్రసంగించిన పలువురు విద్యార్థులను అభినందించారు.అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, వారి అధ్యాపక బృందం శాలువాలతో సత్కరించి... పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విద్యార్థుల ప్రసంగం అభినంధనీయమన్నారు. వికసిత భారత్ మిషన్‌లో యువత ముఖ్య పాత్ర పోషించి, నరేంద్ర మోడీ సంకల్పం నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా యూత్ ఆఫీసర్ వెంకట్ రాంబాబు, కళాశాల వివిధ విభాగాల ప్రొఫేసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి

హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్



**ప్రజాపక్షం/సిద్దిపేట :** పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తిక్ సూచించారు. శనివారం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ సిద్దిపేట జిల్లా కోర్టుకు రాగా, జిల్లా జడ్జి సాయిరమాదేవి, ఇతర న్యాయమూర్తులు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన జ్యూడిషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో పాల్గొని జిల్లాలో వివిధ కేసుల డిస్పోజల్, పెండింగ్ కేసుల న్యాయమూర్తులు, న్యాయ సిబ్బందిచే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వరం న్యాయం అందించేందుకు న్యాయశాఖ పనిచేస్తుందన్నారు. జిల్లాలో వివిధ కేసుల్లో వచ్చే కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి సాయి రమాదేవి, ఆదనపు జిల్లా జడ్జి జయప్రసాద్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సంతోష్ కుమార్, జిల్లా న్యాయమూర్తులు ఏఓ ఆరీఫ్ ఎక్బాల్, రవీందర్, మిగత సిబ్బంది పోలీసు అధికారులు, న్యాయవాదులు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్‌రెడ్డి, రమేశ్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఘనంగా సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం కార్పొరేషన్ పరిధి 41వ డివిజన్లో రామగుండం ప్రాజెక్టు సిడిపిఓ అలేఖ్య, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆధ్వర్యంలో అంగన్‌వాడి సెంటర్లో సీమంతం, అన్నప్రాసన ,అక్షరాభ్యాసం, ఇసిసిఇ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ అలేఖ్య, సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే గర్భంతో ఉన్న వారు అంగన్‌వాడీ సెంటర్‌కి వచ్చి సెంటర్లో భోజనం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎక్కువగా అంగన్‌వాడీ సెంటర్‌కి రావడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన ఏ అవసరమైన నా దృష్టికి తీసుకువస్తే కౌన్సిల్లో మాట్లాడి మంజూరు చేయించే బాధ్యత నాదేనని సూర్య తెలిపారు. ఒక మంచి వాతావరణంలో శ్రీమంతం అన్నప్రాసన అక్షరాభ్యాసం జరగడం చాలా సంతోషంగా ఉందని మున్ముందు మరిన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జమున, శిరీష, ప్రతం ఎన్జీవో నుండి లిటిల్, మార్కపురి ప్రసన్న లక్ష్మి , అంగన్వాడి టీచర్లు ఎస్.జయసుధ, కే.అరుణ, కే.భాగ్యలక్ష్మి , కే.మల్లేశ్వరి, ఎస్.స్వరూప, తల్లులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


## ఆల్ఫోర్స్‌లో ఘనంగా సైన్స్‌డే వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో, కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో ఆల్ఫోర్స్ ఇ టెక్నోలో, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో, వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్, అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి హాజరై సర్ సివి రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సేవలను స్మరించుకున్నారు. వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడమే కాకుండా దానిలో పట్టు సాధించే విధంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## తొలి వరల్డ్‌కప్ హీరోకు ప్రత్యేక గౌరవం

**వాంఖడే మైదానంలోని లెవల్ 1 స్టాండ్ రవి శాస్త్రి పేరు**

భారత దిగ్గజం రవి శాస్త్రికి ప్రత్యేక గౌరవం లభించనుంది. తొలి వరల్డ్‌కప్ హీరో రవి శాస్త్రి గౌరవార్థం పెవిలియన్ ఏర్పాటు చేయాలని ముంబై క్రికెట్ సంఘం సంకల్పించింది. ప్రస్తుతం పొట్టి కప్‌లో కామెంటేటర్‌గా అలరిస్తున్న రవి శాస్త్రి పేరును వాంఖడే మైదానంలోని లెవల్ 1 స్టాండ్‌కు ఖరారు చేశామని ఎంసిఎ ఒక ప్రకటనలో తెలిపింది. క్రికెట్ లెజెండ్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల అభిమానులు, మాజీ ఆటగాళ్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమదైన ఆటతో భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఆటగాళ్లు చాలా మంది. సుదీర్ఘ కాలం సేవలందించి.. క్రికెట్ వ్యాప్తికి తోడ్పడిన ఈ దిగ్గజాలను ఆయా రాష్ట్ర క్రికెట్ సంఘాలు గొప్పగా గౌరవిస్తుంటాయి. ఈ క్రమంలోనే వారి పేరు మైదానంలో నిలిచిపోయేలా స్టాండ్స్ ఏర్పాటు చేస్తుంటాయి. ముంబై క్రికెట్



సంఘం కూడా ఇప్పుడు లెజెండ్ రవి శాస్త్రి పేరుతో పెవిలియన్ ఏర్పాటు చేయనుంది. ఈ విషయాన్ని ఎంసిఎ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించాడు. 'దిగ్గజ ఆటగాళ్లు వేసిన పునాదులపైనే ముంబై క్రికెట్ నిర్మితమైంది. దేశానికి, ముంబై పట్టణానికి గౌరవం, గుర్తింపు తీసుకొచ్చిన మేటి క్రికెటర్లను గౌరవించడం మా బాధ్యత. వాంఖడే మైదానంలో ప్రెస్ స్టాండ్‌కు పక్కనే ఉండే లెవల్ 1 స్టాండ్‌కు రవి శాస్త్రి పేరు పెడుతున్నాం. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని అజింక్యా నాయక్ పేర్కొన్నాడు. శాస్త్రి పేరును స్టాండ్స్‌కు ఖరారు చేయగా.. వాంఖడేలోని మూడు గేట్లకు వెటరన్స్ దిలీప్ సర్దేశాయ్, ఏక్‌నాథ్ సోల్కర్, డయాని ఎడుల్జి పేర్లు పెడుతున్నట్టు ఎంసిఎ తెలిపింది.




## చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్..

**తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం**

**హుబ్లీ:** జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. శనివారం అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు.. కర్నాటక బౌలర్లను ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్నింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది

## ఉతికేస్తున్న పాక్ ఓపెనర్లు..

**తొలిసారి పవర్ ప్లేలో భారీ స్కోర్**

సెమీస్ బెర్తుపై కన్నేసిన పాకిస్థాన్‌కు ఓపెనర్లు శుభారంభిచ్చారు. భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌లో ఓపెనర్ ఫర్హాన్(40 నాటౌట్) చెలరేగుతున్నాడు. చమీర వేసిన తొలి ఓవర్లోనే బౌండరీ రాబట్టాడు. మధుషనక ఓవర్లో రెచ్చిపోయిన అతడు.. 4, 6తో రెచ్చిపోయాడు. మరో ఎండ్‌లో ఫఖర్ జమాన్(23 నాటౌట్) సైతం దంచేస్తున్నాడు. శ్రీలంక కెప్టెన్ దసున్ శనకు చుక్కలు చూపిస్తూ.. వరుసగా రెండు ఫోర్లు బాదాడు. ఫర్హాన్ బౌండరీ కొట్టగా ఆ ఓవర్లో 13 రన్స్ పిండుకున్నారు. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలో పాక్ వికెట్ కోల్పోకుండా 64 రన్స్ చేసింది.






## అస్థిరత మధ్య మార్కెట్లు


భారత్‌లోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా ఈ వారం మార్కెట్లు తీవ్ర అస్థిరత మధ్య కొనసాగాయి. ఆరంభంలో మార్కెట్లు ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ, చివరికి తీవ్ర అమ్మకాల ఒత్తిడితో సూచీలు పడిపోయాయి. సోమవారం రోజున భారత మార్కెట్లు బలంగా ప్రారంభమయ్యాయి. బ్యాంకింగ్, వినియోగ, ఆటో రంగాల్లో కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు పెరుగుదల చూపించాయి. దేశీయ ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, పెట్టుబడిదారుల విశ్వాసం కారణంగా మార్కెట్‌లో సానుకూల వాతావరణం



కనిపించింది. అయితే మధ్యవారం నుంచి పరిస్థితి మారింది. గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి, ముఖ్యంగా అమెరికా వాణిజ్య విధానాలపై సందేహాలు, మధ్యప్రాచ్య భౌగోళిక ఉద్రిక్తతలు పెట్టుబడిదారుల్లో జాగ్రత్త భావనను పెంచాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్లలో అమ్మకాలు ప్రారంభించడంతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. (శుక్రవారం నాటికి ఈ ఒత్తిడి గరిష్ట స్థాయికి చేరింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్ఎంజిసి రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటి రంగం మొత్తం ఫిబ్రవరిలోనే తీవ్రంగా పడిపోవడం మార్కెట్ భావనను మరింత బలహీనపరిచింది. ఈ వారంలో మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలు మూడు. మొదటిది గ్లోబల్ అస్థిరత, అమెరికాఇరాన్ ఉద్రిక్తతలు, చమురు ధరల పెరుగుదల పెట్టుబడిదారులను రిస్క్ తగ్గించేలా చేశాయి. రెండవది విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ. మూడవది ఇటీవల మార్కెట్ గరిష్టాల తర్వాత జరిగిన లాభాల బుకింగ్. మొత్తంగా చూస్తే, ఈనెల 23–27 వారం మార్కెట్లు ఆశావాద ప్రారంభం నుంచి జాగ్రత్త దశలో కొనసాగి, భారీ అమ్మకాలు అనే చివరి దశతో ముగిశాయి. దేశీయ ఆర్థిక వృద్ధి బలంగా ఉన్నప్పటికీ, తాత్కాలికంగా గ్లోబల్ రాజకీయాలు, విదేశీ పెట్టుబడి ప్రవాహాలు, సాంకేతిక స్థాయిలే మార్కెట్ దిశను నిర్ణయించాయని ఈ వారం మార్కెట్ స్పందనలు స్పష్టం చేస్తున్నాయి.

## దాదాపు సగం రోజులు స్టాక్ మార్కెట్లు మూత!

ఈ ఏడాది మార్చి నెలలో భారత స్టాక్ మార్కెట్ ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటోంది. సాధారణ వారాంతాల వల్ల కాక, అదనంగా మూడు ప్రధాన ట్రేడింగ్ సెలవులు రావడం వల్ల బిఎస్ఇ, ఎన్ఎస్ఇ మొత్తం నెలలో 12 రోజులు మూసివుంటాయి. అంటే దాదాపు 40 శాతం ట్రేడింగ్ నిలిచిపోతుంది. ఇది యాక్టివ్ ట్రేడర్లు, డెరివేటివ్ ప్లేయర్లు, షార్ట్ టర్మ్ ఇన్వెస్టర్లకు ముందే తెలుసుకోవాల్సిన ముఖ్య సమాచారం. మార్చి నెలలో నాలుగు శనివారాలు, ఐదు ఆదివారాలు ఉంటాయి, వీటితోనే తొమ్మిది రోజుల వారపు సెలవులు వస్తాయి. అదనంగా మార్చి 3న హోలీ, మార్చి 26న రామనవమి, మార్చి



31న శ్రీమహావీర్ జయంతి పండుగల కారణంగా ట్రేడింగ్ ఉండదు. ఈ రోజుల్లో ఇక్విటీ, డెరివేటివ్స్, కరెన్సీ సెగ్మెంట్లన్నీ మూసివుంటాయి. ఉదాహరణకు హోలీ తర్వాత మార్చి 4న మాత్రమే మార్కెట్ తిరిగి ప్రారంభమవుతుంది. ఈ పరిస్థితుల్లో ట్రేడర్లు, పెట్టుబడిదారులు ముందస్తుగా ప్రణాళిక చేసుకోవడం అవసరం. షార్ట్ టర్మ్ ట్రేడింగ్, ఆప్షన్స్ ఎక్స్‌పైరీ, పోర్ట్‌ఫోలియో రీబ్యాలెన్సింగ్ వంటి పనులను సెలవుల ముందు పూర్తి చేసుకోవాలి, లేకపోతే అవకాశాలు కోల్పోబడే ప్రమాదం ఉంది. మార్చి 2026, ఒకే నెలలో 12 రోజులు మార్కెట్ మూసివేయబడడం చాలా అరుదైన పరిణామం కావడం వల్ల, పెట్టుబడిదారులు తమ నిర్ణయాలను జాగ్రత్తగా తీసుకోవడం అత్యంత అవసరం.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 81,287.19 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 82,814.71 పాయింట్లు. నష్టం 1,527.62 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 25,178.65 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,571.25 పాయింట్లు. నష్టం 392.60 పాయింట్లు).

### బంగారం ధరలో స్వల్ప తగ్గుదల



దేశంలో శని వారం బంగారం రేటు స్వల్పంగా తగ్గింది. గ్రాము బంగారం, 24 క్యారెట్ల, రూ.11 తగ్గి రూ.16,172, 22 క్యారెట్ల బంగారం రూ. 10 తగ్గి రూ.14,825గా, అదే విధంగా 18 క్యారెట్ల బంగారం రూ. 8 తగ్గి, రూ.12,133గా ఉంది. ఈ ధరల్లో జిఎస్‌టి, టిసిఎస్ లేదా జ్యువెలరుకి అనుసరించి వచ్చే తయారీ ఛార్జీలు చేరలేదు, అవి ప్రతి వ్యాపారి ప్రకారం భిన్నంగా ఉండవచ్చు. ఈ స్వల్ప తగ్గుదల ప్రధానంగా నెల చివరి లాభాల సేకరణ వల్ల వస్తుంది. ఇది సాధారణంగా నెల చివరి లాభాల సేకరణలో కనిపించే స్థితి. స్థూలంగా చూస్తే మాత్రం, ఈ వారం మొత్తం బంగారం గరిష్ట స్థాయిలో స్థిరంగా ట్రేడింగ్ కొనసాగించింది. ఇది మార్కెట్‌లో పెద్దగా మార్పు రాలేదు. మదుపరులు స్టాక్ మార్కెట్ల నుంచి అత్యంత భద్రతమైనదిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా బంగారం ధరలు తగ్గే సూచనలు కనిపించడం లేదు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించివ్వాలి

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/హనుమకొండ :** పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని, పేదలు వేసుకున్న ఇండ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతిలతో కలిసి సందర్శించారు. అనంతరం కాలనీ వాసుల సమావేశం సిపిఐ మండల కార్యదర్శి ఎన్.ఎ.స్టాలిన్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు, ఇండ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదసి కల్యాణ్, గాదె రాజన్న, గాదె మొగిలి, కట్కూరి కృష్ణ, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, గుడికందుల శివ, మామునూరి దామోదర్, మాలోత్ మంగ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ నివేదికలో అన్నీ లోపాలే

- విద్యాశాఖకు మంత్రివద్దా!
- నిరుద్యోగ రహిత భారత్‌కు డెడ్ లైన్ ఉండదా?
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ విద్యా విధానంపై తెలంగాణ విద్యా కమిషన్ రూపొందించిన సిఫార్సు నివేదక అంతా తప్పుల తడకగా లోపభూయిష్టంగా ఉందని, కమిషన్ విద్యా శాఖకు మంత్రి ఉండాలని ఎందుకు నివేదించలేదని, ప్రభుత్వం నివేదికపై విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతులతో చర్చలు జరపాలని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి నిరుద్యోగులులేని, బాల కార్మికులు లేని, నిరక్షరాస్యులు లేని భారతదేశంగా తీర్చిదిద్దాడానికి డెడ్‌లైన్ ఎందుకు ఉండదని, బిజెపి విద్యార్థుల, యువకుల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణలో విద్యాసంస్థలను ఏర్పాటు చేయలేని బిజెపి తెలంగాణ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మణికంఠ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా కమిషన్ తెలంగాణ విద్యా విధానం రూపొందించుటకు నివేదికపై లక్షలాది మంది తల్లిదండ్రులు అభిప్రాయాలు సేకరించి 45 పేజీల నివేదిక రూపొందించామని చెబుతున్న కమిషన్ ఒక్క విద్యార్థి సంఘం అభిప్రాయం తీసుకోకుండా నివేదిక ఎలా రూపొందించారన్నారు. తెలంగాణలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకుండా విద్యా రంగ అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందని నివేదిక ఇచ్చారని, కొన్ని సిఫార్సులు బాగున్నాయని అందులో విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడం మంచిగానే ఉన్నా, మిగతా సిఫార్సులు కొన్ని విద్యార్థులకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా ఉన్నాయని, కొన్ని విద్యా విధానాల రద్దు ద్వారా ప్రైవేట్‌కు లాభం జరిగే అవకాశం ఉందని, కొంతమేర ప్రభుత్వ విద్యా సంస్థలు తగ్గిపోయే అవకాశం ఉందని, విద్యా కమిషన్ సిఫార్సులపై లోతైన చర్చలు విద్యార్థి సంఘాలు, విద్యావంతులు, మేధావులు ఉపాధ్యాయ సంఘాల వారితో ప్రభుత్వం, విద్యా కమిషన్ చర్చించి విద్యార్థులకు ఉపయోగపడే సమగ్రమైన విద్యా విధానం రూపొందించాలని, ప్రభుత్వం కేవలం విద్యా కమిషన్ వారు ఇచ్చిన రిపోర్టు ఆమోదించి అమలు చేస్తామంటే ఒప్పుకునేది లేదని ప్రభుత్వంపై తప్పకుండా ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరం ముగింపుకు చేరుకున్న ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకపోవడం మూలంగా రానున్న రోజుల్లో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మొత్తం ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పల శాంతి కుమార్, జిల్లా నాయకులు బోయినీ విష్ణు, అడప సాయి కృష్ణ, వినయ్ రెడ్డి, అరవింద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జెండాను ఎగరేసిన యోధుడు కురుమిద్ద లింగయ్య

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**
**సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి**



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని కోతులాపురం గ్రామంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు అమరజీవి కురుమిద్ద లింగయ్య 3వ వర్ధంతి సభ పోరాట స్ఫూర్తిని తలపించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎ మ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగయ్య లాంటి నాయకులు చాలా అరుదుగా పుడతారని, ఆయన జీవితం మొత్తం పేదలు కార్మికులు రైతుల కోసం అంకితం చేశారని అన్యాయానికి ఎదురు నిలబడి చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడు లింగయ్య అని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీ పడని నాయకత్వమే లింగయ్య ప్రత్యేకత అని పేర్కొన్నారు. సిపిఐ సిద్ధాంతాల కోసం అనేక కష్టాలు భరించి కట్టుబడి ఉద్యమాల్లో ముందుండి పోరాటం నడిపిన నాయకుడని అన్నారు. నేటి రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్న వేళ లింగయ్య చూపిన మార్గం అందరికీ ఆదర్శమని లింగయ్య ఆశయాలను కొనసాగించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, సురవి నరసింహ, స్థానిక సర్పంచ్లు కురుమిద్దె వినోద, ముత్యాల అంజయ్య,మాజీ సర్పంచ్ పొట్ట సత్యం, సిపిఐ ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రజా సంఘాల నాయకులు లింగయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిరక్షణ చట్టం చేయాలి

**బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు**

**ప్రజాపక్షం/ వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో బిసిలపై, బడుగు బలహీన వర్గాలపై అగ్రకుల అహంకారుల ఆగడాలు అంతులేకుండా పెరిగి పోతున్నందున వెంటనే బిసిరక్షణ చట్టం చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక రంగాలలో సమాజం ఎంతో పురోగమిస్తున్నప్పటికీ నేటికీ మూఢనమ్మకాలు, కుల వివక్షత విలయ తాండవమాడుతున్నదన్నారు. మంత్రాల నేపంతో దౌర్జన్యాలు దాడులు, బిసిలు, కులవృత్తిదారులు సామాజిక న్యాయం కోసం తమ హక్కుల కోసం ప్రశ్నించిన చోట కుల బహిష్కరణ పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో దైవదర్శనానికి వెళ్ళిన రజక కుటుంబానికి చెందిన వారిపై అగ్రకుల దురహంకారులు అమానుషంగా దాడి చేసి రెండు నెలల పసికందు ప్రాణాల్ని బలిగొన్న దుండగులపై చర్యకు బదులుగా పోలీసులు బాధితులపైనే ముందుగా కేసు నమోదు చేయడం, ప్రజా ఆందోళనల తరువాత కొందరిని అరెస్టు చేశారని, వారిపై హత్యా నేరం కేసులు పెట్టి అత్యంత కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం తోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. రాష్ట్రంలో బిసిలపై ఇటువంటి దాడులను అరికట్టడానికి ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం లాగానే బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని రానున్న శాసనసభ సమావేశాలలో ప్రవేశపెట్టి ఆమోదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## క్యాతనపల్లి మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ కుతంత్రాలు

**సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**



**ప్రజా పక్షం / రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ లో సిపిఐ, బిఆర్ఎస్ పార్టీల మధ్య చిచ్చుపెట్టి అడ్డదారిలో రా జకీయ లబ్ధి పొందాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ కుట్రలు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విమర్శించారు. ఎన్నికల పొత్తులో భాగంగానే సిపిఐ, బిఆర్ఎస్ కలిసి డాక్టర్ రాజా రమేష్ సతీమణి డాక్టర్ సంధ్యారాణిని చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించాయని, ప్రజలు వారిని ఆశీర్వదించి విజయాన్ని అందించారని గుర్తు చేశారు. ఈ నమ్మకాన్ని జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అసత్యాలు ప్రచారం చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని ధ్వజమెత్తారు. సిపిఐ సిద్ధాంతాలకు కట్టుబడిన పార్టీ అని, పదవుల కోసం అమ్ముడుపోయే సంస్కృతి తమకు లేదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం కూడా మున్సిపల్ పీఠం దక్కించుకోవడానికేనని ఆరోపించారు. చైర్మన్ ఎన్నిక సమయంలో మంత్రి వివేక్ వెంకటస్వామి వాష్‌రూమ్ వెళ్తున్నానని చెప్పి 30 నిమిషాల పాటు బయట గడపడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని విమర్శించారు. అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేయడానికి, ఎన్నికను వాయిదా వేయించడానికి గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. ఈ ఆరోపణలు నిజం కాకపోతే బహిరంగ చర్చకు రావాలని లేదా సిసిటివి విజువల్స్ విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా హుందాతనంతో వ్యవహరించి ఎన్నికను పారదర్శకంగా నిర్వహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, కామెర దుర్గరాజ్, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, కాదండి సాంబయ్య, ఎగుడా మొండి, మామిడి గోపి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మణెమ్మ, నాయకురాలు రోడ్డ తిరుమల, ఇరవేణి రవీందర్, బండారి రాజేష్, కె దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ‘జీ హుజూర్’ అంటే ముప్పే

అత్యుత్సాహం ప్రదర్శిస్తే తప్పని చర్యలు

అధికారుల ఆదేశాలతో..

కొట్టుకుపోతున్న నిబంధనలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలుగు రాష్ట్రాల్లో ఆయా పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు, ఇప్పుడు వారు ఎదుర్కొంటున్న సమస్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. జీ హుజూర్ అంటే ముప్పు తప్పదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఐపిఎస్, ఐఎఎస్ అధికారులపై తీసుకుంటున్న చర్యలు రుజువు చేస్తున్నాయి. అధికార పార్టీ చెప్పింది మాత్రమే చేస్తే ఇప్పటి ఉన్నతాధికారుల మాదిరి ఇబ్బందులు పడక తప్పదని ప్రస్తుత పరిస్థితులు హెచ్చరిస్తున్నాయి. ఎవరు అధికారంలో ఉంటే వారు చెప్పింది చేయడం మాత్రమే కొంత మంది అధికారులకు అలవాటుగా మారింది. ఈ అలవాటు క్రమేపి విస్తరిస్తూ ప్రభుత్వ నిబంధనలు గాలికి కొట్టుకుపోతున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ శాఖలో కొందరు వ్యవహరిస్తున్న తీరు ప్రజలను ఇబ్బందులు పెట్టడమే కాదు చాలా సందర్భాలలో ప్రభుత్వాన్ని సైతం చిక్కుల్లో పడేస్తున్నాయి. మంత్రులు ఏమి చెబుతున్నారో తెలియదు కానీ వారి అనుచరుల అడుగులకు చాలా మంది అధికారులు మడుగులు వత్తుతూ నిబంధనలను పక్కనపెట్టి వారు చెప్పింది మాత్రమే చేస్తున్నారు. ఈ అతి చాలా సందర్భాల్లో వికటించి ప్రజాప్రతినిధులకు చెటు తెచ్చిపెట్టింది. అప్పుడు బిఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అధికార పార్టీ చెప్పింది మాత్రమే చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో ఓ పోలీస్ అధికారి అధికార పార్టీ నాయకుని అనుచరునిగా పనిచేసి ఆ శాసనసభ్యుని ఓటమికి పరోక్షంగా కారణమైన్న సంగతి ఖమ్మం జిల్లా ప్రజలకు విధితమే. పోలీస్ యూనిఫాంలో ఉండి రాజకీయ నాయకుని వాహనం నడుపుతూ ప్రజల కంటపడడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పుడు కూడా ఎన్నికల సందర్భంగా ఓ పోలీస్ అధికారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేతిలో పిస్టల్ ఊపుతూ ఒక అభ్యర్థిని ఉపసంహరించుకోమని బెదిరించిన ఘటన ఆ ప్రాంత ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. అధికార పార్టీ వ్యామోహంలో పడి ప్రజాప్రతినిధులను కూడా గౌరవించని పరిస్థితి కొందరి అధికారుల్లో నెలకొన్నది. మరో అధికారి పోలింగ్ సందర్భంగా వ్యవహరించిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైరా మున్సిపాలిటీ పరిధిలో ఓ డీలర్ ఒక విపక్ష పార్టీ అభ్యర్థికి మద్దతునిస్తున్నాడని స్వయంగా తహసీల్దార్ రంగంలోకి దిగి డీలర్‌ను దాదాపు బెదిరించినంత పని చేశారు. అధికార పార్టీ వైపు పనిచేయండి అంటూ సలహా ఇస్తూనే ఇబ్బందులు తప్పకపోవచ్చునని హెచ్చరించారు. ఇవి కేవలం ఎన్నికలప్పుడు మచ్చుకు కొన్ని ఘటనలు మాత్రమే. ఇక లెక్కింపు సందర్భంలో కట్టలు మార్చిన ఘనుల సంగతి చాలా మందికి తెలియకపోవచ్చు. కొందరు పోలీస్ అధికారులు అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతూ బాధితులనే నిందితులుగా మార్చిన ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. న్యాయ, అన్యాయాలు మరిచి కనీస విచారణ లేకుండానే దోషులుగా నిర్ధారించడం జరుగుతుంది. బోనకల్ మండలంలో ఓ అధికారి అధికార పార్టీ చెప్పింది తప్ప మరోకటి చేయడం లేదని కనీసం రైతుల అభిప్రాయాలకు తావివ్వడం కానీ, సమాచారం ఇవ్వడం కానీ లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవి కేవలం మండల, డివిజన్ స్థాయి అధికారులే ఇలా చేస్తున్నారంటే పొరపాటే. ఉన్నతాధికారులు సైతం ఇదే రీతిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన వెలుగుమట్ల భూ నిర్వాసితుల విషయంలోనూ ఇదే జరిగింది. గడిచిన దశాబ్ద కాలంలో అధికార పార్టీ వద్దన్నప్పుడు తొలగింపును నిలిపివేయడం, అధికార పార్టీ ఆదేశించినప్పుడు గుడిసెలను తొలగించడం జరిగిందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇది సత్యమేనన్న విషయాన్ని కొన్ని ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి ఓ సందర్భంలో వారు నన్ను ఇక్కడకు తీసుకు వచ్చారు వారు చెప్పింది చేయడం నా ధర్మమని వ్యాఖ్యానించారంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు.

అధికార పార్టీకి కాస్త మొగ్గు చూపడం ఆది నుంచి వస్తున్నదే. కానీ అసలు నిబంధనలను పక్కనపెట్టి వీలైతే నిబంధనలను మార్చి మెప్పు కోసం కొందరు వ్యవహరిస్తున్న తీరే ఇప్పుడు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది. అధికార యంత్రాంగంపై నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ఆ కొందరి ప్రవర్తనను మార్చాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులపై, ఇటు ప్రజాప్రతినిధులపై ఉన్నది. ఇటీవల జిల్లాలో ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి ఏకంగా అధికారులతో సమీక్ష నిర్వహించారంటే అధికార యంత్రాంగం ఎంతగా జీ హుజూర్ అంటుందో తెలిసిపోతుంది. అరవింద్‌కుమార్ లాంటి ఐఏఎస్ అధికారులు నాయక్ లాంటి ఐపిఎస్ అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసైనా అధికార యంత్రాంగంలో మార్పు రావాలి లేకపోతే ఎప్పటికైనా ముప్పు తప్పకపోవచ్చు.

## పిచ్చి కుక్కదాడిలో.. 8 మందికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓ పిచ్చి కుక్క శనివారం స్వైర విహారం చేసి, 8 మందిని గాయపరిచింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ముజ్జుగూడెం లో శనివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేయటంతో ప్రజలు పరుగులు తీశారు. గ్రామంలో రహదారి వెంట ఉన్న బి.వెంకటేశ్వర్లు (65), అక్బర్ (16), బుర్రయ్య (65), అక్షయకుమార్ (19), జాహిద్ (9). ఎస్.కె.రెహాన్(12), వీరయ్య (70) లపై దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచింది. రోడ్ల వెంట వెళ్లే వారిపై పిచ్చి కుక్క దాడి చేసేందుకుదూసుకొస్తుండటంతో ప్రజలు పరుగులు తీశారు. స్థానిక యువత పిచ్చి కుక్క వెంట పడి హతమార్చటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. బాధితులను స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. కాగా వీరయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావటంతో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను అప్రమతం చేశారు. వెంటనే జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.రామారావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మిలు బాధితులను పరామర్శించారు. వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ఇంజక్షన్లు, మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ముజ్జుగూడెం గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కుక్కల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను పట్టించి సుదూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమతంగా ఉండాలని ఆదేశించారు. పంచాయతీ సర్పంచ్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యం.యర్రయ్య, వైద్యాధికారి డాక్టర్.మంగళ, సర్పంచ్‌లు శీలం వెంకటలక్ష్మి, కొలికపొంగు ఉప్పలమ్మ, బొడ్డు వసంత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సామాజిక, ఆర్థిక సర్వే

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఇండ్లు కోల్పోయిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే ముమ్మరంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. జిల్లాలో 21 మంది తహసీల్దార్లకు సంబంధిత వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన 182 మంది, ఖమ్మంజిల్లాలోని ఇతర మండలాలకు చెందిన వారు 340 మంది ఉన్నారని, రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వారు 107 మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన సర్వే జరుగుతుందని పూర్తయిన అనంతరం అర్హులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. సర్వేకు సంబంధించిన వ్యక్తులు వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## పెద్దలకు ఓ రీతి... పేదలకు మరో రీతినా?

బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

అరుణోదయ విమలక్క



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెద్దలకు ఓ రీతి, పేదలకు మరో రీతి అన్న చందంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అరుణోదయ విమలక్క ఆరోపించారు. పెద్దలు ఆక్రమిస్తే క్రమబద్ధీకరణ చేస్తున్నారని పేదలు ఆక్రమిస్తే బలవంతంగా యుద్ధాన్ని తలపించే రీతిలో పోలీసులు మోహరించి వీధుల్లోకి నెట్టివేస్తున్నారని ఆమె తెలిపారు. శనివారం భూదాన్ భూముల్లో పేదల ఇండ్లను కూల్చిన స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ రెక్కాడితే కానీ డొక్కాడని వారు తలదాచుకునేందుకు నివాసాలను ఏర్పాటు చేసుకుంటే ఆగమేఘాల మీద కూల్చాసిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. భూదాన్ భూముల్లో ఇండ్లు కట్టుకుంటే ఎందుకు కూల్చాల్సి వచ్చిందని ఆమె ప్రశ్నించారు. ఎక్కడైతే ఇండ్లను కూల్చారో అక్కడే అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో పేదల పక్షాన పోరాటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. టిటిడిసి, అంబేద్కర్ భవన్‌లో ఉన్న బాధితులను పరామర్శించి ఓదార్చారు. విమలక్క వెంట స్పర్శ భాస్కర్, అరుణోదయ మల్సూర్, కొమ్ము రమేష్, న్యాయవాది మేకల సుగుణారావు ఉన్నారు.


## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఖమ్మం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పెసర ప్రభాకర్‌రెడ్డి ని వాసవీ క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు జి. నాగయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఎండి ఖాతూన్ లను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షుడు మారేమళ్ల రామకృష్ణ, జోన్ ఛైర్మన్ వేమిశెట్టి మోహన్‌దాస్, రీజియన్ ఛైర్మన్ దాసా శ్రీనివాస్, రీజియన్ సెక్రటరీ బూర్లె పుల్లారావు, ఉపాధ్యాయులు బి. వీరబాబు, సిహెచ్ వెంకటేశ్వర్లు, పెద్దదాసు, మాధురి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వసతి గృహాలలో నిలువెత్తు నిర్లక్ష్యం

బాలిక ప్రసవంపై తీవ్ర విమర్శలు

పట్టించుకోని ఉన్నతాధికారులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వసతి గృహాల నిర్వహణపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యా బోధన, మౌలిక వసతులు అన్నింటికి మించి మెనూ అమలు ఎప్పుడో అటకెక్కినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఏమి చేస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది అన్న దానిపై అధికారులకు పట్టింపే లేదు. గతంలో అన్నపురెడ్డిపల్లిలో ఓ హాస్టల్‌లో గంజాయి సిగరెట్ల కలకలం బహిర్గతమైంది. ఇప్పుడు ఏకంగా వసతి గృహంలో ఉండే ఓ బాలిక ప్రసవించింది. అది కూడా ఇంటర్ పరీక్ష రాస్తూ, ఐదు నెలల గర్భిణీ అని పిండాన్ని పరిశీలించిన కొంత మంది వైద్యులు చెబుతున్నారు. వసతి గృహంలో ఉండే బాలిక ఐదు నెలల గర్భిణీగా ఉన్నా గుర్తించలేకపోయారంటే విద్యార్థులకు వసతి గృహ అధికారులకు మధ్య ఉన్న దూరం ఏ స్థాయిలో ఉందో అవగతం చేసుకోవచ్చు. కారేపల్లి మండలంకు చెందిన ఓ బాలిక పాల్వంచ గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఉంటూ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతుంది. దాదాపు 16 ఏళ్ల వయస్సు ఉండవచ్చు. ఫిబ్రవరి 27న ఇంటర్ పరీక్షలకు హాజరై పరీక్ష రాస్తూ మధ్యలో బాత్‌రూంకు వెళ్లినప్పుడు గర్భస్రావం జరిగింది. గర్భస్రావానికి కావాల్సిన మందులు వాడడం వల్ల ఈ పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తుంది. మృత పిండం ఎవరికి కనిపించకుండా బాత్‌రూం బేషన్‌లో దాచిపెట్టింది. సమాచారాన్ని కొంత మంది ప్రిన్సిపల్‌కు అందజేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి బాలికను ఆసుపత్రికి తరలించారు. పిండానికి శనివారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ గాడితప్పినప్పుడు హెచ్చరించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. పసి తనంలోనే వ్యామోహానికి గురై సర్వం అర్పించి గర్భం దాల్చి ఇప్పుడు పోలీస్ కేసును ఎదుర్కోవాల్సిన పరిస్థితి తీసుకు వచ్చింది. సంక్షేమ గృహాల్లో ఉండే వారికి సిబ్బందే తల్లి, తండ్రిగా అలానా పాలనా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు కారకుడైన యువకునిది ్ధవకునిది మండలం అని ప్రాథమిక సమాచారం. ఈ ప్రసవం ఒక్కసారిగా సంక్షేమ గృహాల్లో ఉండే విద్యార్థుల తల్లిదండ్రులను ఉలిక్కిపడేలా చేసింది. మా పిల్లలకు ఎంత మేరకు రక్షణ అన్న మీమాంసలో పడేలా చేసింది. సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇటువంటి పరిణమాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ వసతి గృహాలపై ఇప్పటికైనా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం విద్యార్థుల సంఖ్య, మెనూ అమలు అనే విషయాలను పేపర్లపై చూస్తూ సంతకాలు చేసే ఉన్నతాధికారులు ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు జరిపి విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉండడంతో పాటు వార్డెన్లు ఏమి చేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఘటన సంక్షేమ వసతి గృహాలకు ఓ మచ్చను తెచ్చిపెట్టింది.

# రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్

6,057 మెగావాట్ల విద్యుత్ వినియోగం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్‌పిడిసిఎల్ చరిత్రలోనే రాష్ట్రంలో శనివారం అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ (వినియోగం) 6,057 మెగావాట్లు నమోదైందని సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. గతేడాది మార్చి 11న 5,816 మెగావాట్లు గరిష్ఠ డిమాండ్ నమోదు కాగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు నమోదు కావడం గమనార్హమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ స్వీయ పర్యవేక్షణ మార్గదర్శకత్వంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించడానికి ముందస్తు ప్రణాళికలతో సత్వర చర్యలు చేపట్టినట్లు సిఎండి తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 35 కొత్త 33/11 కెవి సబ్ స్టేషన్లు చార్జ్ చేశామని, 366 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 7,600 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు, ఓవర్ లోడ్ ఉన్న 33 కెవిని ఎనిమిది ఫీడర్లుగా విభజన చేశామన్నారు. 1200 కిలో మీటర్ల మేర 33కెవి ప్రత్యామ్నాయ (అల్టానెట్) లైన్లను ఏర్పాటు చేశామన్నారు. లోవోల్టేజీని తగ్గించడానికి వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టడం జరిగిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, లైన్ల పర్యవేక్షణ, లూజ్ లైన్ కనెక్షన్లు సరిదిద్దడం, అవసరమైన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లో అత్యవసర స్పందన బృందాలను సిద్దంగా ఉంచి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను అమలు చేస్తున్నామన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ మరింతగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించేందుకు సిద్దంగా ఉన్నట్లు సిఎండి తెలిపారు.

**వినియోగదారులకు టోల్ ఫ్రీ సేవలు మరింత విస్తృతం..**

**విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి**

టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు టోల్ ఫ్రీ సేవలను మరింత విస్తరించనున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి శనివారం తెలిపారు. సంస్థ పరిధిలోని 17 సర్కిళ్ల విద్యుత్ వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంకేతికతను అనుసంధానం చేసి అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా టోల్ ఫ్రీ సేవలను మరింత పటిష్టపరిచామన్నారు. కొత్తగా వచ్చే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్ ఫ్రీ నెం 1912 ముద్రించి ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లుల్లో హెచ్చు తగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు, పేరు మార్పు, కేటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912ను సంప్రదించాలన్నారు. 1912 వినియోగదారులు ఫోన్ చేసిన వెంటనే ఫిర్యాదు నమోదు చేయబడుతుందని ఫిర్యాదుకు సంబంధించి సంబంధిత అధికారికి తక్షణమే పంపించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారునికి కూడా ఎస్ఎంఎస్ రూపంలో సమాచారాన్ని అందజేస్తారన్నారు. 1912పై వచ్చిన ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు నిరంతరం సమీక్షిస్తారని ఆయన తెలిపారు.

# గిరిజన వసతి గృహాల్లో భద్రతా లోపం

పట్టించుకోని సంక్షేమ అధికారులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలోని గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో మైనర్ విద్యార్థిని గర్భధారణ ఘటనలో అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డిఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహం దగ్గర శనివారం వారు మాట్లాడుతూ బాలిక గర్భధారణ అత్యంత సున్నితమైన అంశమన్నారు. వసతి గృహంలో ఉంటూ ఓ ప్రవేటు కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఓ మైనర్ విద్యార్థిని గర్భవతిగా మారిన విషయం నెలలుగా సంభంధిత అధికారుల దృష్టికి రాకపోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. వారు విద్యార్థులను పట్టించుకోవటం లేదని అర్థం అవుతున్నదని చెప్పారు. వసతి గృహంలో ఉంటున్న మైనర్ బాలికల ఆరోగ్యం, భద్రత, నైతిక పరిరక్షణ, సంక్షేమం పూర్తి బాధ్యత వసతి గృహ సంక్షేమ అధికారి, ఎఎన్ఎంలదేనన్నారు. వారికి ఏమైనా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య రికార్డులు, ఆరోగ్య పర్యవేక్షణ, కౌన్సిలింగ్ మరియు వైద్య చికిత్సలు సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. గతంలో సైతం ఇదే వసతి గృహంలో ఉంటూ చదువుకొంటున్న ఓ మైనర్ గిరిజన విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన సమాచారం వెలుగులోకి రావడం సంస్థాగత పర్యవేక్షణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయనే అనుమానాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు. ఆ సమయంలో సైరన చర్యలు తీసుకోకపోవటం వలన తిరిగి పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహంలో బాలికల సంరక్షణ కేవలం కాగితాలకే పరిమితమైనదని విమర్శించారు.వాస్తవాలకు వసతి గృహాలు సత్యదూరంగా ఉన్నాయని ఉన్నతాధికారులు స్పందించి అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బాధిత మైనర్ విద్యార్థినికి తక్షణ వైద్య సహాయం, మానసిక కౌన్సిలింగ్ చట్టపరమైన రక్షణ కల్పించాలన్నారు. జిల్లాలోని గిరిజన బాలికల వసతి గృహాల్లో ఆరోగ్య పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. మైనర్ బాలికల గౌరవం, భద్రత మరియు భవిష్యత్‌కు సంభంధించిన సున్నితమైన అంశాలుగా గుర్తించి ప్రభుత్వం, సంభంధిత అధికారులు తగు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వరక అజిత్‌భయ్యా, అభిమన్యు, చెరుకూరి రామ్‌చరణ్, గుండాల సృజన్‌లు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో.. నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ప్రజాపక్షం/భద్రాచలం :** రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేడు భద్రాచలం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటన అధికారికంగా ఖరారైంది. ముందుగా చర్ల మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన నూతన సర్పంచ్‌లకు చర్లలోని కెవిఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే సన్మాన కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాయంత్రం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శ్రీరామ నవమి ఏర్పాట్లపై ఆధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.

## టైలర్స్‌కు అన్ని విధాలా అండగా ఉంటాం

ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** టైలర్స్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామని, తమ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు సత్తుపల్లి శాసనసభ్యులు డా.మట్టా రాగమయి దయానంద్. శనివారం పట్టణంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా పట్టణంలో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్‌కు టైలర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసిన ఆమె టైలర్ల అభ్యున్నతికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వారి ప్రధాన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. టైలర్స్ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇండ్ల స్థలాల కేటాయింపు, గృహ నిర్మాణం, టైలర్స్ షాపులకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి డిమాండ్లను వినతిపత్రంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ నాయకులు ఇమామ్, వెంకటాచారి, అల్లాడి రాము, సతీష్, ఖమ్మంపాడు శీను, మహమూద్, డీఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వరకే రాజకీయాలు.. అందరం కలిసి పనిచేద్దాం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ సాధారణ సమావేశానికి నూతనంగా ఎన్నికైన మున్సిపాల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సభలో వైరా ఎమ్మెల్యే రాదాస్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కౌన్సిల్ సమావేశానికి వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు చెందిన కౌన్సిలర్ సభ్యులు హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో 13 అంశాలతో కూడిన వివిధ రకాల పనులకు కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సభలో ప్రస్తావించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని ఎన్నికలు ముగిసిన తర్వాత అందరం ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 20 వార్డుల్లో గెలుపొందిన అభ్యర్థులు తనకు సమానమని అందరికి ఒకేలా సమన్యాయం చేస్తానని తారతమ్య భేదం లేకుండా తన బాధ్యత నిర్వర్తిస్తానని ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు తమ వార్డు అభివృద్ధి కోసం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే బాధ్యత నాది అని ఆయన అన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు రూ.15కోట్ల నిధులు మంజూరు చేయించానని అందుకు సంబంధించిన పనులు వచ్చే నెల నుండి ప్రారంభం కాబోతున్నాయని, వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇంకా ఎన్ని నిధులైనా తేవడానికి సిద్ధంగా ఉన్నానని, అభివృద్ధి చేసే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని నూతన పాలకవర్గాన్ని, అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సమావేశంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ఉన్న ప్రధాన సమస్యలు డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సిసి రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పట్టణ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మరిన్ని నిధులు తీసుకొచ్చి మీ వార్డులను సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత నాది అని వైరా మున్సిపాలిటీ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ కమిషనర్ గురులింగం, వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాది ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వం

పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం
డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు:** మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం డైరీ, క్యాలండర్ ను పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఫోరం సభ్యులను అభినందించిన మంత్రి, గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని అదేవిధంగా జిఒ నెం.317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం జరిగింది. స్పోర్ట్స్ కోటలో తొలిగించిన పంచాయతీ కార్యదర్శులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ,రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలమైన ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని ప్రభుత్వానికి ప్రజలకు ఉద్యోగులు వారధిగా పని చేయాలని తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, జిఒ నెం.317, స్పోర్ట్స్ కోటలో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసినందుకు మంత్రి సీతక్కకు టిజిఇజెఎసి చైర్మన్ టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క కృషి వల్లే హెల్త్ కార్డులు జీవో నెం.317 డిప్యుటేషన్‌లు సాధ్యమయ్యాని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సందిల బలరాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ జనరల్ సెక్రెటరీ ఎస్ యం.హుస్సేని ముజీబ్ టీపీఎస్సీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం కార్య దర్శి వెంకటరమణ , అసోసియేట్ అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, రమాదేవి, జాయింట్ సెక్రటరీ బాల్ రాజ్, సిద్ధిపేట, నాగర్ కర్నూల్, వరంగల్, మెదక్, సంగారెడ్డి, నారాయణపేట, కామారెడ్డి అధ్యక్ష కార్యదర్శులు, మురళీ,విద్యావికాస్ రెడ్డి, గోదా రాజు, యాకుబ్, సంతోష్, చంద్రహాస్, జగన్, రాజు, బసప్ప, మహేష్, రమేష్, విద్యాధర్ గౌడ్, నరసింహ, ప్రవీణ్ తదితరులు డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గంజాయి నుండి యువతను కాపాడుకుందాం: సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** దేశ భవిష్యత్తుయిన యువత గంజాయి మత్తు బానిసలు కాకుండా గంజాయి విక్రయించే మూలాలపై దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, అక్రమ ఇసుక రవాణాపై స్టేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎవరైన ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని, అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు ద ష్టి పెట్టాలని సిపి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, శుభంనాగ్‌తో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం ఇస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి: నవీన్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** చిన్నారులకు నిత్యం పౌష్టికాహారం అందిస్తూ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సెంటర్లపైనే ఉందని 18వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ అన్నారు. శనివారం 18వ వార్డులో అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన ముంఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పిల్లల చదువుతోపాటు. వాళ్ళ మంచి చెడులు చూస్తూ. మొట్టమొదటగా అక్షరాలు తీర్చిదిద్దే విధంగా చేసేది అంగనవాడి సంస్థ వారు పిల్లల ఆహార విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటూ సమయానికి వారికి ఆహార పదార్థాలు ఇస్తూ క్రమశిక్షణ నేర్చుకునేది అంగన్వాడి టీచర్లు, ఆయాల దగ్గర నుండేనని అయన అన్నారు. చిన్నపిల్లలను అంగన్వాడి సెంటర్లకు పంపిన తర్వాత తల్లి తండ్రిల్లా చూసుకోవాల్సిన బాధ్యత అంగన్వాడి సెంటర్ లో పనిచేసే టీచర్లు ఆయాలది అని వారన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ ఆయాల పోస్టులను భర్తీ చేసి అంగన్వాడి సెంటర్లకు సొంత భవనాలు నిర్మించి పౌష్టిక హారం సరైన సమయంలో అందించాలని ప్రతి నెల జీతాలు వచ్చే విధంగా చూడాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం సంబంధించిన స్కీంలు కూడా ఐసిడిఎస్ లో పనిచేస్తున్న ఆయాలు టీచర్లతో పాటు అందరికీ అందే విధంగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, సునీత, జ్యోతి, బుజ్జి, కలమ్మ, ఆశా వర్కర్ జ్యోతి, పిల్లల తల్లిదండ్రులు, మానస, గీత, శ్రీవిద్య, గౌతమి, నవిత, దివ్య, సుహాన్ రెడ్డి, సుమన్, మంద రవి రామకృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతుల దారిని అడ్డుకున్న సత్తిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మరిపెడ:** దశాబ్దాలుగా గిరిజన రైతులు నడిచె దారిని ముసివెసిన సత్తిరెడ్డి పై చర్యలు తీసుకొవలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధకర్ రెడ్డి డిమాండ్ చెశారు.మహబుబాద్ జిల్లా మరిపెడ మండలం నీలికుర్తి గ్రామం రెవిన్యు పరిదిలోనీ భజన తండా గిరిన రైతుల దారిని శనివారం సిపిఐ భ్రుంధం పరిశీలించి,మూట్లాడుతూ దశాబ్దాలుగా రైతులు ఉపాయెగిస్తున్నా దారిని,ప్రభుత్వా సొమ్ముతొ ఫార్మేషన్ రొడ్డు వెసినదానిని,అక్రమాంగా దారికీ అడ్డంగా కంధకం తవ్వి,ప్రభుత్వ స్థలంలో కట్టిన శ్మాసన వాటికను కూల్చివెసిన పొలీసులు చొద్యం చుస్తు,రైతులు కెసులు పెట్టిన పట్టించు కొకుండా తిరిగి గిరిజన రైతుల పైనె కెసులు బనాయించ దందారుణమని అన్నారు.అధికారులు వెంటనె సర్వెచెయించి దారి చుపించాలనీ,గిరిజన మహిళలను దూషించిన సత్తిరెడ్డి పైన చర్యలు తీసుకొని ఏస్సి ఏస్టిఅట్రాసిటి కెసునమొదు చెయలని డిమాండ్ చెశరు.లెనట్లతె పెద్దె ఎత్తున ఆందొలన చెస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలొ సిసిఐ మండల కార్యదర్సి మారగాని బాలక్రిష్ణ,అబ్దుల్ రషిద్,పొలెపాక వెంకన్నా,గిరిజన రైతులు బిక్కు,వెంకటి,రవి,శాలి,కమిలి,తదితరులు పాల్గొన్నరు.

## శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి: సాంబశివరావు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల అనుసార ప్రకారము జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు నర్సంపేట పట్టణంలోని మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్( బాలికల)లో స్ఫూర్తి కార్యక్రమం, సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు భారతదేశానికి భావి భారత పౌరులు కావున వారికి తెలువవలసిన కొన్ని మెళుకువలు అందులో ప్రధానంగా శారీరక, మానసిక స్థితి, శాస్త్రీయ దృక్పథం, ఆర్థిక సమస్యలపై అవగాహన, ఆరోగ్యం, పౌష్టికాహారం అలవర్చుకున్నట్లయితే మంచి పౌరులుగా తయారవుతారన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాల, ఉపాధ్యాయులు , సిసి నాగరాజు , విద్యార్థులు పాల్గొన్నారు.

## 3న రామప్ప దేవాలయం మూసివేత

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని మార్చి మూడున ద్వారబంధనం (మూసి ఉంచడం) చేయనున్నారు. ఈ మేరకు ఆలయ కార్య నిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి మూడున చంద్రగ్రహణం ఉన్న దృశ్య ఉదయం 8 గంటలకు దేవాలయాన్ని మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ అనంతరం దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు.

## కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌కి అభినందనలు తెలిపిన టిఎన్‌జిఒస్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, హనుమకొండ జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఐఎస్ఐను వారి ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, వేణుగోపాల్, కోశాధికారి పనికిల రాజేష్, గౌరవాధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర నేతలు రాము నాయక్, సారంగపాణి, లక్ష్మీ ప్రసాద్, సర్వర్ హుస్సేన్, గోవర్ధన్, జిల్లా నేతలు సలీం, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, సాంబయ్య, అనుప్, ప్రణయ్, పృధ్వి, రమేష్, నిఖిల్ ,అశోక్, వెంకన్న, సింధు, సరస్వతి, కళ్యాణి, నాగరాణి , భాగ్యలక్ష్మి , రజిత, రమేష్ ,భరత్ తదితరులు పాల్గొని కలెక్టర్ కి అభినందనలు తెలియజేశారు.

## స్వచ్ఛమైన తాగునీరు అందించడం బాలవికాస ప్రధాన లక్ష్యం

బాలవికాస తాగు నీటి శుద్ధీకరణ పథకం కమిటీల మహాసభ
ముఖ్య అతిథిలుగా పాల్గొన్న ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు



**ప్రజాపక్షం/కాజీపేట :** "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అని మదర్ తెరిస్సా పేర్కొన్నట్లు, గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేందుకు బాలవికాస చేపడుతున్న సేవలు అభినందనీయమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.కాజీపేట లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, బాలవికాస ఆధ్వర్యంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చెరువుల పూడికతీత, రైతులకు, గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించడం వంటి కార్యక్రమాలు సమాజ అభ్యున్నతికి దోహదపడుతున్నాయని చెప్పారు. తాను పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న సమయంలో బాలవికాసతో కలిసి అనేక గ్రామాల్లో స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేందుకు కృషి చేసిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు.ప్రజల ఆరోగ్యం కాపాడటంలో పరిశుభ్రమైన త్రాగునీటి ప్రాధాన్యత ఎంతో ఉన్నదని, భవిష్యత్తు తరాలకు శుద్ధమైన నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.అలాగే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ స్వగ్రామంలో కూడా బాలవికాస ఆధ్వర్యంలో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తున్నామని పేర్కొంటూ, బాలవికాస ప్రతినిధులు మరియు కమిటీ సభ్యులను మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస ఈడీ శౌరెడ్డి, జల వికాస చైర్మన్ లుర్దు కుమార్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సురేష్ రెడ్డి, బోర్డు మెంబెర్స్, మేనేజింగ్ డైరెక్టర్, సంస్థ సభ్యులు, రవీందర్, రజాలి, మానస, కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** ధర్మసాగర్ మం డలం ముప్పారం గ్రామంలో బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల కంపౌండ్ వాల్ నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో వీవో మహిళా భవనం నిర్మాణ పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించడం, మహిళలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్మాణాల ప్రధాన లక్ష్యమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముప్పారం గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక వెంకట్, ఉప సర్పంచ్ కుమారస్వామి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు గొల్లపల్లి వెంకటరాజ్యం, గోనెల రాజన్న, మాజీ ఎంపిటిసిలు కందుకూరి ప్రసాద్ పెద్ద శ్రీనివాస్, మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా సిఎం సహాయ నిధి

రూ. 5లక్షల ఎల్ఒసి అందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** రఘునాథపల్లి మం డలం కొమ్మాల గ్రామానికి చెందిన బొల్లపల్లి చంద్ర మౌళికి 5లక్షల రూపాయల విలువల ఎల్ఓసీని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్‌లో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే గారి దృషికి రావడంతో వెంటనే స్పందించి అత్యవసర చికిత్స కోసం 5లక్షల రూపాయలను ముఖ్య మంత్రి సహాయ నిధి ఎల్ఓసీ ద్వారా అందించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల అత్యవసర చికిత్సకు ఆర్థిక భరోసా కలుగుతుందని అన్నారు.

## అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాను ఆకాంక్షిత స్థితి నుండి ఆదర్శప్రాయ స్థితికి తీసుకెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ నిర్దేశించిన విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, పశు సంవర్ధక వంటి ఐదు అంశాలలో జిల్లాలో నూరు శాతం ప్రగతి సాధించేలా కార్యాచరణ రూపొందించి కచ్చితమైన అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సూచికలో స్థిరమైన పురోగతి సాధించేందుకు శాఖల వారీగా లక్ష్యాలను నిర్ణయించి, నిరంతర సమీక్షల ద్వారా ఫలితాలను సాధించాలని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సమన్వయం పెంపొందించి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం అమలు, సమీక్ష, నివేదికల సమర్పణలో సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ శ్రీ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంపూర్ణత అభియాన్ ప్రత్యేక అధికారి కృష్ణ కదు, సీపీఓ జవహర్ విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ

జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ, యువతీ యువకులకు వై ఎస్ కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వివిధ కోర్సులలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ ఒక ప్రకటన లో తెలిపారు. సాఫ్ట్ స్కిల్ కస్టమర్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం జాబ్ గ్యారంటీ ఉంటుందని స్పష్టం చేశారు. **కావలసిన ధృవపత్రాలు:** ఆధార్, పాన్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, టాస్క్ కార్యాలయం, మొదటి అంతస్తు, ఐటి టవర్, కరీంనగర్ నందు మొదటి బాచ్ మార్చి 2 నుండి 22 వరకు జరుగనున్న ట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

స్థానిక యువతకు అవకాశం ఇవ్వకపోతే ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాం
మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/హనుమకొండ/జనగామ:** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. శనివారం కొలువుల కోసం కొట్లాట పేరిట హన్మకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే 95 శాతం స్థానికత దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దేనని,తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే కాజీపేటకు ఈ కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఇక్కడ పరిశ్రమలు రావాలని ముఖ్యంగా మన స్థానికులకు ఉపాధి ఉద్యోగాలు దొరకాలని మనం కోరుకున్నామన్నారు. కానీ ఈరోజు ఫ్యాక్టరీ వచ్చినా.. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, నాడు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం..దేవాదాయ శాఖకు చెందిన 150 ఎకరాల భూములను హైకోర్టు నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకొని మరీ కోచ్ ఫ్యాక్టరీ కోసం ఇచ్చిందని అన్నారు. కేవలం భూములు ఇవ్వడమే కాదు కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం నాడు బీఆర్ఎస్ ఎంపీలు రైల్వే మంత్రిని కలిసి, పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారని, ఆనాడు దేశంలో కోచ్ ఫ్యాక్టరీల అవసరమే లేదని మనకు సమాధానం చెప్పిన బీజేపీ ప్రభుత్వం.. ఆ తర్వాత అస్సాం, లాతూర్ మహారాష్ట్రలలో కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసి తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిందన్నారు. ఈ కార్యమానికి బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, పాల్గొన్నారు.

**భూ భారతి మోసాలపై వెంటనే సిట్ వేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి భూ హారతిగా మారింది. వెంటనే సిట్ వేసి రిజిస్ట్రేషన్లలో జరిగిన మోసాలు, అవినీతిపై విచారణ జరిపించాలని బిఆర్ఎస్ నేత, శాసనసభ ఉప నాయకుడు తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న 8.92లక్షల సాదాబైనామాలకు పాస్ బుక్‌లు ఇవ్వాలని, తెలంగాణ నీటి వాటాలపై అఫెక్స్ కమిటిలో చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఆయన జనగామలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, తాటికొండ రాజయ్యలతో కలిసి మాట్లాడారు. ధరణి పోర్టల్ బంగాళఖాతంలో కలిసి ప్రజలకు ఉపయోగ పడే భూ భారతి తీసుకొస్తామన్న ప్రభుత్వం ఎందుకు అక్రమాలు జరుగుతున్నాయో చెప్పడం లేదని మండిపడ్డారు. భూ భారతి ఎడిట్ ఆప్షన్ ఆపరేటర్‌కు ఎలా దొరికింది..దీని వెనక ఎవరున్నా..కొద్ది మందిని మాత్రమే అరెస్ట్ చేసి ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని, ఆయన లంబాడి జాతికి చేసిన సేవలు సమాజానికి మార్గదర్శకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని భారత్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287 జయంతి వేడుకలు జిల్లా సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవం సేవలాల్ మహారాజ్ అని, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్, ఆర్డీఓ హరికృష్ణ, సేవాలాల్ మహారాజ్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సంతోష్ నాయక్, ఇస్లావత్ దేవన్, అజ్మీర జంపయ్య, పోరిక సమ్మయ్య నాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, బంజారా సోదర సోదరీమ ణులు పాల్గొన్నారు.

"ప్రస్తుతం అంతర్జాతీయంగా యూఎస్-ఇజ్రాయెల్ వార్ హాట్ టాపిక్‌గా మారింది. అందులో జోర్డాన్ కూడా ఒకటి. అయితే, ఇటీవల జోర్డాన్ దేశంలో కీలక షూటింగ్ కోసం ఎన్టీఆర్-నీల్ టీమ్ అక్కడికి వెళ్లింది. భారీ షెడ్యూల్‌ని అక్కడ షూట్ చేశారు. లక్కీగా వారు అక్కడ షూటింగ్ ముగించుకుని ఇండియాకు తిరిగి వచ్చారు."

# రీల్

## 'రణబాలి' నుండి పెళ్ళి పాట రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. అంగరంగ వైభవంగా జరిగిన వారి పెళ్లి వేడుక గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతూ 'రణబాలి' మూవీ టీమ్ ఈ చిత్రంలోని బ్యూటిఫుల్ వెడ్డింగ్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో విజయ్ రణబాలిగా, రశ్మిక జయమ్మ పాత్రల్లో కనిపించనున్నారు. 'రణబాలి'లో వీరి పెళ్లి వేడుక సందర్భంగా ఓ అందమైన పాట చిత్రీకరించారు. ఈ పాటలో అప్పట్లో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో చూపించారు. పసుపు దంచడం, గోరింటాకు రుబ్బడం, ఎద్దు బండి సవారీలో నూతన వధూ వరులను తీసుకురావడం, అత్త వారింట్లో నవ వధువు శుభప్రదంగా అడుగుపెట్టడం..ఇవన్నీ ఎంతో అందంగా ఈ పాటలో రూపొందించారు.ఈ పాట ఎలా ఉందో చూస్తే 'ఎందయ్య సామీ, ఇంత కాస్తాందీ వెన్నెల, ఊపేస్తావుంది సిత్తరాల ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఝూముకి మందుపెట్టిందెవ్వరు, మాయదారి మనస్సాగక జాగరామన్నారా...' అంటూ సాగుతుంది పాట. మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్ అతుల్ బ్యూటిఫుల్ గా ఈ పాటను కంపోజ్ చేశారు. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్ అందుకుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రణబాలి' సినిమా రూపొందుతోంది.

## కొత్త కంటెంట్ రావాలి : మంచు మనోజ్

నిరంజన్, గ్రీష్మ నేత్రికా , ప్రియ జస్పర్, దీప్తి శ్రీరంగం హీరో హీరోయిన్స్ గా జి సినిమా బ్యానర్ పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్న సినిమా 'రుక్మిణి'. ఈ చిత్రానికి శ్రీమతి నేలబల్లి కుమారి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. సరికొత్త హారర్ కామెడీ కథతో దర్శకుడు సింహాచలం గుడుపూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మంచు మనోజ్ చేతుల మీదుగా 'రుక్మిణి' మూవీ టీజర్ విడుదల చేశారు. అనంతరం మంచు మనోజ్ మాట్లాడుతూ రుక్మిణి సినిమా టీజర్ అద్భుతంగా ఉంది. ఈ సినిమాతో నిరంజన్ హీరోగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమా అతనికి మంచి సక్సెస్ ఇవ్వాలి. టీజర్ చూస్తుంటే డైరెక్షన్, డీవోపీ వర్క్, మ్యూజిక్ అన్నీ చాలా బాగున్నట్లు తెలుస్తోంది. 'రుక్మిణి' సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటూ అన్నారు.ఎలాంటి కొత్త కంటెంట్ తో వచ్చే సినిమాలు ప్రేక్షకాదరణ పొందాలి అన్నారు. హీరో నిరంజన్ మాట్లాడుతూ మా 'రుక్మిణి' మూవీ టీజర్ లాంఛ్ చేసిన మనోజ్ కి చాలా థ్యాంక్స్. ఆయన మా సినిమా టీజర్ బాగుందని చెప్పడం సంతోషంగా ఉంది. నాకు ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్ చెబుతున్నా. ఒక డిఫరెంట్ హారర్ కామెడీ మూవీగా రుక్మిణి మీ అందరినీ ఆకట్టుకుంటుంది అన్నారు హీరోయిన్ గ్రీష్మ నేత్రికా మాట్లాడుతూ మేమంతా ఎంతో ప్యాషనేట్ గా చేస్తున్న చిత్రమిది. మా సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉండాలి. మీరు సపోర్ట్ చేస్తే ఇలాంటి మరిన్ని మంచి మూవీస్ చేస్తాం. మా మూవీ టీజర్ రిలీజ్ చేసి బెస్ట్ విశెస్ అందించిన మనోజ్ కి థ్యాంక్స్ అన్నారు.హీరోయిన్ ప్రియ జాస్పర్ మాట్లాడుతూ రుక్మిణి మూవీ టీజర్ లాంఛ్ చేసిన మనోజ్ కి థ్యాంక్స్ చెబుతున్నా. మీ అందరి లవ్ అండ్ సపోర్ట్ మా మూవీకి ఉండాలి. వీలైనంత త్వరలో మీ ముందుకు రుక్మిణి చిత్రంతో రాబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు విఖ్యాత్, యాక్టర్ జయంత్, మ్యూజిక్ డైరెక్టర్ సుభాష్ ఆనంద్, నిర్మాత కట్టా గంగాధర్ రావు , డైరెక్టర్ సింహాచలం గుడుపూరి పాల్గొన్నారు. ఎడిటర్ శ్రీకృష్ణ అట్లలూరి, డీవోపీ తరుణ్ రావుల, మ్యూజిక్ డైరెక్టర్ సుభాష్ ఆనంద్, సమ్పరణ శ్రీమతి నేలబల్లి కుమారి.




## ఎన్టీఆర్ చేతుల మీదుగా 'మృత్యుంజయ్' ట్రైలర్ విడుదల..

శ్రీ విష్ణు ప్రస్తుతం హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించిన 'మృత్యుంజయ్' అనే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నారు. ఈ చిత్రాన్ని లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. 'సామజవరగమన'తో బ్లాక్ బస్టర్ హిట్ పెయిర్‌గా నిలిచిన శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ ఈ సినిమాతో మరోసారి ఆడియెన్స్‌ను పలకరించనున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఎన్టీఆర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌ను రిలీజ్ చేసిన అనంతరం ఎన్టీఆర్ సోషల్ మీడియాలో పోస్ట్ వే



స్తూ.. "సన్నీ (సందీప్ గుణ్ణం) నా జీవితంలో ఓ భాగం. మా 18 సంవత్సరాల స్నేహంలో సన్నీలో నేను ఎన్నో గమనించాను. సన్నీకి తన తండ్రి గుణ్ణం గంగరాజు గారిలాగే ప్రత్యేకమైన కథలను గుర్తించే స్వభావం ఉంది. 'మృత్యుంజయ్' లాంటి ఓ యూనిక్ స్క్రిప్ట్‌ను అతను తన తొలి ప్రాజెక్ట్ నిర్మాణంలోకి అడుగు పెడుతుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు. కాళ భైరవ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరింతగా సీన్లను ఎలివేట్ చేసినట్టు అనిపిస్తోంది. థ్రిల్ ఫ్యాక్టర్ ఆద్యంతం కంటిన్యూ అయినట్టుగా కనిపిస్తోంది. 'మృత్యుంజయ్' చిత్రం మార్చి 6, 2026న థియేటర్‌లోకి రాబోతోంది. ఈ సినిమాకి సినిమాటోగ్రఫర్‌గాని విద్యా సాగర్, ఎడిటర్‌గా శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్‌గా మనీషా ఎ. దత్ పని చేశారు.

## హన్సి ప్రొడక్షన్స్‌లో కొత్త చిత్రం



లవ్ డ్రామాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటూనే ఉంటుంది. అందులోనూ ఎంటర్టైన్మెంట్ లవ్ డ్రామా జానర్స్ కు ప్రత్యేక ఆదరణ దక్కుతుంది. ప్రస్తుత ట్రెండ్ కు తగ్గట్టు హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్ పై గ్రాండ్ గా నూతన చిత్రం ప్రారంభమైంది. హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమవుతున్న మొదటి చిత్రం శనివారం ఉదయం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్ తో పాటు సన్నిహితులు హాజరైయ్యారు. శ్రీ హన్సిక పెద్దిరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కో ప్రొడ్యూసర్ గా తవిటి రాజు తలచింతల వ్యవహరిస్తున్నారు. రఘువర్ధన్ కోట్ల దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా ముహూర్తపు షాట్ కు శ్రీధర్ పెద్దిరెడ్డి క్లాప్ కొట్టారు. స్రవంతి పెద్దిరెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, శ్రీ హన్సిక పెద్దిరెడ్డి దర్శకుడికి స్క్రిప్ట్ ను అందజేశారు.ఈ చిత్రంలో జగన్ యోగి రాజు, నవ్య చిట్యాల హీరో హీరోయిన్ గా నటిస్తున్నారు. సీనియర్ నటులు దేవీ ప్రసాద్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. లక్ష్మణ్ మీసాల, పవన్ రమేష్, సునందిని, అంజు వాల్గుమన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ సందర్భంగా నిర్మాత శ్రీ హన్సిక పెద్దిరెడ్డి మాట్లాడుతూ "సినిమా అనేది నాకు ఒక కల. ఒక అభిరుచి. ఒక బాధ్యత. అదే ప్రేమతో ఇప్పుడు చిత్ర నిర్మాణంలోకి అడుగుపెడుతున్నాను. హన్సి ప్రొడక్షన్స్ బ్యాన్ప నా తొలి చిత్రాన్ని అత్యంత ప్రెస్టేజీయస్గా నిర్మిస్తున్నాం. మా మొదటి ప్రాజెక్ట్ ఒక అందమైన ఎంటర్టైన్మెంట్ లవ్ డ్రామా. ప్రేమ, భావోద్వేగాలు, వినోదం ఈ మూడు ఎలిమెంట్స్తో ప్రేక్షకులను అలరించేలా ఈ కథను ఎంపిక చేసుకున్నాం. ప్రతి యువకుడి మనసుకు దగ్గరయ్యే భావాలు, ప్రతి కుటుంబం ఆస్వాదించే వినోదం ఈ చిత్రంలో ఉంటాయి. మంచి కథకు ప్రాధాన్యం ఇస్తూ, టెక్నికల్గా ఉన్నత ప్రమాణాలతో, నాణ్యమైన నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. కొత్త ప్రతిభకు అవకాశం ఇవ్వడమే కాకుండా, అనుభవజ్ఞులైన టెక్నీషియన్ల సహకారంతో ప్రతి ఫ్రేమ్ అందంగా కనిపించేలా కృషి చేస్తున్నాం. ఈ చిత్రం నిర్మాతగా తొలి అడుగు మాత్రమే కాదు, భవిష్యత్తులో మరెన్నో మంచి, అర్థవంతమైన చిత్రాలకు పునాది అవుతుందని నమ్ముతున్నాను.ప్రేక్షకుల ఆశీస్సులు, మీడియా మిత్రుల ప్రోత్సాహం, సినీ పరిశ్రమలోని అందరి సహకారం మా బలం. మీ అందరి ప్రేమాభిమానాలతో ఈ ప్రయాణం విజయవంతం అవుతుందని విశ్వసిస్తున్నానుఅని అన్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేయనున్నట్టు దర్శకుడు రఘువర్ధన్ కోట్ల తెలియజేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ : సాయి వంశీ దాచపల్లి,ఎడిటర్ : ఉదయకిరణ్ ఏవీ, సంగీత దర్శకుడు : రాజీవ్ రాజ్, ఆర్ట్ డైరెక్టర్ : శ్రీపాల్ మాచర్ల, పాటలు : నాగేంద్ర గోపు, మనోజ్ జులోరి

## 'రుబారూ' పాట రిలీజ్



హీరో అడివి శేష్ ఇప్పుడు పూర్తిగా కొత్త అవతార్‌లో 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముం దుకు రాబోతున్నారు. ఈ చిత్ర ంలో తొలిసారిగా మాస్, పాత్రలో కనిపించనున్నారు. మదనపల్లె స్లాంగ్‌లో డైలాగులు చెప్ప డం సినిమా పై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తు న్నారు. తాజాగా విడుదలైన రుబారూ పాట ప్రేమ, బాధల కలయిక గా అందరినీ హత్తుకుంటోంది. సంగీత దర్శకుడు భీమ్స్ అందించిన స్వరాలు మెలోడీని మరింత ఎలివేట్ చేసింది. ఆయనతో పాటు చిన్మయి వాయిస్ ఈ పాటకు ప్రాణం పోసింది.భాస్కర్ భట్ల రవికుమార్ రాసిన సాహిత్యం ఒక యువకుడి ప్రేమను, ఆ ప్రేమ తర్వాత జరిగిన ద్రోహంతో అతని జీవితంలో వచ్చిన మార్పును అద్భుతంగా పాటలో ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ పాట సినిమా కథలో ఒక కీలక మలుపు కాబోతోంది. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. సినిమాటోగ్రఫీని ధనుష్ నిర్వహిస్తుండ గా, బ్యాగ్రౌండ్ స్కోర్‌నుని అందిస్తున్నారు. 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## పూజ నర్వాల్ ప్రధాన పాత్రలో 'మహిళా కబడ్డీ'



తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం మహిళా కబడ్డీ. ఈ చిత్రంలో ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ వైస్ కెప్టెన్ పూజ నర్వాల్, ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, హీరో సుమన్, అక్సాఖాన్, తులసితో పాటు ఏడుగురు రియల్ కబడ్డీ ప్లేయర్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు . ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ ప్లేయర్ పూజ నర్వాల్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే నాకు కబడ్డీ ఆట మీద చాలా ఆసక్తి ఉండేది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ గెల్చుకున్న తర్వాత ఇప్పుడు నేషనల్, ఇంటర్నేషనల్ ప్లేయర్‌గా ఎదిగాను. వుమెన్ కబడ్డీకి ఎంతో భవిష్యత్ ఉంది. మహిళలకు ప్రో కబడ్డీ లీగ్ కూడా ప్రారంభం కాబోతోంది. కబడ్డీని ప్రొఫెషనల్ గా ఎంచుకునే అమ్మాయిలకు మంచి భవిష్యత్ ఉంటుంది. ఇలాంటి టైమ్ లో 'మహిళా కబడ్డీ' అనే సినిమాను ఆర్కే గౌడ్ రూపొందిస్తుండటం ఇందులో నేను కూడా నటించడం సంతోషంగా ఉంది అన్నారు. హీరో సుమన్ మాట్లాడుతూ తెలుగులో వస్తున్న మంచి స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీ ఇది. ఈ చిత్రంలో కూతురిని కబడ్డీ ప్లేయర్ గా ఉన్నతస్థాయికి తీసుకెళ్లే తండ్రి పాత్రలో నటిస్తున్నాను.

# టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ.21546

### పామాయిల్ రైతులకు మంత్రి తుమ్మల శుభవార్త



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పామాయిల్ రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభవార్త చెప్పారు. టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ.21546లకు పెరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటికి టన్నుకి ఆయిల్ పామ్ గెలల ధర రూ. 12534లు ఉండగా ఈ నెల రూ.21546లకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్ పామ్ సాగును లాభ సాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఆయిల్ ఫెడ్ వారి ప్రోసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం, ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు. అయితే తెలంగాణ ఆయిల్ ఫెడ్ ద్వారా నడపబడుతున్న అప్పరావ్ పేట, అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడం, ఉన్న యంత్రాలను అధునికరించడం వల్ల ఆయిల్ పామ్ గెలల నుండి వచ్చే నూనె రికవరీ శాతం ( ఒఇఆర్) టన్నుకు 20.01 శాతానికి పెరగడంతో ధర కూడ పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో 199293 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాలను (79,113 రైతులు) ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందని, ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1,07,400 ఎకరాలలో 33500 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టరని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం రూ.456 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం 68,600 ఎకరాల నుండి ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తి జరుగుతున్నదని చెప్పారు. రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు ఎకరాకు రూ. 5091 రాయితీని నాలుగు సంవత్సరాల కాలానికి ఇవ్వడం జరుగుతున్నదని, దీర్ఘకాలిక లాభాల నుండి ఆయిల్ పామ్ సాగు కోసం రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

## మోడల్ రాకెట్

(మొదటి పేజీ తరువాయి)



నిలిచింది. శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో రుద్రమగా నామకరణం చేసి రాకెట్‌ను రూపొందించిన శశాంక్ భూపతి, ఎటిడిఆర్‌ఎల్ బృందం సభ్యులు భద్రకాళి బండ్ వద్ద నుండి ఈ మోడల్ రాకెట్‌ను ప్రయోగించారు. మోడల్ రాకెట్ రుద్రమ వేగంగా ఆకాశం వైపు దూసుకెళ్లింది. హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరమైన చారిత్రక వరంగల్ నగరంలో మోడల్ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భద్రకాళి బండ్ వద్దకు విద్యార్థులు, యువత, నగరవాసులు చేరుకున్నారు. ఎటిడిఆర్ఎల్ బృందం సభ్యులు రాకెట్ ప్రయోగాన్ని చేపట్టగానే వారంతా ఆసక్తిగా తిలకించారు. రాకెట్ ప్రయోగం విజయవంతంగా నింగి వైపు దూసుకెళ్తుండడంతో ఉత్సాహంగా కేరింతలు పెట్టారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో సరికొత్త చరిత్రను సృష్టించింది. తొలి దశగా చిన్న మోడల్ రాకెట్ ప్రయోగంగా మొదలుపెట్టిన రాకెట్ ప్రయోగం విజయ తీరాలకు చేరడంతో రానున్న భవిష్యత్తులో పెద్ద స్వప్నాలకు నాంది పలికింది. నూతన ఆవిష్కరణలకు, మరింత మంది ఔత్సాహికులను విజ్ఞాన తీరాల వైపు నడిపించేందుకు ఈ ప్రయోగం ఊతమిస్తోంది. భద్రకాళి బండ్ వద్ద రాకెట్ ప్రయోగానికి వేదిక కావడంతో వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. రాకెట్ ప్రయోగం కౌంట్ డౌన్, ఆకాశం వైపు రాకెట్ సాగే దృశ్యాలను వీక్షించేందుకు డిజిటల్ స్క్రీన్ ను ఏర్పాటు ఏర్పాటు చేశారు. భద్రకాళి బండ్ పై నిర్వహించిన ప్రయోగంలో రాకెట్ ఒకటి రెండు దశల్లో అద్భుతంగా ఎగిరి నిర్దేశిత ఎత్తును చేరుకోగా మూడో దశలో గాలి దుమారం కారణంగా స్వల్ప సాంకేతిక ఇబ్బంది తలెత్తినప్పటికీ చివరకు మొత్తం ప్రయోగ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ భద్రకాళి బండ్ వద్ద మోడల్ రాకెట్ రుద్రమ ప్రయోగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శేషగిరిరావు, ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రటరీ డైరెక్టర్ రఘునందన్ కుమార్, తదితరులు గ్యాలరీ నుండి వీక్షించారు. రాకెట్ ప్రయోగం అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ మోడల్ రాకెట్ ప్రయోగం విద్యార్థులు యువతలో విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు భవిష్యత్తు ప్రయత్నాలకు వేదికగా నిలిచిందన్నారు.

## భారత రైతులకు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు నెలలుగా చేయని పని, 15 నిమిషాల్లో ఎందుకు చేశారు అనే ప్రశ్న తలెత్తుతుందన్నారు. వాణిజ్య ఒప్పందం అకస్మాత్తుగా ఎందుకు జరిగిందని నిలదీశారు. ప్రతి సంవత్సరం భారతదేశం రూ. 9 లక్షల కోట్ల విలువైన ఉమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని మోదీ ట్రంప్‌నకు హామీ ఇచ్చారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం భారతీయ రైతులను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవాణే జ్ఞాపకాలపై వ్యాఖ్యానించాలనుకున్నందున రాష్ట్రపతి ప్రసంగం తర్వాత ఇటీవల లోక్‌సభలో మాట్లాడటానికి తనకు అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. జనరల్ నరవణే (రిటైర్డ్) రాసిన ఒక ప్రచురించని పుస్తకాన్ని ప్రస్తావించాలని అనుకున్నానని, సరిహద్దు వద్ద చైనా దళాల కదలికల సమయంలో రాజకీయ నాయకత్వం నుండి స్పందన లేకపోవడాన్ని ఆ పుస్తకంలో వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ' నాలుగకు నెలలుగా అమెరికా, భారత్ మధ్య ఒప్పందం ఎందుకు నిలిచిపోయిందని నేను నిపుణులను అడిగాను. అమెరికా భారత వ్యవసాయ రంగాన్ని తెరవాలని కోరుకుంటుందని, మన ప్రభుత్వం దానిని తెరవడానికి ఇష్టపడటం లేదని నాకు సమాధానం వచ్చింది' అని గాంధీ అన్నారు. నాలుగు నెలలుగా ఈ రంగంలో ఏమీ జరగలేదని ఆయన అన్నారు. కేబినెట్, వ్యవసాయ మంత్రి, రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రిని సంప్రదించకుండానే ప్రధాన మంత్రి అమెరికా అధ్యక్షుడికి ఫోన్ చేశారని ఆయన అన్నారు. ఈ ఒప్పందానికి తాను సిద్ధంగా ఉన్నానని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చెప్పారని రాహుల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, భారతదేశం అమెరికాకు సోయాబీన్స్, మొక్కజొన్న, పత్తి, పండ్లు, బాదం అమ్మకాలను అనుమతించిందన్నారు. మన రైతులు యాంత్రికం కాదని, వారికి చిన్న భూ కమతాలు ఉన్నాయన్నారు. అమెరికాలో, భూ కమతాలు పెద్దవిగా, యాంత్రికంగా కూడా ఉన్నాయని ఆయన అన్నారు. 'నరేంద్ర మోదీ వ్యవసాయ రంగానికి తలుపులు తెరిచారు. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ఈ రాష్ట్రాలన్నింటిలోని రైతులు నాశనమవుతారు' అని ఆయన ఆరోపించారు. భారతదేశం ప్రతి సంవత్సరం రూ. 9 లక్షల కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేస్తే, మన చిన్న, మధ్య తరహా రంగానికి ఏమి జరుగుతుందో అని గాంధీ అన్నారు. భారతదేశం కోరుకునే దేశం నుండి చమురు కొనుగోలు చేస్తుందని ప్రధాని మోడీ అమెరికాతో చెప్పారని ఆయన అన్నారు. 'మేము రష్యా నుండి లేదా ఇరాన్ నుండి చమురు మాత్రమే కొనుగోలు చేయము. మీరు (యుఎస్) వెనిజులా, యుఎస్, సౌదీ అరబ్ దేశాల నుండి చమురు కొనమని చెబితే, భారతదేశం మొత్తం ఇంధన భద్రత ముగిసినట్లే' అని గాంధీ అన్నారు.

**ఇసిహెచ్ఎస్‌కు నిధులివ్వండి : మంత్రి నిర్మలకు రాహుల్ లేఖ**

మాజీ సైనికుల కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఇసిహెచ్ఎస్)కు నిధులు ఇవ్వాలని, వైకల్య పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేఖ రాశారు. సాయుధ దళాల సిబ్బందిని ప్రభావితం చేసే రెండు అంశాలపై చర్య తీసుకోవాలని అభ్యర్థిస్తున్నట్లు గాంధీ సీతారామన్‌కు రాసిన లేఖలో తెలిపారు. వికలాంగుల పెన్షన్లపై కొత్తగా ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను గురించి లేఖలో ప్రస్తావించారు. దీనిని ఆదాయంగా పరిగణించరాదని, ప్రశంసించదగిన దానిపై పన్ను విధించడం అవమానకరం అని అన్నారు. ఇసిహెచ్ఎస్ అనుభవజ్ఞులకు ఉత్తమ ఆరోగ్య సంరక్షణను అందించడానికి రూపొందించబడిందని, దానికి తగినంత నిధులు సమకూర్చాలని రాహుల్ అన్నారు. ఇసిహెచ్ఎస్ పథకం తీవ్రమైన నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటుందని, 12,000 కోట్లకు పైగా వైద్య బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బడ్జెట్ కేటాయింపులు అవసరానికి మించి దాదాపు 30% తక్కువగా ఉన్నాయరు. చెల్లింపులు చేయకపోవడం వల్ల ఆసుపత్రులు వైదొలుగుతున్నాయని, వృద్ధులు తమ సొంత జేబుల నుండి చెల్లించవలసి వస్తుందని, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు చికిత్సను ఆలస్యం చేస్తున్నారని గుర్తుచేశారు. దేశానికి సేవ చేసిన వారు తమ అవసరమైన సమయంలో నిర్లక్ష్యం చేయబడ్డారని భావిస్తున్నారు రాహుల్ పేర్కొన్నారు. సైనికుడిని సర్వీసులో కొనసాగిస్తే వికలాంగుల పెన్షన్లపై పన్ను విధించాలనే ఆర్థిక బిల్లు 2026లో చేసిన ప్రతిపాదనను కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుర్తుచేశారు. 'సాయుధ దళాలలో పనిచేస్తున్న మన సోదర–సోదరీమణులు కృతజ్ఞతగల దేశం నుండి ప్రతి మద్దతుకు అర్హులని మీరు అంగీకరిస్తారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. అందువల్ల, తగినంత బడ్జెట్ మద్దతుతో పెండింగ్‌లో ఉన్న అన్ని ఇసిహెచ్ఎస్ బాధ్యతలను క్లియర్ చేయాలని, వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను' అని ఆయన అన్నారు. గాంధీ తన లేఖ కాపీని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా పంపారు.





## పోరాటం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీరామ కళ్యాణమండపంలో నాలుగవ రాష్ట్ర మహాసభలు ప్రారంభ సభ నిర్వహించారు. ముందుగా ఎఐటియుసి పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ఆవిష్కరించగా కార్మిక ఉద్యమంలో అశువులు బాసిన కార్మికోద్యమ అమరవీరుల స్మారక స్థూపానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాకారులు ఆలపించిన పాటలు కార్మికులను ఎంతగానో ఉత్తేజపరిచాయి. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులు ప్రాణాలకు తెగించి రోగుల మలమూత్రాలు ఎత్తిపోస్తూ కనీస వేతనాలకు నోచుకోకుండా కష్టం చేస్తుంటే కార్మికుల కడుపులు మాత్రం నిండటం లేదని, ఏజెన్సీ కాంట్రాక్టర్ల జేబుల్లోకి మాత్రం ప్రభుత్వ సంపద వెళుతూ కార్మికుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాసుపత్రుల కార్మికులకు ఎలాంటి గుర్తింపు లేకుండా ఉద్యోగ భద్రతకు నోచుకోకుండా దినదిన గండంగా జీవనం సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న దివాలా కోరు ఆర్థిక ఉదారవాదం విధానాల ఫలితంగానే కార్మిక వర్గం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కర్, సూపర్వైజర్, కార్మికుల జీతభత్యాలు చెల్లింపులకై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏజెన్సీ విధానం పూర్తిగా లోప భుష్టమైనదని, దీని ఆసరాగా చేసుకొని కాంట్రాక్టర్లు అవినీతి అధికారులు లబ్ధి పొందుతున్నారే తప్ప కార్మికులకు మాత్రం ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవోలు ఆదేశాల ప్రకారం మాత్రం వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరాకోరక చెల్లించే వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్లో ఉండడం చేత కార్మికుల కుటుంబం ఇబ్బందుల పాలవుతున్నాయని, అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా చవిచూశాయని అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి కార్మికుల సంక్షేమం పట్ల సమగ్రమైన విధానం తీసుకురాలేకపోవడం విచారకరమని అన్నారు. కాలం చెల్లిన పాత ఏజెన్సీలను రద్దుచేసి కార్మికుల 26వేల కనీస వేతనం అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధనకై కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్. భాషు మియా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ , మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. లక్ష్మి బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవిందర్ రెడ్డి, వై. ఓమయ్య, తోటా రామాంజనేయులు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చెన్న కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com